

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 278

శుక్రవారం 29-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




రన్నరప్ హంపి...

ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సొంతం -15లో



ఈడీ చార్జిషీట్‌లో ప్రియాంక

మనీ లాండరింగ్ కేసులో పేరును ప్రస్తావించిన అధికారులు -6లో



మరణశిక్ష రద్దు

గూఢచర్యం ఆరోపణలపై 8 మంది భారత మాజీ నేవీ అధికారులకు విధించిన మరణ శిక్షను ఖతార్ అప్పీలేట్ కోర్టు రద్దు చేసింది.

- వివరాలు 6లో



వారి ఫోన్లపై పెగాసస్ నిఘా!

ఇద్దరు భారతీయ జర్నలిస్టుల ఫోన్లు పెగాసస్ స్పైవేర్ హ్యాకింగ్‌కు గురైనట్లు నిర్ధారణ అయిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటించింది.

- వివరాలు 6లో



పెట్రో ధరలు తగ్గించే యోచన!

పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.6–10 తగ్గించాలని మోదీ సర్కార్ భావిస్తోందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

- వివరాలు 6లో



మేమొస్తే కుల గణన

లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి గెలిస్తే దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

- వివరాలు 6లో



'కెప్టెన్' విజయకాంత్ కన్నుమూత

అనారోగ్యంతో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచిన డీఎండీకే అధ్యక్షుడు

- విషాదంలో మునిగిన ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు
- ప్రధాని మోదీతోపాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల సంతాపం
- నివాళులర్పించిన తమిళనాడు సీఎం స్టాలిన్
- నేడు చెన్నైలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

12 లో

మనసున్న మాస్ హీరో

తమిళ ప్రజల మనసుల్లో 'మనసున్న మాస్ హీరో'గా చెరగని ముద్ర వేసుకున్న విజయ్‌కాంత్‌పై ప్రత్యేక కథనం

- వివరాలు 14లో

'ప్రజాపాలన' షురూ!

రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, మునిసిపల్ వార్డుల్లో మొదలైన కార్యక్రమం

తొలిరోజు మొత్తం 7,46,414 దరఖాస్తుల స్వీకరణ

- ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు స్వీకరించిన అధికారులు
- దరఖాస్తుల పంపిణీలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో పాల్గొన్న భట్టి, పొంగులేటి
- పలుచోట్ల బ్లాక్‌లో దరఖాస్తులు అమ్మిన దళారులు
- ప్రధానంగా రేషన్‌కార్డులు, పింఛన్లు, రైతుభరోసా, ఇళ్ల కోసం వినతులు
- దరఖాస్తులు నింపేందుకు హెల్ప్‌డెస్క్: సీఎస్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం అడవిరామారంలో గురువారం ప్రజాపాలనలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో అధికారులు, గ్రామస్తులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన' కార్యక్రమం గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రారంభించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లతో పాటు వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు పోటెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో స్థానికులకు అభయహస్తం దరఖాస్తులను పంపిణీ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాజేంద్రనగర్‌లో, పొన్నం ప్రభాకర్ బంజారాహిల్స్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందోల్, సంగారెడ్డిలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. చాలాచోట్ల ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు దరఖాస్తుల పంపిణీ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలు యూనిట్‌గా ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని, నోడల్ అధికారులుగా నియమితులైన సీనియర్ అధికారులు పర్యవేక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మరికొందరు మంత్రులు కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ సభలో పాల్గొనేందుకు నాగ్‌పూర్ వెళ్లడంతో ప్రజా పాలన కార్యక్రమానికి హాజరుకాలేదు.


జిరాక్స్, ఆధార్ సెంటర్లు కిటకిట

ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూతతో పాటు రేషన్‌కార్డులకు కూడా దరఖాస్తులను స్వీకరిస్తారనే ప్రచారంతో తొలిరోజు 'ప్రజా పాలన' కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామ సభలు, మునిసిపాలిటీల్లోని వార్డు సభలకు వివిధ శాఖల ఉద్యోగులు హాజరై దరఖాస్తులు పంపిణీ చేశారు. అయితే చాలాచోట్ల

మిగతా 2వ పేజీలో ▶

ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి

ఫిబ్రవరి 1 నుంచే ప్రాక్టికల్స్... షెడ్యూల్ విడుదల చేసిన బోర్డ్



సాక్షి, హైదరాబాద్: ఇంటర్ పరీక్షల తేదీలను ఇంటర్మీడియెట్ బోర్డ్ ప్రకటించింది. 2024 ఫిబ్రవరి 28న థియరీ పరీక్షలు మొదలవుతాయని తెలిపింది. ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు మార్చి 19తో ముగుస్తాయని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. వీటికన్నా ముందు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపింది. రెండో శనివారం, ఆదివారం కూడా రెండు సెషన్స్‌లో ప్రాక్టికల్స్ ఉంటాయని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు మిగతా 3వ పేజీలో ▶

మేలో ఎంసెట్?

- అప్పుడే సరైన సమయమంటున్న అధికారులు!
- పరీక్ష తేదీలపై విద్యాశాఖ సమీక్ష

-3లో

ఇవి కాంగ్రెస్ అనుకూల ఫలితాలు కావు

బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పు

- బీసీ నినాదానికి, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నాం
- బీజేపీ రాష్ట్ర సమావేశంలో అమిత్ షా

5 లో

ఇక చాలు ఆపండి

వర్గపోరుపై పార్టీ నేతలకు అమిత్ షా క్లాస్

- వివరాలు 5లో



చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

కాళేశ్వరం ఖర్చు రూ.93,872.07 కోట్లు .. ఆయకట్టు అభివృద్ధి 98,570 ఎకరాలే!

రూ.1.27 లక్షల కోట్ల అంచనాతో ప్రాజెక్టు నిర్మాణం

- నేడు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్న నీటిపారుదల శాఖ
- 2028–29 నాటికి 18,64,970 ఎకరాల మిగులు ఆయకట్టు అభివృద్ధి... ఇప్పటివరకు 1,053.98 టీఎంసీల ఎత్తిపోత
- అందుకు 6,918 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం
- కాళేశ్వరం పెండింగ్ బిల్లులు రూ.3,192.08 కోట్లు

- వివరాలు 8లో

మేడిగడ్డకు నేడు మంత్రుల బృందం

శ్రీధర్‌బాబు, ఉత్తమ్, పొంగులేటి, పొన్నం పర్యటన ఖరారు

- హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు...
- అక్కడే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్న ఈఎన్‌సీ
- షెడ్యూల్ విడుదల చేసిన ఇరిగేషన్ శాఖ

7 లో

మహారాష్ట్ర అభ్యంతరాలు, నీటి లభ్యత లేకనే..


- మహారాష్ట్ర అభ్యంతరాలు, తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేకనే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైనింగ్ చేసి ప్రాణహిత, కాళేశ్వరం ప్రాజెక్టులుగా విభజించినట్టు నీటిపారుదల శాఖ స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని నేడు మంత్రుల బృందానికి తెలుపనుంది.

- వివరాలు 8లో

సన్నద్ధతపై సుదీర్ఘంగా

లోక్‌సభ ఎన్నికలపై బీఆర్ఎస్ కసరత్తు

- అధినేత కేసీఆర్‌తో భేటీ అయిన కేటీఆర్, హరీశ్
- అనుసరించాల్సిన కార్యాచరణపై ముమ్మర చర్చలు
- కాంగ్రెస్, బీజేపీల ఎత్తుగడలపైనా నజర్
- ఫిబ్రవరి రెండో వారం నుంచి రంగంలోకి కేసీఆర్!



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల దిశగా సన్నద్ధతను వేగవంతం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కసరత్తు ముమ్మరం చేసింది. శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావుతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు గురువారం నందినగర్‌లోని నివాసంలో సుదీర్ఘంగా భేటీఅయ్యారు. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జరిగిన ఈ సమావేశంలో.. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, కాంగ్రెస్, బీజేపీల సన్నద్ధత, ఎత్తుగడలు, వాటిపై పైచేయి సాధించడం, ఆయా పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థులు తదితర అంశాలపై చర్చించారు. కాగా ఆయా అంశాలపై కేసీఆర్ పలు సూచనలు చేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్న నేపథ్యంలో ఆర్థిక, అంగబలంతో పాటు బలమైన సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను రెండు పార్టీలు బరిలోకి దించుతాయని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది. పార్టీ సిట్టింగ్ ఎంపీలతో పాటు గత ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులకు మళ్లీ అవకాశం ఇస్తే ఎంత మేరకు పోటీ ఇవ్వగలరనే అంశంపైనా చర్చ జరిగినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల తరహాలో ముందస్తుగా అభ్యర్థులను ప్రకటిస్తే ఎదురయ్యే లాభ, నష్టాలపైనా మదింపు జరుగుతోంది.

టికెట్‌పై కొందరికి సంకేతాలు

చేవెళ్ల, జహీరాబాద్, ఖమ్మం సిట్టింగ్ ఎంపీలు క్షేత్రస్థాయిలో పని చేసుకునేందుకు కేసీఆర్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కరీంనగర్, నిజామాబాద్,

మిగతా 2వ పేజీలో ▶



వెస్టిబ్యూల్.. డబుల్ డెక్కర్!



- ప్రయాణికుల రద్దీని తట్టుకోవడంపై ఆర్టీసీ దృష్టి
- మహాలక్ష్మి పథకం అమలుకు చేపట్టాల్సిన చర్యల కోసం 5 కమిటీలు
- బస్సుల సంఖ్య పెంపు, ఒకేసారి ఎక్కువమంది తరలింపు అవకాశాల పరిశీలన... వెస్టిబ్యూల్, డబుల్ డెక్కర్లతో పాటు 12 మీటర్ల బస్సులూ పరిగణనలోకి..

7 లో

కొత్త ఏడాదీ కోతలేనా?

- కలిసొచ్చేలా కన్పించని ఐటీ రంగం
- ఉద్యోగావకాశాలు ఆశించిన మేరకు ఉండకపోవచ్చంటున్న నిపుణులు
- ఆర్థిక మాంద్యంతో ఇబ్బందులు తప్పేలా లేవంటూ ఆందోళన
- ఉద్యోగాలు తొలగించేందుకు సిద్ధమవుతున్న కంపెనీలు
- 2023లో ప్రపంచ వ్యాప్తంగా 2.40 లక్షల మంది తొలగింపు

- వివరాలు 16లో

ఫొటో ఫ్లాష్‌బ్యాక్ 2023

చిత్రం.. సజీవ సాక్ష్యం

ఉత్సవం.. ఉత్సాహం.. ఆనందం.. విషాదం.. చేతికందిన గింజ చేజారిపోయిన బాధ.. ఏడు కిలోమీటర్లు నడిచి ఓటేసిన బాధ్యత.. ఇలా గడిచిన ఏడాది ఆయా సమయం – సందర్భాలలో చోటుచేసుకున్న 'చిత్రా'లెన్నో!. నాడు ఒడిసిపట్టిన ఆయా క్షణాల 'ఫ్లాష్'బ్యాక్ ఫొటోలివీ..



ఆహారం.. అపరిశుభ్ర పరిసరాల్లో ఉన్నా..

ఆకలి ఏ చోటైనా పట్టించుకోదని ఈ చిన్నారులను చూస్తే అర్థమవుతుంది. కరీంనగర్‌లోని ఆటోనగర్ డంప్‌యార్డు సమీపంలో పడేసిన ఆహారం కోసం ఈ చిన్నారులు పోటీ పడతున్న దృశ్యం అందరినీ కలిచివేసింది.



స్వామీ.. మాకీ తిప్పలు ఏమీ

యాదాద్రి స్వామి వారి నిత్యకళ్యాణంలో పాల్గొనేందుకు ఓ వృద్ధురాలు వచ్చింది. అయితే సరిపడా వీల్‌చైర్లు అందుబాటులో లేవు. దీంతో ఆమె నడవడానికి ఇబ్బంది పడగా, అక్కడున్న పోలీస్ సిబ్బంది మోసుకురాక తప్పలేదు.

క్లుప్తంగా...

రైతుబంధుపై ప్రశ్నిస్తే దాడి చేయడం సిగ్గుచేటు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుబంధు నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించిన సురేశ్ యాదవ్ అనే యువకుడిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. ఈ ఘటనకు పాల్పడినవారిపై కఠినచర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీని కోరారు. సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కిశోర్ గురువారం ఆస్పత్రికి వెళ్లి సురేశ్‌ను పరామర్శించారన్నారు. తాను కూడా త్వరలో తుంగతుర్తికి వెళ్లి బాధితుడిని కలుస్తానని కేటీఆర్ ప్రకటించారు.

అధిష్టానం ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా పోటీ

బీజేపీ నేత ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఎక్కడ నుంచి అయినా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ తెలిపారు. తనకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలతో పరిచయాలున్నాయని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీపై కాంగ్రెస్ ఎంత విష ప్రచారం చేసినప్పటికీ ఉత్తర తెలంగాణ ప్రజానీకం పార్టీకి అండగా నిలిచారన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో బీజేపీ ముఖ్య నేతల సమావేశానంతరం ఈటల మీడియాతో మాట్లాడుతూ.. 2019లో రాష్ట్రంలో బీజేపీ 4 ఎంపీ సీట్లు గెలిచి 15 శాతం ఓట్లు సాధించిందని, ఈ నేపథ్యంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 37 శాతానికి పైగా ఓట్లతో అత్యధిక ఎంపీ సీట్లను గెలుచుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. అసెంబ్లీకి ఏ పార్టీకి వేసినా 2024 ఏప్రిల్‌లో జరిగే ఎన్నికల్లో బీజేపీకే ఓటు వేస్తామని ప్రజలు స్వచ్ఛందంగా చెబుతున్నారన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో సత్తా చాటి ప్రధాని మోదీకి మద్దతుగా నిలవబోతున్నామని చెప్పారు. ప్రజలు బీజేపీకి సంపూర్ణంగా అండగా నిలవాలని కోరారు. ప్రధాని మోదీ హయాంలో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అయోధ్య లో రామ మందిర నిర్మాణం పూర్తికాబోతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ మోదీ గెలుపు ఖాయమని, ఒక్క స్కాం లేకుండా పదేళ్ల పాలన సాగించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని చెప్పారు.

పేదల కోసం తపించిన నేత పీజేఆర్: కోమటిరెడ్డి

సాక్షి,హైదరాబాద్: నిరుపేదల కోసం నిరంతరం పరితపించిన మహనీయుడు మాజీ సీఎల్పీ నేత పి.జనార్దన్‌రెడ్డి(పీజేఆర్) అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గుర్తుచేశారు. గురువారం పీజేఆర్ వర్ధంతి సందర్భంగా ఒక ప్రకటనలో నివాళులర్పించారు. జీవితాంతం తెలంగాణ అభివృద్ధి, ప్రయోజనాల కోసం కొట్లాడిన నిజమైన నాయకుడు పీజేఆర్ అని కొనియాడారు.

'ప్రజాపాలన' షురూ!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజలకు దరఖాస్తులు అందలేదు. ఇదే అదనుగా దళారులు రంగంలోకి దిగి ఒక్కో దరఖాస్తుకు రూ.20 నుంచి రూ.100 వరకు వసూలు చేశారు. చాలా మంది జిరాక్స్ దరఖాస్తులలో వివరాలు నింపి ఇస్తే తొలుత వాటిని అంగీకరించలేదు. కానీ తర్వాత స్వీకరించారు. దరఖాస్తులతో పాటు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ బుక్, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డుల జిరాక్స్‌లను కూడా అటాచ్ చేయాల్సి ఉండడంతో ప్రజలు జిరాక్స్, ఆధార్ సెంటర్ల వద్ద బారులు తీరారు. గురువారం సాయంత్రం వరకు ఈ కేంద్రాలు రద్దీగా కన్పించాయి.

మీ సేవా కేంద్రం నిర్వాహకుడిపై కేసు

ప్రజాపాలన దరఖాస్తులను రూ.20కి విక్రయిస్తున్న పటాన్‌చెరులోని గణేష్ మీ సేవా కేంద్రంపై పోలీసులు దాడి చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం వడ్డాదిలో అప్లికేషన్ల కోసం ప్రజలు గంటల తరబడి నిరీక్షించారు. ఆదిలాబాద్ పట్టణంలోని జిరాక్స్ సెంటర్లలో రూ.20 నుంచి రూ.30కి ఒకటి చొప్పున దర ఖాస్తులను విక్రయించారు. కామారెడ్డి జిల్లా బి చ్కుంద మండల కేంద్రంలో దరఖాస్తుల కోసం గ్రామస్తులు పంచాయతీ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు.

అధికారుల పరిశీలన

నిజామాబాద్ జిల్లాలో ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ హరిత ఇందల్వాయి మండలం రంజిత్ నాయక్ తండా, డిచ్‌పల్లి మండలం వెస్లీనగర్ తండా, మాధవనగర్ తదితర ప్రాంతాల్లో ప్రజాపాలన నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు నగర శివారులోని మాధవనగర్, మోపాల్ మండలం తాడెం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన సభలను సందర్శించారు. కామారెడ్డి జిల్లాలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావ్ ఒక్కరే ఈరోజు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఖమ్మం కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామాల్లో కలిపి తొలిరోజు 210 వార్డు, గ్రామ సభలు జరిగాయి. కాగా రాష్ట్రంలోని 141 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో సుమారు 2,358 వార్డులలో ప్రజాపాలన కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు.



హైదరాబాద్‌లో దరఖాస్తులతో మహిళలు

దరఖాస్తులు విక్రయిస్తే కఠిన చర్యలు: సీఎస్

తొలిరోజు ప్రజాపాలనపై సీఎస్ శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్, పంచాయితీ రాజ్ శాఖల ముఖ్య కార్యదర్శులు దాన కిశోర్, సందీప్ సుల్తానియాలు కూడా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7,46,414 దరఖాస్తులను స్వీకరించినట్లు సీఎస్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి 2,88,711, జీహెచ్ఎంసీతో పాటు పట్టణ ప్రాంతాల నుండి 4,57,703 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ప్రతి కేంద్రంలో సరిపడా అభయహస్తం దరఖాస్తు ఫారాలు ఉంచాలని ఆదేశించారు. ఎవరైనా ఫారాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సభలకు హాజరయ్యే వారికి మంచినీటి వసతి కల్పించాలని, క్యూ లైన్లు పాటించేలా చూడాలని సూచించారు. ప్రతి వంద మందికి ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రజా పాలనలో స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు ప్రత్యేక నంబర్ ఇవ్వాలని ఆదేశించారు. ఫారాలను నింపడానికి, ఇతర అవసరాలకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు.

'ఉచితం'పై స్పందించని మహిళలు

వట్‌పల్లి (అందోల్): ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో లబ్ధి పొందుతున్న మహిళలు..దానిపై సరైన విధంగా స్పందించక పోవడంపై రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం పరిధిలోని సంగుపేటలో ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళలతో మాట్లాడారు. 'మీరు బస్సుల్లో తిరుగుతున్నారా? అని ప్రశ్నించగా.. వారు స్పందించలేదు. దీంతో అధికారులు మీరు బస్సుల్లో ఫ్రీగా తిరుగుతున్నారు కదా.. అన్నప్పటికీ కొందరు మహిళలు మాత్రమే చేతులు పైకి లేపారు. దీంతో ఎంత అన్యాయం.. పథకం లబ్ధిపొందుతూ స్పందించరా? అని మంత్రి వ్యాఖ్యానించారు. కాగా బస్సులు మహిళలతోనే నిండిపోతున్నాయని, మగవారికి సీట్లు దొరకడం లేదని కొందరు అనడంతో సభలో నవ్వులు విరిశాయి.

సెల్‌ఫోన్ వెలుగులో దరఖాస్తుల స్వీకరణ



జ్యోతినగర్ (రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లో దరఖాస్తులు అధికంగా రావడంతో రాత్రి వేళ కూడా స్వీకరించాల్సి వచ్చింది. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో విద్యుత్ దీపాలు లేకపోవడంతో సెల్‌ఫోన్ వెలుగులో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

ప్రజల బాగు ప్రతిపక్షాలకు ఇష్టం లేదు

- ఆరు గ్యారంటీలు అమలు కాకుంటే బాగుండునని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయి
- కానీ ఆ పార్టీల కోరిక నెరవేరదు
- ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం
- డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజలు బాగుండటం ప్రతిపక్షాలకు ఇష్టం లేదనీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయకుంటే బాగుండని బీఆర్ఎస్ కోరుకుంటోందని, అలాంటి ఆశలు నిజం కానివ్వబోమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తేల్చిచెప్పారు. అలాంటి పగటి కలలను కనడం బీఆర్ఎస్ మానుకోవాలని సూచించారు. ఆరు గ్యారంటీల పథకాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని గురువారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో స్థానిక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం జరిగిన డిసెంబర్ 28నే ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణ చేపట్టడం శుభపరిణామంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్నది దొరల ప్రభుత్వం కాదని, ప్రజల చేత, ప్రజల కోసం ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వమని వ్యాఖ్యానించారు.

మా పార్టీలోకి వస్తేనే పథకాలు.. అలాంటి బెదిరింపులు ఉండవు

తెలంగాణ రాష్ట్ర బిడ్డలైతే చాలు ఆరు గ్యారంటీ పథకాల్లో అవకాశం కల్పిస్తామని ఈ విషయంలో ఎలాంటి రాజకీయ పక్షపాతం ఉండదని ఆయన తేల్చిచెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా మా పార్టీలోకి వస్తేనే.. మా పార్టీ కండువాలు కప్పుకుంటేనే.. సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పడం వంటి బెదిరింపులు కాంగ్రెస్ పాలనలో ఉండవని భట్టి స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వంలో రెవెన్యూ, పోలీస్‌తో పాటు ప్రతి వ్యవస్థ నా కోసమే ఉందన్న భావన ప్రతి పౌరుడికి కలిగిస్తామని చెప్పారు.



అబ్దుల్లాపూర్‌మెట్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

పదేళ్లుగా మగ్గిపోయిన ప్రజలకు ఇప్పుడే ఊపిరి

కోరి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరక పదేళ్లుగా బీఆర్ఎస్ పాలనలో మగ్గిపోయారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రేషన్ కార్డులు, ఇళ్ల మంజూరు చేయకుండా గత ప్రభుత్వం దుర్మార్గపు పాలన కొనసాగించిందని విమర్శించారు. పదేళ్లుగా కాంగ్రెస్ పోరాటాలతో ప్రజలను చైతన్యవంతులను చేసి ఇందిరమ్మ రాజ్యం తీసుకువచ్చిందని, ఇప్పుడు అర్హులైన అందరికీ న్యాయం జరుగుతుందని భరోసానిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన గంటలోపే రాష్ట్ర మహిళలందరికీ ఉచితంగా ఆర్టీసీ ప్రయాణం కల్పించామని గుర్తు చేశారు. పేద మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, పంచాయతీ రాజ్ కమిషనర్ హనుమంతరావు, ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ శృతిఓజా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు, రాచకొండ సీపీ సుధీర్‌బాబు పాల్గొన్నారు.



భైంసాలోని ఆధార్ కేంద్రం వద్ద చెప్పులను వరుసలో ఉంచిన దరఖాస్తు దారులు



భైంసాలోని ఆధార్ కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న దరఖాస్తుదారులు



భద్రాద్రి కొత్తగూడెం సుజాతనగర్‌లో గురువారం తెల్లవారుజామున బ్యాంకు వద్ద వేచి ఉన్న ప్రజలు

ఇదొక్కటే 'ఆధారం'!

- ఈ–సేవ ఆధార్ కేంద్రాల వద్ద సందడి
- వరుసల్లో నిలబడలేక చెప్పులు పెడుతున్న దరఖాస్తుదారులు

భైంసాటౌన్/భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల కోసం ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో ఏ సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా ఆధార్‌కార్డే ప్రధానంగా మారిపోయింది. అయితే ఆధార్ కార్డుల్లో ఏపీకి బదులు తెలంగాణ ఉండాలని, పేర్లలో ఏమైనా తేడాలుంటే సరి చేసుకోవాలనే ప్రచారం జోరందుకుంది. దీంతో కొత్తగా ఆధార్ నమోదు, కార్డుల్లో సవరణల కోసం ఈ–సేవ ఆధార్ కేంద్రాల వద్దకు ప్రజలు వెళ్తుండటంతో అక్కడ సందడి నెలకొంది. నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఈ–సేవ ఆధార్ కేంద్రం వద్ద అయితే గురువారం ఉదయం 5 గంటల నుంచే దరఖాస్తుదారులు బారులు తీరారు. చిన్నపిల్లలతో వచ్చిన మహిళలు, వృద్ధులు గంటల తరబడి క్యూలో నిల్చోలేక చెప్పులను వరుసలో ఉంచారు. రెండురోజులుగా కేంద్రం తెరువకముందే టోకెన్ల కోసం వేచి ఉంటున్నారు. ముథోల్, తానూర్, దిలావర్‌పూర్, కడెం మండల కేంద్రాల్లోని ఆధార్ ఆపరేటర్ల ఐడీలు తాత్కాలికంగా డియాక్టివ్ చేయడంతో ఈ సమస్య నెలకొందని ఈడీఎం నదీం పేర్కొన్నారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో ఆధార్‌కార్డు అప్‌డేట్‌కు స్థానిక ఏపీజీవీ బ్యాంక్‌లో ఒక్కటే కేంద్రం ఏర్పాటు చేశారు. ఆ సెంటర్‌లో రోజుకు 30 మందికి మాత్రమే ఆధార్ అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో మండల వాసులు తెల్లవారుజామున 3 గంటల నుంచే చలిలో ఇబ్బంది పడుతూ బ్యాంక్ ఎదుట పడిగాపులు కాస్తున్నారు. ఆయా మండల కేంద్రాల్లో తాత్కాలికంగా మూతపడిన ఆధార్ కేంద్రాలను త్వరగా తెరిపించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఖాయం

- నాగ్‌పూర్ సభలో సీఎం
- మోదీ కాలం చెల్లిన మందులాంటి వారు
- వచ్చే ఎన్నికల తర్వాత షెడ్డుకు వెళ్లక తప్పదు
- మహారాష్ట్రలోనూ కాంగ్రెస్ గెలుపు తథ్యం



సాక్షి, హైదరాబాద్: సాధారణ ఎన్నికల తర్వాత ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ కాలం చెల్లిన మందులాంటి (ఎక్స్‌పైర్డ్ మెడిసిన్)వారని, ఆయన వచ్చే ఎన్నికల తర్వాత షెడ్డుకు వెళ్లడం ఖాయమని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ 150 రోజులు, దాదాపు 4 వేలకు పైగా కిలోమీటర్లు భారత్ జోడో యాత్ర చేశారని, ఆ స్ఫూర్తితోనే కర్ణాటకలో, ఆ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించిందని చెప్పారు. కర్ణాటక, తెలంగాణ తర్వాత మహారాష్ట్రలో రాహుల్ ప్రవేశించారని, వచ్చే ఎన్నికల్లో మహారాష్ట్రలోనూ పార్టీ గెలుపు తథ్యమని జోస్యం చెప్పారు. నాగ్‌పూర్‌లో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు

డబుల్ ఇంజిన్ అంటే మోదీ, అదానీ

బీజేపీ డబుల్ ఇంజిన్ అని పదేపదే చెబుతోందని, డబుల్ ఇంజిన్ అంటే మోదీ, అదానీ అని రేవంత్ విమర్శించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో అదానీ గురించి నోరు విప్పగానే ఆ ఇంజిన్ ఆగిపోయిందని ఎద్దేవా చేశారు. మోదీ ఎప్పుడూ చప్పన్ ఇంచ్ ఛాతీ అని గొప్పలు చెప్పుకుంటారని, కానీ ఆయన నేతృత్వంలో నడుస్తున్న లోక్‌సభలోనే ఒక సామాన్యుడు ప్రవేశించి హంగామా చేస్తుంటే ఏమీ చేయలేకపోయారని విమర్శించారు. 'మోదీ జీ..మీరు ఒక సామాన్య వ్యక్తిని పార్లమెంట్‌లోకి రాకుండా ఆపలేకపోయారు. రేపు ఎర్రకోట మీద కూడా కాంగ్రెస్ జెండా ఎగరకుండా ఆపడం కూడా మీతరం కాదు..' అని అన్నారు. జనవరి 14 నుంచి రాహుల్‌గాంధీ 'భారత్ న్యాయ యాత్ర' మణిపూర్ నుంచి మహారాష్ట్ర వరకు కొనసాగుతుందని, దీనితో మోదీ ఇంజిన్ షెడ్డుకు వెళ్లక తప్పదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చి దేశాన్ని కాపాడుకుందామని, పార్టీ శ్రేణులు వచ్చే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు.

ఘనమైన చరిత్రను పరిరక్షించుకోవాలి

- నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీ మాజీ డైరెక్టర్ మృదులా ముఖర్జీ
- ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్ ప్రారంభం

కేయూ క్యాంపస్: భారతదేశపు ఘనమైన చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు సాగుతున్నాయని, ఉత్కృష్టమైన దేశచరిత్రను పరిర క్షించుకోవాల్సిన అవసరం ఉందని ఢిల్లీ నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లై బ్రరీ మాజీ డైరెక్టర్ ఆచార్య మృదులా ము ఖర్జీ అన్నారు. వరంగల్‌లోని కాకతీయ వర్సిటీ ఆడిటోరియంలో గురువారం నుంచి మూడురోజులపాటు జరగనున్న ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఐహెచ్‌సీ) 82వ సెషన్ ప్రారంభ సమావేశంలో మృదులా ముఖర్జీ మాట్లాడారు. పక్షపాతాన్ని ఎప్పటికప్పుడు గమనించి వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియజేయాలన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపర్చిన సెక్యులర్, సోషలిస్ట్, ప్రజాస్వామిక, మౌలిక భావనలు, విధానాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కాలానుగుణంగా సాంకేతిక సంపత్తి పెరుగుతున్న తరుణంలో దళితులను ఆధునీకరించే క్రమంలో భారతదేశ మూలాలు దెబ్బతినకుండా చూడాలని ఆకాంక్షించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఆదిత్యముఖర్జీ 'జవహర్‌లాల్ నెహ్రూ ఇన్ అవర్ పాస్ట్, అండ్ ఫ్యూచర్' అనే అంశంపై మాట్లాడుతూ నెహ్రూను మతతత్వశక్తులు కఠోరంగా చూపిస్తు న్నాయని విచారం వ్యక్తం చేశారు. కేయూ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, ఐహెచ్‌సీ సెక్రటరీ ప్రొఫెసర్ సయ్యద్ అలీ నదీమ్ రిజావి, లోకల్ సెక్రటరీ టి.మనోహర్ మాట్లాడారు. అంతకుముందు ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

సన్నద్ధతపై సుదీర్ఘంగా

▶ మొదటి పేజీ తరువాయి

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాల్లో గతంలో పోటీ చేసిన ఓటమి పాలైన బోయినపల్లి వినోద్ కుమార్, కల్వకుంట్ల కవిత, గెడాం నగేశ్‌కు కూడా టికెట్ దాదాపు ఖాయం కావడంతో వారు ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. ఇలా కచ్చితంగా టికెట్ ఇవ్వాలని భావించిన నేతలకు మాత్రమే సంకేతాలు ఇచ్చి పార్టీ కేడర్‌ను సమన్వయ పరుచుకోవాల్సిందిగా సమాచారం ఇస్తున్నారు. మిగిలిన స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక, పార్టీ స్థితిగతులపై సర్వే సంస్థల నివేదికలతో పాటు వివిధ మార్గాల్లో సేకరించిన సమాచారాన్ని క్రోడీకరిస్తున్నట్లు తెలిసింది. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందడంతో కొత్త అభ్యర్థిని ఎంపిక చేయాల్సి ఉంది. అక్కడి నుంచి కేసీఆర్ బరిలోకి దిగుతారా లేక గతంలో ఇచ్చిన హామీ మేరకు నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డికి టికెట్ ఇస్తారా అనే అంశంపై చర్చ జరుగుతోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తి స్థాయిలో ఆధిక్యం కనబరిచిన మల్కాజిగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాలకు ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేయాలని కేటీఆర్, హరీశ్‌తో జరిగిన భేటీలో కేసీఆర్ అభిప్రాయపడినట్లు తెలిసింది.



జనవరి 3 నుంచి జనంలోకి

పార్టీ కేడర్‌తో అసెంబ్లీ నియోజకవర్గాలు లేదా నియోజకవర్గంలోని మండలాల వారీగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఇప్పటికే నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జనవరి 3వ తేదీ నుంచి క్షేత్ర స్థాయి కార్యకలాపాలు ప్రారంభించాలని కేసీఆర్ ఆదేశించారు. సుమారు నెల రోజుల పాటు క్షేత్ర స్థాయిలో సమావేశాలు ముమ్మరంగా జరిగేలా పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. కాగా ఫిబ్రవరి రెండో వారం నుంచి కేసీఆర్ స్వయంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని గెలిపించాలి

- కాంగ్రెస్ కార్యకర్తలకు టీపీసీసీ నేతల పిలుపు
- గాంధీ భవన్‌లో ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావదిన వేడుకలు



గాంధీ భవన్‌లో జరిగిన 139వ అఖిల భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సాక్షి,హైదరాబాద్: సాక్షి,హైదరాబాద్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని టీపీసీసీ నేతలు పిలుపునిచ్చారు. గురువారం గాంధీ భవన్‌లో 139వ అఖిల భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, సేవాదళ్ వందేళ్ల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జగ్గారెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, ఏఐసీసీ కార్యదర్శి శ్రీనివాసన్, పార్టీ ఫిషరీస్ సెల్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను మహేశ్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించగా.. సేవాదళ్ ర్యాలీని జగ్గారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ, 1885లో బొంబాయిలో 72 మందితో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ.. నేడు 140 కోట్ల ప్రజల హృదయాలను గెలుచుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజల్లో జాతీయ భావాన్ని రేకెత్తించి.. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒకవైపు ప్రజల కనీస అవసరాలు తీర్చడం, మరోవైపు దేశాన్ని పటిష్టం చేయడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు చేసిన సేవలను ప్రజలు మరవలేరన్నారు. సోనియా గాంధీ, పీవీ, మన్మోహన్‌సింగ్ లాంటి వారు దేశం కోసం నిరంతరం శ్రమించారన్నారు.

ఫోటో ఫ్లాష్‌బ్యాక్ 2023



రెక్కల కష్టం కరిగిపోరాదని..

అకాల వర్షాలు రైతుల్నే కాదు...ఇటుక బట్టీ యజమానులనూ ఇబ్బందులకు గురిచేస్తాయి. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ శివారులో బట్టీల వద్ద వర్షాలకు ఇటుకలు తడిసిపోకుండా ఉండేందుకు బట్టీ యజమాని ఇలా కవర్లు కప్పాడు.



పట్నంవారం.. పసుపుమయం

సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి పట్నం వారంతో పులకించి పోయింది. భక్తులు పట్నాలు వేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

సీఎస్ ఉత్తర్వులు అవాస్తవం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులపై అసభ్యంగా మాట్లాడినా.. ఇబ్బందులకు గురిచేసినా వారిపై ఐపీసీ సెక్షన్ల కింద కఠిన చర్యలు తప్పవని ఉత్తర్వులు జారీ అయినట్టు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం నిజం కాదని రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగం అధికారులు స్పష్టం చేశారు.

'రద్దు చేసిన రైళ్లకు ప్రత్యామ్నాయం చూపండి'

సాక్షి, హైదరాబాద్: ఉత్తర భారతదేశం తెలంగాణలోని ప్రధాన పట్టణాల నుంచి కేరళ, తమిళనాడు వెళ్లే రైళ్లు రద్దు కావడం వల్ల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లాల్సిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రద్దైన రైళ్ల స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఈ మేరకు గురువారం బండి సంజయ్ లేఖ రాశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కార్యక్రమంలో పాల్గొనడానికి పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన సమయంలో పలువురు రైళ్ల రద్దు అంశాన్ని తన దృష్టికి తీసుకుని వచ్చారని సంజయ్ పేర్కొన్నారు. జనవరిలో అయోధ్యలో రాముల 'భవ్య ప్రాణ ప్రతిష్ట'ఉన్నందున అక్కడికి భక్తులను తరలించడానికి రైల్వే శాఖ ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో ఉత్తర భారతదేశం నుంచి తెలంగాణ మీదుగా కేరళ వెళ్లాల్సిన అనేక రైళ్లను రద్దు చేసినట్లు వారు తెలిపారని వివరించారు. శబరిమలకు లక్షలాది మంది భక్తులు తెలుగురాష్ట్రాల నుంచి తరలివెళ్తారని, ముందస్తు ప్రణాళిక మేరకు వారు రైల్వే రిజర్వేషన్లు చేసుకున్న తరుణంలో ఇప్పుడు రైళ్లను రద్దు చేయడం సరికాదని పేర్కొన్నారు.

స్టాఫ్‌నర్స్ ప్రొవిజినల్ మెరిట్ జాబితా విడుదల

- రేపటి నుంచి ఆరో తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్
- 1:1.25 నిష్పత్తిలో అభ్యర్థులకు పిలుపు
- ప్రొవిజినల్ జాబితా ఎంపిక జాబితా కాదని స్పష్టీకరణ
- 7,094 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి సన్నాహాలు

సాక్షి, హైదరాబాద్: స్టాఫ్‌నర్స్ పోస్టుల మెరిట్ జాబితాను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ నెల 18వ తేదీన విడుదల చేసిన రాత పరీక్ష ఫలితాలపై అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం ఈ జాబితాను ప్రకటించినట్లు ఆయన వెల్లడించారు. ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ ఆధారంగా 1:1.25 నిష్పత్తిలో అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. మొత్తం స్టాఫ్‌నర్స్ పోస్టులకు 40,936 మంది దరఖాస్తు చేశారు. అందులో 38,674 మంది రాత పరీక్ష రాశారు. వారిలో నుంచి 8,892 మందిని సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలిచినట్లు ఆయన వివరించారు. శనివారం (30వ తేదీ) నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తామని చెప్పారు.

వెరిఫికేషన్ ఎక్కడంటే..

ఎక్సైజ్ అకాడమీ ఫర్ స్టేట్ ఆఫ్ తెలంగాణ (ఈస్ట్), 120/పీ, సెయింట్ మైకేల్స్ కాలనీ, అభ్యుదయనగర్, అభ్యుదయ నగర్ కాలనీ, బండ్లగూడ జాగీర్, హైదరాబాద్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుంది. దరఖాస్తుదారులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లతోపాటు వాటికి సంబంధించి రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలి. అలాగే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తు ఫారమ్ పీడీఎఫ్‌ను వెంట తీసుకొని రావాలి.

ఎవరెవరు ఏయే సర్టిఫికెట్లు తేవాలంటే..

ఆధార్ కార్డ్, పుట్టిన తేదీ రుజువు సర్టిఫికెట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ వర్తించేవారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన కమ్యూనిటీ సర్టిఫికెట్ తీసుకురావాలి. నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్ అందించని బీసీలను ఓసీలుగా పరిగణిస్తారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ క్లెయిమ్ చేసే అభ్యర్థులు తాజా ఆదాయ ధ్రువీకరణపత్రం తీసుకురావాలి. స్పోర్ట్స్ కేటగిరీ కింద రిజర్వేషన్‌ను క్లెయిమ్ చేసేవారు స్పోర్ట్స్ సర్టిఫికెట్ తీసుకురావాలి. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ తీసుకురావాలి. స్థానికతను తెలిపే సర్టిఫికెట్లు, జీఎన్ఎం లేదా బీఎస్సీ నర్సింగ్ సర్టిఫికెట్, తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో వెంట తీసుకొని రావాలి.

నిర్ణీత రోజుల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయం...

ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే ఆరో తేదీ వరకు ప్రతి రోజూ మూడు సెషన్లలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తారు. ప్రతీ సెషన్‌లో 400 నుంచి 500 మంది సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. ఈ మేరకు అభ్యర్థులకు ఇప్పటికే సమాచారం ఇచ్చారు.

మొదటి సెషన్:
ఉదయం 9.15 నుంచి 11.15 గంటల వరకు
రెండో సెషన్:
మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు
మూడో సెషన్:
మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు

ఒరిజినల్ సర్టిఫికెట్లు తేకుంటే అభ్యర్థిత్వం రద్దు

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రాకపోవడం లేదా ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురాకపోతే వారి అభ్యర్థిత్వం రద్దు చేస్తారు. ప్రొవిజినల్ జాబితా ఎంపిక జాబితా కాదని గోపీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కాగా, 7,094 స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేస్తారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చిన వారిలో అనర్హులుండి, పోస్టుల కంటే తక్కువ మంది మాత్రమే అర్హత సాధిస్తే, తమ వద్ద ఉన్న అర్హుల జాబితా నుంచి మరికొందరిని పిలుస్తామని ఆయన తెలిపారు.

మేలో ఎంసెట్?

- అప్పుడే సరైన సమయమంటున్న అధికారులు!
- టెన్త్ పరీక్షలూ మార్చి ఆఖరుకు?

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ పరీక్షల తేదీలు వెల్లడవ్వడంతో ఎంసెట్‌పై అధికారులు దృష్టి పెట్టారు. ఇప్పటికే ఉన్నత విద్యా మండలి అధికారులతో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై సమీక్ష జరిపారు. సాధారణంగా ఎంసెట్ పరీక్షల తేదీలను ఇంటర్, జేఈఈ మెయిన్స్ తేదీలను బట్టి నిర్ణయిస్తారు. ఇంటర్ పరీక్షలు మార్చి 19తో ముగుస్తాయి. జేఈఈ ఏప్రిల్‌లో నిర్వహిస్తున్నారు. దీంతో మే నెలలో ఎంసెట్ నిర్వహణ సరైన సమయంగా అధికారులు భావిస్తున్నారు. గత ఏడాది జేఎన్‌టీయూహెచ్‌కు ఎంసెట్ బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది కూడా ఇదే యూనివర్సిటీకి ఇచ్చే వీలుంది. అయితే, ఎంసెట్ కన్వీనర్ ఎవరనేది ఎంపిక చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు సీజీజీ నుంచి సాంకేతిక సహకారం తీసుకుంటారు. జాతీయ, రాష్ట్ర పరీక్షల తేదీలను గుర్తించి, ఎంసెట్ తేదీలను ఖరారు చేయడానికి ఇది తోడ్పడుతుంది.

టెన్త్‌పై మరోసారి సమీక్ష

గతేడాది ఎంసెట్ దరఖాస్తుల సంఖ్య దాదాపు 20 శాతం పెరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలి, ఎంసెట్ ప్రశ్నపత్రాం కూర్పుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉన్నతాధికారులు చర్చించారు. ఇదే క్రమంలో పదవ తరగతి పరీక్షలపైనా ఓ స్పష్టతకు వచ్చినట్టు తెలుస్తోంది. మార్చితో ఇంటర్ పరీక్షలు ముగియడంతో ఇదే నెల ఆఖరు వారంలో లేదా ఏప్రిల్ మొదటి వారంలో టెన్త్ పరీక్షలు నిర్వహించే వీలుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. టెన్త్ పరీక్షల్లో మార్పులు, చేర్పులు చేయాలా అనే అంశంపై త్వరలో అధికారులు మరో దఫా సమీక్షించే వీలుంది.

ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి

▶ మొదటి పేజీ తరువాయి

మరో సెషన్ ఉంటుందని బోర్డ్ తెలిపింది. ఎథిక్స్, హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షను ఫిబ్రవరి 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఎన్విరాన్‌మెంట్ పరీక్ష ఫిబ్రవరి 19న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపింది.



పరీక్షల షెడ్యూల్ ఇదీ...

(పరీక్ష సమయం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు)

మొదటి సంవత్సరం		రెండో సంవత్సరం	
తేదీ	పరీక్ష	తేదీ	పరీక్ష
28-2.2024	సెకండ్ లాంగ్వేజ్-1	29-2-2024	సెకండ్ లాంగ్వేజ్-2
01-03-2024	ఇంగ్లిష్ - 1	02-03-2024	ఇంగ్లిష్ -2
04-03-2024	మేథ్స్-1ఎ బోటనీ-1 పొలిటికల్ సైన్స్-1	05-03-2024	మేథ్స్-2 ఎ బోటనీ-2 పొలిటికల్ సైన్స్-2
06-03-2024	మేథ్స్-1బి జువాలజీ-1 హిస్టరీ-1	07-03-2024	మేథ్స్-2 బి జువాలజీ-2 హిస్టరీ-2
11-03-2024	ఫిజిక్స్-1 ఎకనామిక్స్-1	12-03-2024	ఫిజిక్స్-2 ఎకనామిక్స్-2
13-03-2024	కెమిస్ట్రీ-1 కామర్స్-1	14-03-2024	కెమిస్ట్రీ-2 కామర్స్-2
15-03-2024	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1 బ్రిడ్జికోర్స్ మేథ్స్-1 (బైపీసీ విద్యార్థులకు)	16-03-2024	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2 బ్రిడ్జికోర్స్ మేథ్స్-2 (బైపీసీ విద్యార్థులకు)
18-03-2024	మోడ్రన్ లాంగ్వేజ్-1 జాగ్రఫీ-1	19-03-2024	మోడ్రన్ లాంగ్వేజ్ -2 జాగ్రఫీ-2

నిశ్చయంగా, ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తారో, వారి ఆతిథ్యం కొరకు ఫిర్దౌస్ స్వర్గ వనాలు ఉంటాయి. వారందులో శాశ్వతంగా ఉంటారు. వారు అక్కడి నుండి వేరగుటకు ఇష్టపడరు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 29 డిసెంబర్ 2023

ఇది ఎవరి తప్పు?

ప్రముఖ దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ చిత్రం 'డంకీ' గత గురువారం విడుదలైనప్పుడు, సరిగ్గా అలాంటి కథే కళ్ళ ముందుకొస్తుందని ఆయనా ఊహించి ఉండరు. సరైన విద్యార్హతలు లేకున్నా, సంపాదనకై లండన్‌కు అక్రమంగా వలసపోవాలనుకొనే నలుగురు పంజాబీల చుట్టూ తిరిగే షారుఖ్ ఖాన్ సినిమా అది. ఈ రోజుల్లో అలాంటి కథ ఏ మేరకు ప్రాసంగికమంటూ కొందరు స్తనశల్య పరీక్ష చేస్తున్నవేళ, యాదృచ్ఛికంగా అచ్చంగా ఆ సినిమాలో లానే, ఇంకా చెప్పాలంటే అంతకు మించిన రీతిలో భారతీయ అక్రమ వలసల ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి నికరాగ్వా వెళ్ళాల్సిన ప్రత్యేక విమానం ఇంధనం నింపుకోవడానికి ఫ్రాన్స్‌లో ప్యారిస్‌కు 150 కి.మీ.ల దూరంలోని వాత్రీ విమానాశ్రయంలో ఆగినప్పుడు ఊహించని విషయం బయటపడింది. విమానంలో మనుషుల అక్రమ రవాణా సాగుతున్నట్టు ఉప్పందడంతో ఫ్రాన్స్ పోలీసులు బరిలోకి దిగేసరికి, అమెరికాకు అక్రమంగా పోవాలనుకున్నవారి ఆశ అడియాస అయింది. పక్కన తోడెవరూ లేని 11 మంది మైనర్లతో సహా మొత్తం 303 మంది విమాన ప్రయాణికుల్లో అత్యధికులు భారతీయులే. భారత్ నుంచి నేటికీ భారీగా సాగుతున్న అక్రమ వలసలకు ఇది మచ్చుతునక.

వివిధ దేశాలకు అక్రమ వలసలు కొత్త కాదు. కానీ ఈ పద్ధతిలో, ఇంత భారీ సంఖ్యలో జరగడం మాత్రం కొత్తే. నికరాగ్వా వీసా మాత్రమే ఉన్నప్పటికీ వారిని అక్రమంగా అమెరికా పంపాలనేది పథకమనీ, ఈ వ్యవహారం నడిపిన ఇద్దరు అనుమానితుల్ని ఫ్రాన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారనీ, ప్రయాణికుల్లో పాతిక మంది శరణార్థులుగా ఆశ్రయం కోరారనీ వార్త. ఇక, మిగిలిన 276 మంది మంగళవారం ముంబయ్‌కి విమానంలో సురక్షితంగా తిరిగొచ్చారు. వ్యవహారం ఇంతటితో ముగిసినట్టనిపిస్తున్నా, అసలు కథ ఇప్పుడే ఉంది. రొమేనియా దేశపు ప్రైవేట్ కంపెనీ నడుపుతున్న విమానంలో ఈ అక్రమ వలస యానం వెనుక అసలు ఉన్నదెవరు? అమెరికా ఆశ చూపి అమాయకులకు టికెట్లు, వీసాలు ఏర్పాటు చేసిన ప్రయాణ ఏజెన్సీలేమిటి? ఈ 'డాంకీ/ డంకీ రూట్' (అక్రమ ప్రయాణమార్గం), ప్రత్యేక విమానాలను ఖరారు చేసిందెవరు? ఇలాంటి అనేక విషయాల దర్యాప్తు మిగిలే ఉంది. నికరాగ్వా చేరకముందే, ఫ్రాన్స్‌లో పోలీసులు అదుపులోకి తీసుకొనేసరికి కొందరు శరణార్థులుగా ఆశ్రయం కోరడం అచ్చంగా 'డంకీ' సినిమాలోని సన్నివేశాలను గుర్తు చేస్తుంది.

నిజానికి, అమెరికాలోని అక్రమ వలస జనాభా విషయంలో మెక్సికో, ఎల్ సాల్వడార్ తర్వాత మూడో స్థానం భారత్‌దే. 2021 నాటి ప్యూ రిసెర్చ్ సెంటర్ నివేదిక ఈ వాస్తవం వెల్లడించింది. భారతీయ అమెరికన్లలో దాదాపు 7.25 లక్షల మంది అక్రమ వలసదారులే! మరో మాటలో – అమెరికాలోని ప్రతి ఆరుగురు భారతీయ అమెరికన్లలో ఒకరు సరైన పత్రాలు లేకుండా ఆ దేశంలో ఉంటున్నవారే! గమనిస్తే, ఒక్క 2022- 23లోనే 96,917 మంది భారతీయులు అక్రమ వలసదారులుగా అమెరికాలో ప్రవేశించే ప్రయత్నం చేశారు. అంతకు మునుపటి ఏడాదితో పోలిస్తే, అది 51.61 శాతం ఎక్కువ. వీరిలో దాదాపు 41 వేల మందికి పైగా మెక్సికన్ సరిహద్దు మార్గం గుండా అమెరికాలోకి వెళ్ళాలని చూశారు. ఎలాగైనా సరే అగ్రరాజ్యపు సందిట్లోకి చేరాలనుకొనే వారికి ప్రయాణ పత్రాలు సులభంగా పుట్టే నికరాగ్వా వాటమైన మజిలీ. మధ్య అమెరికాలోని ఆ అతి పెద్ద దేశం మీదుగా వలస పోతున్నారు. మెక్సికో, కెనడాల నుంచి అమెరికాలోకి ప్రవేశించే ప్రయత్నంలో పలువురు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన వార్తలు ఇటీవల అనేకం వచ్చాయి.

అసలింతమంది భారతీయులు విదేశాలకు వలస పోవాలని ఎందుకనుకుంటున్నట్టు? భారతీయ అమెరికన్ కుటుంబ సగటు ఆదాయం లక్షా 30 వేల డాలర్లు. స్వదేశంలో సరైన ఉపాధి, ఉద్యోగాలు లేక అధిక శాతం మంది విదేశాల వైపు చూస్తున్నారు. అమెరికా, కెనడా లాంటి చోట్ల మెరుగైన ఆదాయం, ఆనందమయ జీవితాలను వెతుక్కుంటూ, 'డాంకీ/ డంకీ రూట్'లోనైనా సరే అక్కడకు చేరిపోవాలని ఆరాటపడుతున్నారు. చిత్రమేమిటంటే, తాజాగా దొరికిన లెజెండ్ ఎయిర్‌లైన్స్ విమానంలో అధిక శాతం మంది పాశ్చాత్య సమాజంతో దీర్ఘకాలిక సంబంధమున్న సంపన్న రాష్ట్రాలైన పంజాబ్, గుజరాత్‌ల వారే! ఇప్పటికే విదేశాల్లో స్థిరపడ్డవారు సొంత భాష, ప్రాంతానికి చెందిన ఈ అక్రమ వలసదారులకు అండగా, సురక్షిత ఆశ్రయంగా మారడం సహజమే.

సంపన్న దేశాల్లో శ్రామికశక్తి లోటును భర్తీ చేయడానికి మనుషులు కావాలి కానీ, సాంస్కృతిక అంతరాల రీత్యా అక్కడ వలసదారులకు లభించే గౌరవం ఎంత అన్నది చర్చనీయాంశమే. దేశాల సరిహద్దులు చెరిపేసిన ప్రపంచీకరణ వ్యాపారంలో జరిగిందే తప్ప, ఇప్పటికీ వ్యక్తులను అనుమతించడంలో, ఆదరించడంలో కాలేదన్నది నిష్ఠురసత్యం. ఏ దేశానికి ఆ దేశం తనవైన నియమ నిబంధనలు పెట్టుకోవడం సహజమే. అయితే, ఉన్న ఊరినీ, కన్నతల్లినీ వదిలేసి, మెరుగైన జీతం, జీవితం కోసం మనవాళ్ళు గల్ఫ్ నుంచి అమెరికా దాకా వివిధదేశాలకు వలసపోతున్న తీరుకు కారణాలపై సమాజం, సర్కారు పెద్దలు ఇప్పటికైనా దృష్టి సారించాలి. భవిష్యత్తు అనిశ్చితమని తెలిసినా సరే, ఎండమావుల వెంటపడి ప్రాణాల్ని పణంగా పెడుతున్న భారతీయ శ్రామికశక్తికి ఇక్కడే ఎందుకు సలక్షణ జీవనమార్గం చూపించలేకపోతున్నామో ఆలోచించాలి. దూరపుకొండల వైపు ఆశగా చూస్తున్న అమాయకులను బుట్టలో వేసుకొని, కళ్ళ ముందు గాలి మేడలు చూపెడుతున్న ఏజెంట్ల వ్యవస్థను పసిగట్టాలి. ప్రాణాంతక అక్రమ వలసలకు ప్రోత్సహిస్తున్న వారి పనిపట్టాలి. ప్రాచీన కాలపు బానిస వ్యాపార వ్యవస్థకు ఆధునిక రూపాంతరమైన మానవ అక్రమ రవాణా వ్యవహారానికి అడ్డుకట్ట వేయాలి. తాజా విమానయాన ఉదంతం అందుకు ఓ మేలుకొలుపు.

సస్పెండ్ చేస్తే సరిపోతుందా?

డిసెంబరు 21న జరిగిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఎన్నికల్లో, మొత్తం పురుషులతో కూడిన 15 మంది సభ్యుల సంఘాన్ని ఎన్నుకున్నారు. వీరిలో 13 మంది సమాఖ్య మాజీ అధ్యక్షుడు, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ సింగ్ విధేయులే. ఫలితాలు వెలువడిన తర్వాత విజేత ప్యానెల్ ప్రవర్తించిన తీరు, కొన్ని నెలల క్రితం బ్రిజ్ భూషణ్‌పై తీవ్రంగా పోరాడిన రెజ్లర్లనే కాకుండా, వారి సాహసోపేత పోరాటానికి మద్దతిచ్చిన వారిని కూడా దిగ్భ్రాంతికి గురి చేసింది. సామాజిక నిషేధాలను ధిక్కరించి క్రీడల్లో పాల్గొనేలా తమ కుమార్తెలను ప్రోత్సహిస్తున్నవారు ఈ సంక్లిష్ట స్థితిలో తీవ్రంగా ప్రభావితమయ్యారు. అయితే, ఈ కొత్త సమాఖ్యను క్రీడా మంత్రిత్వ శాఖ నాటకీయంగా సస్పెండ్ చేసింది. కానీ క్రీడల్లో మహిళల భద్రతపై ఇప్పటికే సన్నగిల్లిన ప్రజా విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి ఇది మాత్రమే సరిపోతుందా?

భారత రెజ్లింగ్ సమాఖ్యకు బ్రిజ్ భూషణ్ సింగ్ విధేయులే ఎన్నిక కావడం, అనంతరం వారి ప్రవర్తనతో తీవ్ర వేదనకు గురైన ఒలింపియన్ సాక్షి మాలిక్ రెజ్లింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. మరో ఒలింపియన్ బజరంగ్ పునియా తన ప్రతిష్ఠాత్మక పద్మశ్రీని వెనక్కు ఇచ్చేస్తానని చెబుతూ ప్రధానికి లేఖ రాశాడు. అతని తర్వాత, మూడుసార్లు డెఫ్లింపిక్స్ (బధిరుల ఒలింపిక్స్) బంగారు పతక విజేత, 'గూంగా పహిల్వాన్'గా ప్రసిద్ధి చెందిన రెజ్లర్ వీరేందర్ సింగ్ కూడా సంఘీభావంగా తన పద్మశ్రీని వెనక్కు ఇచ్చేశాడు.

మల్లయోధుల్లో ఈ తీవ్రమైన ప్రతిచర్యలను ప్రేరేపించినది ఫెడరేషన్ ఎన్నికల ఫలితం మాత్రమే కాదు. తన ఆశ్రితుడు, భారత రెజ్లింగ్ సమాఖ్య నూతన అధ్యక్షుడు అయిన సంజయ్ సింగ్‌తో కలిసి నిలబడి... తన మద్దతుదారులతో మెడలో భారీ పూలదండలు వేయించుకుని, విజయ చిహ్నాన్ని రెపరెపలాడించిన బ్రిజ్ భూషణ్ ప్రవర్తన రెజ్లర్లను తీవ్రంగా స్పందించేలా చేసింది. దీనికి తోడుగా, బ్రిజ్ భూషణ్ కుమారుడు 'దబ్‌దబా థా... దబ్‌దబా రహేగా' (ఆధిపత్యం వహించాం, ఆధిపత్యం వహిస్తాం) అని రాసివున్న ప్లకార్డును పట్టుకోవడం పుండు మీద కారం జల్లింది. ఈ మొత్తం పరిణామాలు, విజేతల అవాంఛనీయ ప్రవర్తన... క్రీడలకు, పౌర సమాజానికి ఇబ్బంది కలిగించే ధోరణిని సూచిస్తున్నాయి. దేశంలో క్రీడాకారిణుల భద్రతకు సంబంధించి ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ఊహించిన ఫలితమే!

ఈ ఎన్నికలకు నిజమైన అర్థం ఏమిటి? మహా అయితే 50 మంది ఓటర్లతో కూడిన ఎలక్టోరల్ కాలేజీని నిర్వహించడం బ్రిజ్ భూషణ్‌కు కష్టమైన పనేం కాదు. పైగా అతను అధికార బీజేపీకి చెందిన శక్తిమంతమైన పార్లమెంటు సభ్యుడు. అందుకే ఈ ఎన్నికల ఫలితాలు ఊహించనివేం కాదు. కాకపోతే ఈ విజయానికి చెందిన వికార ప్రదర్శన, లైంగిక వేధింపుల కేసులకు సంబంధించి బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న మల్లయోధుల ప్రజా ఉద్య మానికి వ్యతిరేక క్లైమాక్స్‌గా వచ్చింది.

జంతర్ మంతర్ వద్ద జరిగిన మల్లయోధుల ప్రత్యేక ఆందోళన చెరగని ముద్ర వేసింది. మహిళలపై లైంగిక వేధింపులు, కుస్తీ పోటీల్లోని ప్రబలమైన అనారోగ్యకర ధోరణి వంటి వాటిని ప్రధాన వేదికపైకి తీసుకురావడంలో ఇది విజయం సాధించింది. మొత్తం జాతి మనస్సాక్షిని కదిలించడంలో 2023లో అత్యంత అద్భుతమైన నిరసన ఉద్యమాలలో ఒకటిగా నిలిచింది. బజరంగ్ పునియాతో పాటు ఇద్దరు మహిళా రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్ చూపిన అద్భుతమైన సంకల్పం, మహిళా సంస్థల నుండి అపూర్వమైన సంఘీభావాన్ని ఆకర్షించింది. రైతు సంఘాలు, క్రీడాకారులు, ఖాప్ పంచాయితీలు, విద్యార్థులు సహా పలు రకాల సామాజిక సంస్థలు సంఘీభావంగా నిలిచాయి.



నిరసనను అణచివేసేందుకు పాలక యంత్రాంగం ప్రదర్శించిన మొరటుదనం, పోలీసుల అణచివేత విఫలమవడంతో, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆందోళన చేస్తున్న రెజ్లర్లతో చర్చలు జరపవలసి వచ్చింది. బ్రిజ్ భూషణ్‌పై కోర్టులో ఛార్జిషీట్ సమర్పిస్తామనీ, అతని సన్నిహితులు రాబోయే ఎన్నికలలో భారత రెజ్లింగ్ సమాఖ్యను స్వాధీనం చేసుకోకుండా చేస్తామనీ హామీ ఇవ్వాల్సి వచ్చింది. కానీ రెండు అంశాలలోనూ మల్లయోధులు మోసపోయారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన నేరాల కింద విచారణ జరిపి దోషిగా తేలేందుకు సరిపడే స్థాయిలో బ్రిజ్‌భూషణ్‌సింగ్‌పై కేసు నమోదైంది. కానీ మైనర్ ఫిర్యాదుదారుల్లో ఒకరిని తన అభియోగాన్ని ఉపసంహరించుకునేలా ప్రభావితం చేశాడని అతడిపై ఆరోపణ వచ్చింది. అలా ఉపసంహరించుకోనట్లయితే పోక్సో చట్టం కింద కచ్చితంగా అతడు అరెస్టు అయ్యే అవకాశం ఉండేది.

నిబంధనలను ఉల్లంఘించి...

అదేవిధంగా, ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత వారి విజయ హాసాలను చూసినప్పుడు, బ్రిజ్ భూషణ్, అతని అనుచరుల ఉడుం పట్టు నుండి రెజ్లింగ్ సమాఖ్యను విడిపిస్తానన్న రెండవ హామీని కూడా ప్రభుత్వం వమ్ము చేసినట్లు తేలింది. జూనియర్ నేషనల్ రెజ్లింగ్ టోర్నమెంట్ వేదికగా ఉత్తరప్రదేశ్‌లోని గోండాలోని నందిని నగర్‌ను ఖాయం చేయడం కూడా వారి అహంకారానికి నిదర్శనం. ఇది బ్రిజ్ భూషణ్ సొంత నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ప్రదేశం. చాలా మంది అమ్మాయిలు అక్కడికి వెళ్లడానికి భయపడుతున్నట్లుగా సాక్షి మాలిక్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. బ్రిజ్ భూషణ్ తన సత్తాను బహిరంగంగా ప్రదర్శించడం, జాతీయ టోర్నమెంట్‌ల వేదికను నిర్ణయించడంలో నియమాలు, నిబంధనలను ఉల్లంఘించడంపై అవార్డులు గెలుచుకున్న క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు కొత్తగా ఎన్నికై న భారత రెజ్లింగ్ సమాఖ్యను సస్పెండ్ చేయాల్సిందిగా ఇది క్రీడా మంత్రిత్వ శాఖపై ఒత్తిడిని పెంచింది.

భారత రెజ్లింగ్ ఫెడరేషన్ నూతన బాడీ ఆకస్మిక సస్పెన్షన్ కారణంగా, బహుశా తాత్కాలికంగానైనా విజేతల ఆనందం ఆవిరైపోయినట్లు కనిపిస్తోంది. మరోవైపున బ్రిజ్ భూషణ్ శిబిరం ఈ ఎన్నికల ఫలితాలను కొత్తగా నిర్వచించడానికి ప్రయత్నించింది. తాము అమాయకులమని చేస్తూవచ్చిన వాదనలకు తగిన నిరూపణగా, ఇది కేవలం రాజకీయ ఉద్దేశ్యాలతో ప్రభావితమైనదిగా చూపేందుకు వాళ్లు ప్రయత్నించారు.

జ్యుడీషియల్ కస్టడీలో ఉంచాలి

ఏమైనా, సామాజిక నిషేధాలను ధిక్కరించి క్రీడల్లో పాల్గొనేలా తమ కుమార్తెలను ప్రోత్సహిస్తున్నవారు ప్రస్తుత సంక్లిష్ట స్థితిలో తీవ్రంగా ప్రభావితమయ్యారు. క్రీడల్లో మెరుగైన కెరీర్‌లు, ఉద్యోగావకాశాలు, వారు గెలిచిన పతకాలతో వచ్చే కీర్తిని చూసిన గ్రామీణ ప్రాంతాల్లోని చాలామంది తల్లిదండ్రులు తమ కుమార్తెలను క్రీడలను వృత్తిగా స్వీకరించేలా మొగ్గు చూపారు. కానీ ఇటీవలి నెలల్లో జరిగిన సంఘటనలు కచ్చితంగా వారి విశ్వాసాన్ని సడలించాయి. ఈ నేపథ్యంలో ఎన్నికైన సంఘాన్ని కేవలం సస్పెండ్ చేయడం క్రీడల్లో మహిళల భద్రతపై ఇప్పటికే సన్నగిల్లిన ప్రజా విశ్వాసాన్ని పునరుద్ధరించదు. కొనసాగుతున్న పోరు ఎలాంటి మలుపు తిరుగుతుందో నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. బ్రిజ్ భూషణ్‌పై బీజేపీ ఎటువంటి క్రమశిక్షణ చర్యా తీసుకోలేదనీ, సుప్రీం కోర్టు ఆదేశించే వరకూ ఢిల్లీ పోలీసులు కేసు కూడా నమోదు చేయలేదనీ ప్రజలకు స్పష్టమైంది. న్యాయమైన విచారణ జరిగేలా, ఫిర్యాదుదారులపై ప్రభావం చూపకుండా నిరోధించడానికి నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీలో ఉంచడం అవసరం.

అన్ని క్రీడా సమాఖ్యలు సమగ్రమైన, సంపూర్ణమైన పరివర్తనల దిశగా తీవ్రమైన చర్యలు తీసుకోవడం అవశ్యం. మహిళల ప్రవేశాన్ని నిరోధించకుండా ఉండేలా ఒక ప్రత్యేక క్రీడా విధానం కావాలి. ఇటువంటి సమూలమైన మార్పునకు విస్తృత ప్రాతిపదికన ప్రచారం అవసరం. ఇందులో భాగస్వాములందరూ మరింత ప్రజాస్వామ్య బద్ధంగా, పారదర్శకంగా, జవాబుదారీగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో మల్లయోధులు ప్రదర్శించిన స్ఫూర్తిని, బలాన్ని ఏకీకృతం చేయడం, మరింతగా విస్తరించడం అవసరం.

– జగమతీ సాంగ్వాన్, వాలీబాల్ క్రీడాకారిణి, భీమ్ అవార్డు తొలి మహిళా గ్రహీత, ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు;

– ఇంద్రజీత్ సింగ్, ఆల్ ఇండియా కిసాన్ సభ ఉపాధ్యక్షుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మంచి మనిషి



విజయకాంత్ మనతో లేరు. ఆయన నాకు మంచి స్నేహితుడు, మంచి నటుడు, అద్భుతమైన మనిషి. సినిమా కుటుంబానికీ, సినీ ప్రేమికులకూ, వ్యక్తిగతంగా నాకూ ఆయన లేని లోటు లోతుగా తెలుస్తోంది. ఆయన కుటుంబం, స్నేహితులకు నా హృదయపూర్వక నివాళి.

– మమ్ముట్టి, నటుడు

బుడగే పదిలం



బుడగలో జీవించడమే ఇండియాలో నయం. బాగా చదువు, కష్టపడు, డబ్బు సంపాదించు, గేటెడ్ కమ్యూనిటీలో ఉండు, మూకలు లోపలికి రాకూడదని ప్రార్థించు. ఎందుకంటే ద్వేషానికి విచక్షణ ఉండదు. మతం, ప్రాంతం, భాష... ఏదో ఒకటి. వాళ్లకు దొరక్కుండా ఉండటమే నీకు మిగిలిన ఆశ.

– శ్రీధర్ వి., స్టాండప్ కమెడియన్

సమష్టి వైఫల్యం



పేదరికం అనేది వ్యక్తిగత వైఫల్యం కాదు: అది వ్యవస్థ, సామాజిక వైఫల్యం. ఆ సమస్య ప్రభుత్వ విధానాల వల్ల స్థిరీకరించబడుతుంది. కానీ భారత సంపన్నులు ఏసీ క్యాబిన్లలో 24 గంటలూ కూర్చుంటూ, రోజుకు పన్నెండు గంటలకు మించి పనిచేసే పేద, మధ్యతరగతి జనాలు సోమరిపోతులని నిందిస్తుంటారు.

– అద్వైద్, క్రానికలర్

దివ్యమైన రుచి



జీవితంలో ఒక్క సారైనా దివ్యమైన ఖీర్/ పాయసం రుచి చూడకపోతే అది విషాదం. పాయస్, కృసర్ రెండూ భారత ప్రాచీన అంత్య ఖాద్యాలు (డిజెర్ట్స్). రామాయణం, మహా భారతం, సుశ్రుత సంహితల్లో కూడా వీటి ప్రస్తావన ఉంది. దేవుడి అమృతాన్ని మనం ఆనందించాలి.

– సావిత్రీ ముముక్షు, పరిశోధకురాలు

మంచి తెలుగోళ్లు



కన్నడిగులు, తమిళ వాళ్లలా తెలుగు వాళ్లకు భాషా గర్వం లేదా? లేక, వాళ్లు మంచి జనాలా? హైదరాబాద్‌లో తెలుగు మాట్లాడలేదని ఉత్తర భారతీయుల్ని ఎవరైనా బెదిరించినట్టుగా ఎప్పుడూ వినలేదు.

– నమ్రత, వ్యాఖ్యాత

దూకుడు పోరాటాలే అందలం ఎక్కిస్తాయా?

అభిప్రాయం



శ్యామ్ సుందర్ వరయోగి

దేశంలో గత కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే అగ్రెసివ్ పోరాటాలూ, రాజకీయాలే ఆయా రాజకీయ పార్టీలను అందలం ఎక్కిస్తాయా అని అనిపిస్తోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిజాయితీగా దూకుడు (అగ్రెసివ్)గా పోరాడిన పార్టీలనే ఓటర్లు ఆదరిస్తారని పలు ఎన్నికలు నిరూపిస్తున్నాయి. బీజేపీ చేపట్టిన రామజన్మ భూమి ఉద్యమం, అయోధ్య రథయాత్ర, అస్సాం గణ పరిషత్ రాజకీయాల నుంచి మొదలు పెట్టి ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దాకా నిశితంగా పరిశీలిస్తే ఈ సంగతి విదితమవుతుంది.

1984 సాధారణ ఎన్నికలలో కేవలం 2 సీట్లు మాత్రమే సాధించిన బీజేపీ అప్పటి దాకా విశ్వ హిందూ పరిషత్, హిందూ సంఘాలు నిర్వహిస్తున్న అయోధ్య ఉద్యమానికి బహిరంగంగా మద్దతు పలికింది. అప్పటి బీజేపీ అధ్యక్షుడైన లాల్ కృష్ణ అద్వాణీ చేపట్టిన అయోధ్య రథయాత్ర దేశంలో సంచలనం రేపింది. అద్వాణీతో పాటు అనేకమంది కార్యకర్తలు అరెస్ట్ అయ్యారు. తదనంతర పరిణామాలు ఆ పార్టీని కేంద్రంలోనూ, పలు రాష్ట్రాల్లోనూ అధికారంలోకి తీసుకువచ్చాయి.



ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలో కూడా అగ్రెసివ్ రాజకీయాలే 'అస్సామ్ గణ పరిషత్'ను అధికారంలోకి తీసుకువచ్చాయి. అస్సాంలోకి విచ్చలవిడిగా జరుగుతున్న బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదార్లకు వ్యతిరేకంగా 'ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్' (ఆసు) ఉద్యమించింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఆసు ప్రఫుల్ల కుమార్ మహంత నేతృత్వంలో 'అస్సాం గణ పరిషత్ (ఏజీపీ) పేరుతో రాజకీయ పార్టీగా ఆవిర్భవించి అస్సాంలో అనతి కాలంలోనే అధికారంలోకి వచ్చింది. మహంత చేపట్టిన విద్యార్థి ఉద్యమానికి ప్రేరేపితులైన అస్సాం ప్రజానీకం ఆయన నేతృత్వంలోని అస్సాం గణ పరిషత్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతుగా నిలిచారు. అలాగే పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎమ్‌సీ) అధినేత్రి మమతా బెనర్జీ తన దూకుడుతనంతో కూడిన రాజకీయ ఉద్యమాలతోనే దశాబ్దాలుగా ఏకఛత్రాధిపత్యంగా ఏలిన కమ్యూనిస్టులను ఓడించారు.

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ తొలి అసెంబ్లీ ఎన్నికల్లో సమైక్యాంధ్రకు 'రెండు కళ్ల సిద్ధాంతం'తో పరోక్ష మద్దతు తెలిపిన తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్ తదితర పక్షాలను వెనక్కినెట్టి అధికారాన్ని చేపట్టింది. అయితే ప్రజా సమస్యలను తెలుసుకుంటూ నాటి తెలుగు దేశం పాలనను ఎండగడుతూ పాదయాత్ర చేసిన వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రజల మనసు గెలుచుకున్నారు. ఫలితంగా మలి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి అధికారం అప్పగించారు.

ఇక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించిన టీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రం ఏర్పాటు తర్వాత వరుసగా రెండు సార్లు తెలంగాణ ప్రజలు అధికారాన్ని కట్ట బెట్టడం గమనార్హం. ఆ పార్టీ చేసిన అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల ముందు ఎండగట్టిన బీజేపీ పోరాటాల ద్వారా ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగింది. నాటి తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడైన బండి సంజయ్ చేపట్టిన 'మహా సంగ్రామ పాదయాత్ర'తో బీజేపీ గ్రామీణ ప్రాంతాల్లో కూడా బాగా బలపడింది. నిరుద్యోగులు, ఉద్యోగులు ఆర్టీసీ కార్మికులు, టీచర్లు వంటి వారి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసింది. దీంతో దుబ్బాక, హుజూరాబాద్ ఉపఎన్నికలతోపాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి అనూహ్య విజయాలను ప్రజలు అందించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల ముందు బండి సంజయ్‌ను పార్టీ అధ్యక్ష స్థానం నుంచి బీజేపీ కేంద్ర నాయకత్వం మార్చింది. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వచ్చిన ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ప్రజలను నమ్మించడంలో సఫలీకృతులయ్యారు. గతంలోని కాంగ్రెస్ నాయకుల కంటే విభిన్నమైన రీతిలో పార్టీని ఉద్యమ పంథాలో ముందుకు నడిపి రాష్ట్రంలో ఇతర పక్షాల మద్దతు అవసరం లేకుండానే 64 సీట్లు సాధించి ముఖ్యమంత్రి అయ్యారు.

ఈ విధంగా కేంద్రంలో కాని, రాష్ట్రాల్లో కాని ప్రజ లపక్షాన నిలిచి దూకుడుగా రాజకీయాలు చేసిన పార్టీలనే ప్రజలు అందలం ఎక్కిస్తారని తేటతెల్లమవుతోంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ఉద్యమకారులంటే ఎవరు?

'అన్నా! ఎఫ్ఐఆర్ నంబర్ అడుగుతున్నారు.. నేను ఎఫ్ఐఆర్ బుక్ అయ్యే ఏ పనీ చేయలేదు! రాజ్యాంగబద్ధంగా, ఉద్యమం చేసిన కదా? ఇక నా గతి ఇంతేనా?' అని ఫోన్ చేసి తన ఆవేదనను వ్యక్తపరిచాడు భార్గవ. భార్గవ, ఒక కరుడుగట్టిన తెలంగాణ ఉద్యమకారుడు. వృత్తిపరంగా అతడు ఒక టైపిస్టు. ప్రతి ఉద్యమ సంఘానికి ప్రెస్‌నోట్‌లు కొట్టడం, ప్రతి సమావేశానికి హాజరై చప్పట్లు కొట్టడం, ఇలా 20 ఏళ్ల నిరంతరంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. ఇప్పుడు ఆయనకు కనీస వసతి కూడా లేదు. అర్హుడైన అతనికి 'డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్'ను గత ప్రభుత్వం ఇవ్వలేదు. నూతన ప్రభుత్వమైనా న్యాయం చేస్తుందని ఎదురు చూస్తున్నాడు. తీరా మొన్న ప్రభుత్వం విడుదల చేసిన దరఖాస్తు పత్రం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఇటువంటి వారు ఎందరో ఉన్నారు.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'అభయ హస్తం' కింద ప్రజా పాలన దరఖాస్తు పత్రంలో 'ఇందిరమ్మ ఇండ్లు' పథకం కింద పాయింట్ నెంబర్ 2 'అమరవీరులు మరియు ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం' అనే ఒక కాలం పెట్టడం అభినందనీయం! కానీ అందులో ఎఫ్ఐఆర్ లేదా జైలుకు వెళ్లిన వివరాలను ఆధారాలుగా తీసుకోవడం సరికాదు. తెలంగాణ ఉద్యమం శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగింది. ప్రాణ త్యాగాలు జరిగినై గాని హింస జరగలేదు. అడపా దడపా ప్రభుత్వ ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చు గాక. ఎక్కువ శాతం నిరాహార దీక్షలూ, సభలు సమావేశాలు జరుపుకోవడమే జరిగింది. రాజ్యాంగబద్ధంగా నిరసనలు, ఉద్యమాలు చేసే పౌరుల మీద ఎఫ్ఐఆర్లు ఎందుకు నమోదయితాయి? జైళ్ళకు ఎందుకు పోతారు? ఎఫ్ఐఆర్‌లను పరిగణలోకి తీసుకుంటే ఇది భవిష్యత్తులో ఉద్యమ విధానాలను అప్రజాస్వామ్యబద్ధంగా జరగటానికి మార్గదర్శకమవుతుంది.

ఉద్యమంలో కొందరు ప్రాణ త్యాగాలు చేస్తే, ఎందరో తమ విలువైన జీవితాలను ఉద్యమానికి అంకితం చేసి, ఆర్థికంగా, వృత్తిపరంగా ఎంతో నష్టపోయారు. ఒక మీటింగ్ పెడితే వేదికపై ఉద్యమ నాయకులు ఒక పది మంది ఉంటే, ఆ సభకు హాజరైన ఉద్యమకారులు వందలమంది ఉంటారు. వారందరూ ఉద్యమకారులే.

ఉద్యమకారుల జాబితా తయారు చేయటానికి ప్రభుత్వం ఒక కమిటీ వేయాలి. తెలంగాణ సిద్ధించక ముందు, తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకున్నట్లు పత్రికల్లో అచ్చయి ఉండాలి, లేదా టీవీల్లో, వీడియోల్లో రికార్డయి ఉండాలి, ఏదైనా ఉద్యమ సంఘం యొక్క రిజిస్టర్లో వివిధ సమావేశాలకు హాజరైనట్టుగా సంతకం చేసి ఉండాలి... ఇలా కొన్ని నియమాలు పెట్టాలి. ఉద్యమకారుల హక్కుల కోసం మరో ఉద్యమం మొదలవకముందే, ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమంపై దృష్టి పెట్టి, వాళ్ల జీవితాలలో వెలుగులు నింపితే మేలు.

– సయ్యద్ రఫీ, సినీ దర్శకుడు

ప్రజాపాలన ఒక వరం

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలోని అన్ని ప్రాంతాలలో, అన్ని గ్రామాల్లో పాత 10 జిల్లాల ప్రాతిపదికన 'ప్రజాపాలన' నిర్వహించడం పేద, బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలకు వరంగా చెప్పవచ్చు. మండల కార్యాలయాలు, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ కాళ్ళకు చెప్పులు అరిగేలా తిరిగినా కాని పనులు ప్రజల దగ్గరకు వెళ్ళి అధికారులే పరిష్కరించడం గొప్ప విషయం. ఆహ్వానించదగిన కార్యక్రమం.

ప్రభుత్వం పేదలకు చేపట్టే కార్యక్రమాల ఫలాలు అర్హమైన గడప గడపకూ చేరాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రంలోని పాత 10 జిల్లాలకు ఒక్కో జిల్లాకు ఒక్కో మంత్రి ఇంచార్జీలుగా నియమితులయ్యారు. ఈ ప్రజాపాలనలో అనేక సమస్య లకు పరిష్కారం చూపిస్తున్నట్లు ప్రభుత్వం అంటోంది. ముఖ్యంగా మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు తీసుకొని సంబంధిత అధికారులకు అప్పటికి అప్పుడే పంపుతున్నారు.



తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్ పేరును మార్చివేసి 'జ్యోతీరావు పూలే ప్రజా భవన్'గా మార్చారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజాసమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు.

డిసెంబర్ 28న ప్రారంభించిన ప్రజాపాలన జనవరి 6 వరకు పనిదినాల్లో కొనసాగుతుంది. అర్హులైన లబ్ధిదారులకు నిర్ణీత కాల వ్యవధిలో సామాజిక భద్రత కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు తీసుకొంటున్నారు. ప్రభుత్వ అధికారులు స్వయంగా ప్రజల దగ్గరకు వెళ్లి దరఖాస్తులు స్వీకరించడం ఈ కార్యక్రమంలో ముఖ్యమైన అంశం. స్త్రీ పురుషులకు, వృద్ధులకూ విడివిడిగా కౌంటర్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తులన్నీ కంప్యూటరీకరణ చేసి రసీదు జారీ చేస్తున్నారు. ప్రతి దరఖాస్తుకు ఒక ప్రత్యేక సంఖ్యను కేటాయించి తర్వాత వెరిఫికేషన్ చేసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు అందుబాటులో ఉండకపోవడం, ఉన్నా దరఖాస్తులో తప్పులు ఉన్నాయని మాటిమాటికీ చెప్పులరిగేలా తిప్పడం, ఆన్‌లైన్ చేసి రావాలని చెప్పడం, ఆన్‌లైన్ చేసి వచ్చినా లైన్‌లలో నిలబెట్టడం లాంటి విషయాలతో విసిగి వేసారి పోయిన ప్రజలకు ప్రజాపాలన సాంత్వన చేకూరుస్తోంది.

– డా॥ ఎస్. విజయ భాస్కర్, ఉపాధ్యాయుడు

(జనవరి 6 వరకు 'ప్రజాపాలన')

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.విదియ ఉ.6.47 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: పుష్యమి రా.2.31 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: ఉ.9.12 నుండి 10.52 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.42 నుండి 9.30 వరకు, తదుపరి ప.12.24 నుండి 1.12 వరకు, అమృతఘడియలు: రా.7.38 నుండి 9.02 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 6.33, సూర్యాస్తమయం: 5.31.

ఫొటో ఫ్లాష్‌బ్యాక్ 2023



మూసీ కెరటాలు

ఎగువన కురిసిన వర్షాలతో మూసీనదికి జలకళ సంత రించుకుంది. సూర్యాపేట మండలం రత్నపురం వద్ద మూసీ ప్రాజెక్టు వెనుక భాగంలో కారుమబ్బులు కమ్మేయగా, మూసీ పరవళ్లు కెరటాలను తలపించాయి.



కష్టం..కన్నీటి పాలు

అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేశాయి. ధాన్యం అమ్మేందుకు మహిళా రైతు యాద్రాద్రి జిల్లా భువనగిరి మార్కెట్ యార్డుకు వచ్చింది. వర్షం కారణంగా ఆ వడ్లన్నీ తడిసిపోయాయి.

ఇవి కాంగ్రెస్ అనుకూల ఫలితాలు కావు

- బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పు
- బీసీ నినాదానికి, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నాం
- బీజేపీ రాష్ట్ర సమావేశంలో కేంద్రమంత్రి అమిత్ షా స్పష్టీకరణ
- బీఆర్ఎస్ మునిగిన నావ.. కాంగ్రెస్ మునగబోతున్న నావ
- కేంద్రంలో మళ్లీ అధికారం బీజేపీదే..
- 300కి పైగా ఎంపీ సీట్లు సాధిస్తామని ధీమా



సమావేశంలో మాట్లాడుతున్న అమిత్ షా, చిత్రంలో మురళీధర్ రావు, రాజాసింగ్, తరుణ్‌చుగ్, ఈటల రాజేందర్, బండి సంజయ్, డాక్టర్ లక్ష్మణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్, ఇబ్రహీంపట్నం రూరల్: ఇటీవల ముగిసిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా వచ్చినవి కావనీ, అవి కేవలం కేసీఆర్ సర్కార్, నాటి అధికార బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పు అని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశ్లేషించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ వేవ్ వంటిదేమీ పనిచేయలేదని, బీఆర్ఎస్‌కు వ్యతిరేక తీర్పుతో తెలంగాణ కుటుంబ పాలన నుంచి విముక్తి పొందినట్టు అయ్యిందని చెప్పారు. కేసీఆర్ కుటుంబపాలన, అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పు ఇది అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సర్కార్ అంటే కేవలం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత మాత్రమే కనిపించే వారని, అందుకే ప్రజలు తిప్పికొట్టి ఫాంహౌస్‌కే పరిమితం చేశారని వ్యాఖ్యానించారు. అయితే కేసీఆర్ కంటే కాంగ్రెస్ ఏమీ తక్కువ కాదనీ, కాంగ్రెస్ దోపిడీ, అవినీతికి వ్యతిరేకంగా బీజేపీ అవిశ్రాంత పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ ఇప్పటికే మునిగిన పడవ కాగా, కాంగ్రెస్ మునిగిపోతున్న నావ అని, ప్రస్తుతమున్న పరిస్థితుల్లో కేంద్రంలో బీజేపీ మూడోసారి కచ్చితంగా అధికారంలోకి వచ్చి తీరుతుందనే ధీమా వ్యక్తం చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని శ్లోక కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాకపోయినా బీసీవర్గాల అభ్యున్నతికి, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు కట్టుబడి ఉందని తెలిపారు. అలాగే ఇతర రాష్ట్రాల్లోనూ బీసీ సీఎం నినాదానికి బీజేపీ కట్టుబడి ఉందని అమిత్ షా చెప్పారు.

మోదీకి పది ఎంపీ సీట్లు బహుమతిగా ఇవ్వండి

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి 10 ఎంపీ సీట్లు గెలిచి ప్రధాని నరేంద్ర మోదీకి బహుమతిగా ఇవ్వాలని పార్టీ శ్రేణులను కోరారు. ఆ మేరకు వచ్చే ఎన్నికల్లో తెలంగాణ నుంచి 35% ఓటింగ్ సాధించి పది ఎంపీ సీట్లు గెలిచేలా కృషి చేస్తామంటూ పార్టీ మండల అధ్యక్షులు ఆపై రాష్ట్రస్థాయి వరకు నాయకులందరితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే సీటు గెలిస్తే ఐదేళ్లలో 8 స్థానాలకు పెరిగామని, 8 స్థానాల నుంచి మళ్లీ వచ్చే అసెంబ్లీ నాటికి 95 స్థానాలకు బీజేపీ పుంజుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ ఇక్కడ అధికారంలోకి వచ్చే వరకు వస్తూనే ఉంటా

''గురువారం నేను హైదరాబాద్‌కు వస్తున్నపుడు ఇద్దరు జర్నలిస్టులు మళ్లీ తెలంగాణకు ఎందుకు వెళుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేదాకా మళ్లీ మళ్లీ రాష్ట్రానికి వీలైనన్ని ఎక్కువసార్లు వెళ్తాను''అని వారికి సమాధానం ఇచ్చానని అమిత్ షా చెప్పారు. ఎన్నికల్లో వచ్చిన ఫలితాలతో నాయకులు, కేడర్‌లో నిరాశ రావడం సహజమేనని, ఐతే బీజేపీ ఎన్నికల కోసమే పోరాడే పార్టీ కాదని, దేశం కోసం, భరతమాత కోసం పోరాడే పార్టీ అని స్పష్టం చేస్తున్నానని చెప్పారు. ''1950నాటి నుంచి బీజేపీ ఎన్నో ఎన్నికల్లో పోటీచేసింది, అనేకసార్లు డిపాజిట్లు కూడా కోల్పోయింది, రెండుసీట్ల నుంచి 300కు పైగా సీట్లతో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన చరిత్రను సొంతం చేసుకుంది.. నాడు వచ్చిన ఫలితాలతో నిరాశ చెంది ఉంటే ఈ స్థాయి ఫలితాలు సాధించగలిగే వాళ్లమా''అని ఆయన ప్రశ్నించారు. 2024 ఎన్నికల్లోనూ 300కు పైగా సీట్లు సాధించి వరుసగా మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతోందన్నారు.

ఆ సంకల్పం తీసుకోండి

''గుజరాత్‌లో బీజేపీ అధికారంలోకి రావడానికి ముందు జరిగిన ఎన్నికల్లో 9% ఓట్లు సాధించింది.. ఆ తర్వాత మూడింట రెండు వంతుల మెజారిటీతో అధికారానికి వచ్చింది.. దాంతో పోలిస్తే తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో 14% ఓటింగ్ వచ్చినందున, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడా మూడింట 2వంతుల మెజారిటీతో పార్టీ అధికారంలోకి వచ్చేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంకల్పం తీసుకోవాలి''అని అమిత్‌షా పిలుపునిచ్చారు.

పీఎంగా మోదీ.. రాహుల్.. మీకు ఎవరు కావాలి?

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థులుగా మోదీ, రాహుల్‌గాంధీ ఉంటే ఎవరు ప్రధాని కావాలి అంటూ అమిత్ షా అడగ్గా.. మోదీ.. మోదీ అని శ్రేణులు బిగ్గరగా అరిచి మరీ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మోదీ గెలుపు చారిత్రక అవసరమని, ప్రజల్లోకి వెళ్లి మళ్లీ మోదీని గెలిపిద్దామని కోరుతూ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టగా, జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ బలపరుస్తూ మాట్లాడగా దానిని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ సత్తా చూపిస్తాం: కిషన్‌రెడ్డి

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగబోయే లోక్ సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ సత్తా చూపిస్తామని చెప్పారు. కచ్చితంగా డబుల్ డిజిట్ సంఖ్యలో ఎంపీలను గెలుస్తామని చెప్పారు. జాతీయ ప్రధానకార్యదర్శులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్, బండి సంజయ్, జాతీయ ఉపాధ్యక్షురాలు పార్లమెంటరీ బో ర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, ఎంపీలు అర్వింద్ ధర్మపురి, సోయం బాపూరావు, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, పార్టీనేతలు పొంగులేటి సుధాకరరెడ్డి, గరికపాటి మోహన్‌రావు పాల్గొన్నారు.

బీజేఎల్పీ నేత ఎన్నిక వాయిదా

ఎమ్మెల్యేలు టి.రాజాసింగ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పాయల్ శంకర్, రామారావు పాటిల్, జైపాల్‌రెడ్డి, డా.పాల్వాయి హరీష్‌బాబును రాష్ట్ర నేతలు అమిత్ షాకు పరిచయం చేశారు. వారిని ఆయన అభినందించారు. ఐతే సమావేశానంతరం అమిత్‌షా సమక్షంలో సమావేశం నిర్వహించి బీజేఎల్పీనేతను ఎన్నుకోవాల్సి ఉండగా సమయాభావం వల్ల జరగలేదు. మరోసారి వచ్చినప్పుడు నిర్ణయిద్దామని రాష్ట్ర పార్టీనేతలకు చెప్పిన అమిత్ షా గురువారం రాత్రి ఢిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు.

భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న అమిత్ షా

చార్మినార్/దూద్‌బౌలి: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గురువారం మధ్యాహ్నం చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం జరిగిన సామూహిక పూజ హారతిలో ఆయన పాల్గొన్నారు.

ఇక చాలు ఆపండి ఇప్పటికే వర్గపోరుతో నష్టపోయాం

- ఇంకా పార్టీకి నష్టం జరిగితే ఉపేక్షించం..
- ఎంత పెద్ద నాయకుడైనా చర్యలు తప్పవు
- పార్టీ నేతలకు బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హెచ్చరికలు
- వచ్చే ఎన్నికల్లో నలుగురు సిట్టింగ్ ఎంపీలకు మళ్లీ చాన్స్?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వర్గ విభేదాలు, కొందరు ముఖ్యనేతల మధ్య ఆధిపత్య పోరు, సమన్వయ లేమి కారణంగా బీజేపీ నష్టపోయిందని ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా స్పందించినట్టు తెలిసింది. 'పార్టీపరంగా పెద్ద హోదా ఉందని, తాము ఏం చేసినా చెల్లుతుందంటే కుదరదు.. పార్టీకి నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తే ఎంతటి పెద్దవారినైనా ఉపేక్షించే పరిస్థితి ఉండదు. 'అని స్పష్టం చేసినట్టు పార్టీ వర్గాల సమాచారం. అసెంబ్లీ ఫలితాలు తమను నిరాశపరిచాయని ఆయన వ్యాఖ్యానించినట్టు చెబుతున్నారు. కొందరు ముఖ్యనేతల ఆధిపత్యపోరు, సోషల్ మీడియా వేదికగా ఒక వర్గంపై మరో వర్గం వ్యతిరేక పోస్టులు పెట్టడం వల్ల పార్టీ ఇమేజ్‌కి, పార్టీకి నష్టం జరిగిందనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో 30 స్థానాల్లో పార్టీ గెలుస్తుందని తాము ఆశించామని, ఐతే పైన పేర్కొన్న కారణాల వల్ల అనుకున్న స్థాయిలో ఎమ్మెల్యే సీట్లు గెలవలేకపోయామని పేర్కొన్నట్టు తెలిసింది. గురువారం రాష్ట్ర పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనేందుకు అమిత్ షా నగరానికి వచ్చిన సందర్భంగా తొలుత నోవాటెల్ హోటల్‌లో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, పార్టీనేతలు డా.కె.లక్ష్మణ్, డీకే అరుణ, బండి సంజయ్, పొంగులేటి సుధాకరరెడ్డి, గరికపాటి మోహన్‌రావు తదితరులు భేటీ అయ్యారు.

వారిద్దరినుద్దేశించే ఆ వ్యాఖ్యలా?

పార్టీ నేతల్లో ముఖ్యంగా సంజయ్, ఈటల మధ్య కొంతకాలంగా విభేదాలు తలెత్తి, ఎడమొహం పెడమొహంగా ఉంటున్నందు వల్ల వారిని ఉద్దేశించే పరోక్షంగా అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారంటూ పార్టీనాయకులు గుసగుసలాడుకుంటున్నారు. కొందరు నేతల ముందే సీనియర్లకు అమిత్ షా క్లాస్ తీసుకున్నట్టు తెలిసింది. పరస్పర ఆరోపణలను పక్కనపెట్టి పార్టీ కోసం పని చేయాలని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. లోక్‌సభకు సన్నద్ధం కావడంతో పాటు నేతల మధ్య మెరుగైన సమన్వయానికి కచ్చితమైన చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డికి ఆదేశించినట్టు సమాచారం.

జరిగిందేదో జరిగింది... 10 ఎంపీ స్థానాలు గెలిచేలా..

ఇక జరిగిందేదో జరిగింది.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం తెలంగాణ నుంచి 10 ఎంపీ స్థానాల్లో గెలుపొందేలా నాయకులంతా విభేదాలన్నీ పక్కన పెట్టి సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారని చెబుతున్నారు. గత ఎన్నికల్లో గెలిచిన నలుగురు సిట్టింగ్ ఎంపీలకే మళ్లీ పోటీకి అవకాశం కల్పిస్తామని, మిగిలిన సీట్లలో నాయకుల గెలుపు అవకాశాలపై నిర్వహించే సర్వేల ఆధారంగా అభ్యర్థులను నిర్ణయిస్తామని చెప్పారని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా కాకుండా లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేసినట్టు సమాచారం.

ఖతార్‌లో 8 మంది భారతీయులకు మరణ శిక్ష రద్దు

కేవలం జైలు శిక్షగా మారుస్తూ ఖతార్ అప్పిలేట్ కోర్టు తీర్పు ● భారత్‌కు అతిపెద్ద దౌత్య విజయం

న్యూఢిల్లీ: ఖతార్‌లో గూఢచర్యం ఆరోపణలపై మరణ శిక్ష పడిన 8 మంది భారత నావికాదళం మాజీ అధికారులకు భారీ ఊరట లభించింది. వారికి విధించిన మరణ శిక్షను ఖతార్ అప్పిలేట్ కోర్టు రద్దు చేసింది. ఈ శిక్షను కేవలం జైలు శిక్షగా మారుస్తూ గురువారం కీలక తీర్పు వెలువరించింది. అయితే, వారు ఎంతకాలం జైలులో శిక్ష అనుభవించాలన్నది తెలియరాలేదు. దీనిపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అల్-దాహ్రా గ్లోబల్ టెక్నాలజీస్ కేసులో ఖతార్ కోర్టు 8 మందికి శిక్షను తగ్గించినట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. గూఢచర్యం కేసులో 8 మంది నేవీ మాజీ అధికారులు 2022 ఆగస్టులో ఖతార్‌లో అరెస్టయ్యారు. అప్పిలేట్ కోర్టు తాజా తీర్పును భారత దౌత్య విజయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాప్-28 సదస్సు సందర్భంగా ఇటీవల దుబాయ్‌లో ఖతార్ పాలకుడు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్-థానీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఖతార్‌లో 8 మంది భారతీయులకు విధించిన మరణ శిక్ష గురించి ఈ భేటీలో మోదీ ప్రస్తావించినట్లు సమాచారం. శిక్ష నుంచి వారికి విముక్తి కల్పించాలంటూ మోదీ చేసిన విజ్ఞప్తి పట్ల ఖతార్ పాలకులు సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఖతార్‌లో నివసిస్తున్న భారతీయుల సంక్షేమంపై అల్-థానీతో చర్చించినట్లు ఈ భేటీ తర్వాత మోదీ వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే మరణ శిక్షను రద్దు చేసి, జైలు శిక్షగా కుదిస్తూ ఖతార్ కోర్టు తీర్పు ప్రకటించింది.

బాధితులకు అండగా ఉంటాం

ఖతార్ కోర్టు తాజా తీర్పునకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఎదురు చూస్తున్నామని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. తదుపరి చర్యల విషయంలో న్యాయ నిపుణులతో, బాధితుల కుటుంబ సభ్యులతో సంప్రదింపులు కొనసాగిస్తున్నామని వెల్లడించింది. కోర్టులో గురువారం జరిగిన విచారణకు ఖతార్‌లోని భారత రాయబారి, ఇతర అధికారులు, బాధితుల కుటుంబ సభ్యులు కొందరు హాజరయ్యారని తెలియజేసింది. బాధితులకు అండగా ఉంటామని, అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టంచేసింది.

ఏమిటీ కేసు?

8 మంది భారత మాజీ అధికారులు ఖతార్ రాజధాని దోహాకు చెందిన అల్-దాహ్రా గ్లోబల్ టెక్నాలజీస్ అనే ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నారు. ఈ సంస్థ ఖతార్ సైనిక దళాలకు, సెక్యూరిటీ ఏజెన్సీలకు శిక్షణ ఇస్తోంది. ఇతర సేవలు అందిస్తోంది. అల్-దాహ్రా సంస్థలో పని చేస్తున్న 8 మంది భారతీయులను గత ఏడాది ఆగస్టులో ఖతార్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తమ దేశ రహస్యాలను చోరీ చేస్తున్నట్లు వారిపై అభియోగాలు మోపారు. ఇతర దేశాలకు సమాచారం చేరవేస్తూ గూఢచర్యానికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. అయితే, ఈ అభియోగాలను బహిరంగపర్చలేదు. ఈ ఏడాది అక్టోబర్‌లో ఖతార్ కోర్టు 8 మందికి మరణ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. దీంతో భారత ప్రభుత్వం న్యాయ పోరాటం ప్రారంభించింది. శిక్షను వ్యతిరేకిస్తూ ఖతార్‌లోని కోర్టు ఆఫ్ అప్పీల్‌ను ఆశ్రయించింది. ఖతార్‌లో శిక్ష పడిన వారిలో నవతేజ్ గిల్, సౌరభ్ వశిష్ట్, పూర్ణేందు తివారీ, అమిత్ నాగ్‌పాల్, ఎస్.కె.గుప్తా, బి.కె.వర్మ, సుగుణాకర్ పాకాల, సైలర్ రాగేశ్ ఉన్నారు. వీరిలో సుగుణాకర్ పాకాల ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందినవారు.

మంచు పొగ






1. చైనాలోని హుయాన్‌పై మంచు దుప్పటి
2. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో..
3. ఇరాక్‌లోని మోసుల్ నగరంలో ..
4. జమ్మూ పట్టణంలో..

నదిపైనే ల్యాండింగ్!

ఉపరితలం గడ్డకట్టడంతో తప్పిన ప్రమాదం | రష్యాలో ఘటన



మాస్కో: రన్‌వేపై ల్యాండ్ చేయడం మామూలే.. నది ఉపరితలంపై విమానాన్ని పరుగెత్తించడంలోనే ఉంది అసలు మజా అనుకున్నాడో ఏమో. రష్యాలో చిన్న విమానాన్ని ఒక పైలట్ నేరుగా నదిపైనే ల్యాండ్ చేశాడు. అదృష్టవశాత్తు నది ఉపరితలం మొత్తం దట్టంగా మంచుతో నిండిపోవడంతో ప్రయాణికుల ప్రాణాలు నిలబడ్డాయి. రష్యాలో తూర్పు సైబీరియా పరిధిలోని జిర్యాంకా విమానాశ్రయ సమీపంలో జరిగిందీ ఘటన. రష్యాలోని సఖా రిపబ్లిక్ ప్రాంతంలోని యాకుట్స్క్ నగరం నుంచి 34 మంది ప్రయాణికులతో ఆంటోవ్ ఏఎన్-24 విమానం గురువారం ఉదయం జిర్యాంకా నగరానికి బయల్దేరింది. భారీగా మంచు కురుస్తుండటంతో జిర్యాంకా ఎయిర్‌పోర్ట్ రన్‌వే సరిగా కనబడక దానిని దాటేసి ఎదురుగా ఉన్న కోలిమా నదిపై ల్యాండ్‌చేశాడు. నగరంలో ప్రస్తుతం గడ్డకట్టే చలి వాతావరణం రాజ్యమేలుతోంది. మైనస్ 40 డిగ్రీల ఉష్ణోగ్రత దెబ్బకు నది ఉపరితలం మొత్తం గడ్డకట్టింది. దీంతో దీనిపై ల్యాండ్ అయిన విమానం అలాగే కొన్ని మీటర్లు సర్రున జారుతూ ముందుకెళ్లి ఆగింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఘటనకు కారకుడైన పైలట్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. సోవియట్ కాలంనాటి ఈ చిన్న విమానాన్ని పోలార్ ఎయిర్‌లైన్స్ నడుపుతోంది.

భారతీయ జర్నలిస్టుల ఫోన్లపై పెగాసస్ నిఘా!

ఆధారాలు వెల్లడించిన ఆమ్నెస్టీ ఇంటర్నేషన్

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ నిఘా సాఫ్ట్‌వేర్‌తో కేంద్రప్రభుత్వం హ్యాకింగ్‌కు పాల్పడిందన్న ఆరోపణలకు తాజాగా బలం చేకూరింది. ప్రభుత్వ ప్రాయోజిత హ్యాకర్లతో దేశంలోని ప్రముఖుల ఐఫోన్లను లక్ష్యంగా చేసుకున్నారంటూ 'యాపిల్' నుంచి అప్రమత్తత సందేశాలు అక్టోబర్‌లో వచ్చిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఇద్దరు భారతీయ జర్నలిస్టులు తమ ఫోన్లను ల్యాబ్ పరీక్షకు పంపించగా అవి పెగాసస్ స్పైవేర్ హ్యాకింగ్‌కు గురయ్యాయని తేలింది. తమ సెక్యూరిటీ ల్యాబ్ పరీక్షలో ఈ విషయం నిర్ధారణ అయిందని లాభాపేక్షలేని అంతర్జాతీయ సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ గురువారం ప్రకటించింది. దీంతో ఆనాడు చాలా మందికి పొరపాటున అలర్ట్‌లు వచ్చాయన్న యాపిల్ ఇచ్చిన వివరణ తప్పు అని తేలింది. పెగాసస్ తమ నిఘా సాఫ్ట్‌వేర్‌ను కేవలం దేశాల ప్రభుత్వాలకే విక్రయిస్తోంది. భారత్‌కు చెందిన నిఘా విభాగం సైతం ఇదే సంస్థ నుంచి కొంత హార్డ్‌వేర్‌ను 2017లో కొనుగోలుచేసినట్లు వాణిజ్య గణాంకాల్లో వెల్లడైంది. ఈ స్పైవేర్ సాయంతో దేశంలోని ప్రముఖులు, రాజకీయవేత్తలు, సామాజిక కార్యకర్తలు, న్యాయమూర్తుల ఫోన్లను హ్యాక్ చేశారని 2021 జూలై నెలలో అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడటం తెల్సిందే. భారత్‌లోనూ ప్రముఖులు ఈ హ్యాకింగ్‌బారిన పడ్డారని 'ది వైర్' వార్తాసంస్థ సంచలన కథనం వెలువరిచింది. 'ది వైర్' వెబ్‌సైట్ ఎడిటర్ సిద్ధార్థ్ వరదరాజన్, ఆర్గనైజ్డ్ క్రైమ్స్ అండ్ కరప్షన్ రిపోర్ట్ ప్రాజెక్ట్(ఓసీసీఆర్‌పీ) సౌత్ ఆసియా ఎడిటర్ ఆనంద్ మంగ్నాలే ఫోన్లను హ్యాకర్లు లక్ష్యంగా చేసుకున్నారని ఆమ్నెస్టీ వెల్లడించింది. వివాదాన్ని కప్పిపుచ్చే ఉద్దేశంతోనే భారత ప్రభుత్వమే యాపిల్ సంస్థపై ఒత్తిడి తెచ్చి తప్పుడు అలర్ట్‌లు వచ్చాయని చెప్పించిందని 'వాషింగ్టన్ పోస్ట్' పేర్కొంది. ' భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల ఐఫోన్ యూజర్లకు ఇలా పొరపాటున అలర్ట్‌లు వెళ్లాయి'' అని యాపిల్ ఆనాడు ప్రకటించింది. రాహుల్ గాంధీసహా పలువురు విపక్ష నేతలు, జడ్జీలు, సామాజిక కార్యకర్తల ఫోన్ల హ్యాకింగ్ ఉదంతం గతంలో పార్లమెంట్‌నూ కుదిపేసింది. ఇంత జరిగినా ''తాము స్పైవేర్‌ను ఇజ్రాయెల్ సంస్థ నుంచి కొనలేదు. వినియోగించలేదు'' అని మోదీ సర్కార్ చెప్పకపోవడం గమనార్హం. భారత రక్షణ నిఘా విభాగానికి చెందిన సిగ్నల్ ఇంటెలిజెంట్ డైరెక్టరేట్ గతంలో కాగ్నైట్ అనే సంస్థ నుంచి నిఘా పరికరాలు కొనుగోలు చేసిందని ఆరోపణలు వచ్చాయి.

337 విమానాలు ఆలస్యం

ఢిల్లీలో దట్టమైన పొగమంచు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీని పొగమంచు కష్టాలు వదలట్లేవు. వరుసగా నాలుగో రోజు దట్టమైన పొగమంచు కారణంగా విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 337 విమానాలు ఆలస్యంగా బయలుదేరాయి. కొన్ని విమానాలను సమీపంలోని ఇతర ఎయిర్‌పోర్టులకు దారి మళ్లించారు. ఈ ఎయిర్ పోర్టు నుంచి ప్రతి రోజు దాదాపు 1200ల విమానాలు రాకపోకలు సాగిస్తాయి. కాగా.. పొగమంచు కారణంగా విమానాల రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తితే ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా ప్రయాణికులు తమ ప్రయాణాన్ని వాయిదా లేదా రద్దు చేసుకునేందుకు అనుమతిస్తున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. ప్రతి ఏడాది చలి కాలంలో నెల నుంచి నెలన్నర రోజులు ఇలాంటి పరిస్థితి తలెత్తడం సాధారణం.

హఫీజ్ సయీద్‌ను అప్పగించండి

పాకిస్తాన్‌కు భారత్ అధికారిక విజ్ఞప్తి

న్యూఢిల్లీ: 26/11 ముంబై దాడుల సూత్రధారి, కరడుగట్టిన ఉగ్రవాది, లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌ను తమకు అప్పగించాలని భారత ప్రభుత్వం పాకిస్తాన్‌కు అధికారికంగా విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక వినతిని పాకిస్తాన్ ప్రభుత్వానికి పంపించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సయీద్‌ను అప్పగించడానికి చట్టపరమైన ప్రక్రియను ప్రారంభించాలని కోరినట్లు తెలియజేశాయి. భారత్ రూపొందించిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో హఫీజ్ సయీద్ ఉన్నాడు. అతడి తలపై అమెరికా ప్రభుత్వం 10 మిలియన్ డాలర్ల బహుమానం ప్రకటించింది. 2008 నాటి ముంబై దాడులకు వ్యూహ రచన చేసిన హఫీజ్ సయీద్‌ను విచారించేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అతడిని తమకు అప్పగించాలని భారత్ పదేపదే కోరుతున్నా పాకిస్తాన్ పట్టించుకోవడం లేదు.

రూ.15 వేల కోట్ల ఎలక్టోరల్ బాండ్ల అమ్మకం

సాక్షి, న్యూఢిల్లీ: 2018 ఏడాది నుంచి ఇప్పటిదాకా రూ.15 వేల కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను విక్రయించామని భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ) వెల్లడించింది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద ఒక ఆర్టీఐ కార్యకర్త అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఎస్‌బీఐ ఈ విషయం చెప్పింది. ''2018 ఏడాది నుంచి ఇప్పటిదాకా 29 దఫాలుగా ఎలక్టోరల్ బాండ్లను విక్రయించాం. వాటి మొత్తం విలువ రూ.15,956.30 కోట్లు. ఇందులో రూ.23.88 కోట్ల విలువైన 194 బాండ్లు ఏ రాజకీయ పార్టీ బ్యాంక్ ఖాతాలో జమకాని కారణంగా ఆ బాండ్ల మొత్తాన్ని ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి(పీఎంఎన్‌ఆర్‌ఎఫ్)కు బదిలీ చేశాం'' అని బ్యాంక్ తెలిపింది. లోకేశ్ బాత్రా అనే మాజీ నావికా అధికారి ఆర్టీఐ చట్టం కింద అభ్యర్థించడంతో బ్యాంక్ పై విధంగా సమాధానమిచ్చింది.

గాజాలో మృత్యుఘోష

ఇజ్రాయెల్ దాడుల్లో ఒకేరోజు 50 మంది బలి

ఖాన్ యూనిస్: గాజా స్ట్రిప్‌లో హమాస్ మిలిటెంట్ గ్రూప్‌పై యుద్ధం పేరిట ఇజ్రాయెల్ సైన్యం రక్తపుటేరులు పారిస్తోంది. గురువారం బీట్ లాహియా, ఖాన్ యూనిస్, అల్-మఘాజీ ప్రాంతాలపై వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఒకేరోజు 50 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. వైమానిక దాడుల నుంచి తప్పించుకోవడానికి వేలాది మంది సామాన్య ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. మరోవైపు ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని రమల్లాతోపాటు ఇతర నగరాలపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగిస్తోంది. అక్టోబర్ 7 నుంచి మొదలైన ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా 21,320 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 55,603 మంది గాయపడ్డారు.

మేమొస్తే కుల గణన

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటన
- రాజ్యాధికారాన్ని సామాన్యుల చేతికి అప్పగించాలి
- దేశంలో అన్ని వ్యవస్థలను చెరపట్టిన బీజేపీ
- సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రధాని మోదీ వ్యతిరేకి: ఖర్గే
- నాగపూర్‌లో కాంగ్రెస్ 'హై తయ్యార్ హమ్' సభ

నాగపూర్: దేశంలో కీలకమైన రంగాల్లో ఓబీసీలు, దళితులు, గిరిజనులకు వారికి జనాభా తగ్గట్టుగా తగిన ప్రాతినిధ్యం లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ 139వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మహారాష్ట్రలోని నాగపూర్‌లో గురువారం 'హై తయ్యార్ హమ్' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. రాజ్యాధికారాన్ని సామాన్య ప్రజల చేతికి అప్పగించాలన్నదే కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశమని వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కోట్లాది మందిని పేదరికంలోకి నెట్టేసిందని ఆరోపించారు. పేదల ఇండియా, ధనికుల ఇండియా అనే రెండు దేశాలను తాము కోరుకోవడం లేదన్నారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలని నిలదీశారు. దేశంలో నిరుద్యోగం అత్యధిక స్థాయికి చేరిందని ఆరోపించారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

మోదీ ఓబీసీనని ఎందుకు చెప్పకుంటున్నారు

ప్రధాని మోదీ తాను ఓబీసీనని పదేపదే చెప్పుకుంటున్నారని, ఇప్పుడు కుల గణన గురించి తాము ప్రశ్నిస్తే నోరు విప్పడం లేదని రాహుల్ విమర్శించారు. పేదలు అనే ఒకే కులం ఉందని అంటున్నారని ఆక్షేపించారు. నిజంగా ఒకే కులం ఉంటే ఓబీసీనని ఎందుకు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. బీజేపీలో అగ్రనేతల నుంచి ఆదేశాలు వస్తుంటాయని, కాంగ్రెస్‌లో మాత్రం సామాన్య కార్యకర్తలు సైతం నాయకత్వాన్ని ప్రశ్నించే వెసులుబాటు ఉందని అన్నారు. దేశంలో పాలనా పగ్గాలు సాధారణ ప్రజల చేతుల్లో ఉండాలని ఆకాంక్షించారు. దేశంలో హరిత విప్లవం, శ్వేత విప్లవం, సమాచార సాంకేతిక విప్లవానికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పునాది వేశాయని, వీటితో రైతులు, మహిళలు, యువత లబ్ధి పొందారని గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో అన్ని వ్యవస్థలను చెరపట్టిందని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు.

ప్రతిపక్ష ఇండియా కూటమి అధికారం చేపట్టిన తర్వాత పేదలు, మహిళల సంక్షేమం కోసం కనీస వేతన పథకాన్ని(న్యాయ్ స్కీమ్) అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. 'హై తయ్యార్ హమ్' సభలో ఆయన ప్రసంగించారు. నాగపూర్ నగరం రెండు సిద్ధాంతాలకు కేంద్ర బిందువు అని చెప్పారు. ఒకటి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రవచించిన ప్రగతిశీల సిద్ధాంతమైతే, మరొకటి దేశాన్ని విచ్ఛన్నం చేసే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతమని అన్నారు. దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం అంతమైపోతుందని హెచ్చరించారు. సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రధాని నరేంద్ర మోదీ బద్ధ వ్యతిరేకి అని ఆరోపించారు. దేశంలో ప్రస్తుతం ప్రజాస్వామ్య వ్యవస్థ పెనుముప్పు ఎదుర్కొంటోందని అన్నారు. మోదీ పాలనలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఆకాశం అంచులకు చేరాయని విమర్శించారు.

బీజేపీలో బానిసత్వం: రాహుల్

అధికార బీజేపీలో బానిసత్వం కొనసాగుతోందని ఆ పార్టీ ఎంపీ ఒకరు తనతో చెప్పారని రాహుల్ గాంధీ అన్నారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న ఆ ఎంపీ ఇటీవల తనను ప్రైవేట్‌గా కలిశాడని చెప్పారు. బీజేపీలో ఉన్నప్పటికీ తన హృదయం మాత్రం కాంగ్రెస్‌తోనే ఉందని వెల్లడించాడని పేర్కొన్నారు. బీజేపీ పెద్దల నుంచి వచ్చే ఆదేశాలను ఎవరైనా పాటించాల్సిందేనని, నోరెత్తడానికి వీల్లేదని, పార్టీ కార్యకర్తల గోడును ఎవరూ పట్టించుకోరని ఆ ఎంపీ ఆవేదన వ్యక్తం చేశాడని రాహుల్ తెలిపారు.



నాగపూర్‌లో కాంగ్రెస్ సభలో ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

ఈడీ చార్జిషీట్‌లో ప్రియాంక పేరు

న్యూఢిల్లీ: ప్రవాస భారతీయుడు, వ్యాపారవేత్త సి.సి.థాంపీ నిందితుడుగా ఉన్న అక్రమ నగదు లావాదేవీల(మనీ లాండరింగ్) కేసులో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా పేరును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తమ చార్జిషీట్‌లో తొలిసారిగా ప్రస్తావించింది. అయితే, ఆమెను నిందితురాలిగా పేర్కొనలేదు. ఈ చార్జిషీట్‌ను గత నెలలో ఢిల్లీలోని ప్రత్యేక పీఎంఎల్‌ఏ కోర్టులో ఈడీ సమర్పించింది. ఈ నెల 22న చార్జిషీట్‌ను న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. తదుపరి విచారణను వచ్చే 29వ తేదీకి వాయిదా వేసింది. ఇదే కేసులో గతంలో సమర్పించిన చార్జిషీట్‌లో ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా పేరును ఈడీ చేర్చింది.

చార్జిషీట్‌లో ఏముందంటే..

- కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా 2005-06లో హెచ్.ఎల్.పహ్వా అనే ఢిల్లీ రియల్ ఎస్టేట్ ఏజెంట్ నుంచి హరియాణాలోని అమీపూర్‌లో 40.08 ఎకరాలు కొన్నాడు. అదే భూమిని 2010 డిసెంబర్‌లో పహ్వాకు అమ్మేశాడు.
- ప్రియాంకాగాంధీ 2006 ఏప్రిల్‌లో పహ్వా నుంచి అమీపూర్‌లో 5 ఎకరాలు కొనుగోలు చేశారు. 2010 ఫిబ్రవరిలో ఆ భూమిని తిరిగి అతడికే విక్రయించారు.
- పహ్వా సహాయంతో సి.సి.థాంపీ 2005 నుంచి 2008 మధ్య అమీపూర్‌లో 486 ఎకరాలు కొన్నాడు.
- రాబర్ట్ వాద్రా, థాంపీ మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇద్దరి మధ్య ఉమ్మడి, వ్యాపార ప్రయోజనాలు కూడా ఉన్నాయి.
- రాబర్ట్ వాద్రాకు, థాంపీకి విక్రయించిన భూమికి గాను లెక్కలోని రాని నగదును పహ్వా స్వీకరించాడు.
- థాంపీ 2020 జనవరిలో అరెస్టయ్యాడు. వాద్రా తనకు గత పదేళ్లుగా తెలుసని ఈడీ విచారణలో అంగీకరించాడు. దుబాయ్‌లో, ఢిల్లీలో పలుమార్లు కలుసుకున్నామని వెల్లడించాడు.

అయోధ్య ఎయిర్‌పోర్ట్‌కు మహర్షి వాల్మీకి పేరు!

న్యూఢిల్లీ: అయోధ్యలో భవ్య రామమందిరం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆ పట్టణంలో ఇప్పటికే పూర్తయిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించనున్నారు. నూతన విమానాశ్రయం సహా రూ.11,100 కోట్లకుపైగా విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టులను ఆయన ప్రారంభిస్తారు. అయోధ్య ఎయిర్‌పోర్ట్‌కు 'మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం, అయోధ్య ధామ్'గా నామకరణం చేసే వీలుంది. సంబంధిత వివరాలను ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఏటా 10 లక్షల మంది విమానప్రయాణికుల రాకపోకలకు అనువుగా రూ.1,450 కోట్లతో నిర్మించిన నూతన ఎయిర్‌పోర్ట్, పూర్తయిన అయోధ్య ధామ్ జంక్షన్ తొలి దఫా, అయోధ్య రైల్వేస్టేషన్, రోడ్లు, పౌర వసతుల ప్రాజెక్టులను మోదీ ప్రారంభిస్తారు. ఉత్తర ప్రదేశ్‌లో రూ.2,300 కోట్ల విలువైన మూడు రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితమివ్వనున్నారు. కొత్తగా రెండు అమృత్ భారత్, ఆరు కొత్త వందేభారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభిస్తారు. సువిశాలంగా కొత్తగా నిర్మించిన అయోధ్య, రామపథ్, బక్తిపథ్, ధర్మపథ్, శ్రీరామజన్మభూమి పథ్ రోడ్లను ప్రారంభిస్తారు. అధునాతన సదుపాయాలతోపాటు తక్కువ విద్యుత్‌ను వినియోగించుకునేలా పర్యావరణహిత నిర్మాణం, వాననీటి సంరక్షణ, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, మురుగునీటి శుద్ధి ప్లాంట్, సౌరవిద్యుత్ ప్లాంట్‌వంటి ఎన్నో ప్రత్యేకతలు ఉన్న అయోధ్య ఎయిర్‌పోర్ట్‌ను ఫైవ్ స్టార్ గ్రీన్ రేటింగ్ వచ్చేలా నిర్మించారు.

పెట్రో ధరలు తగ్గించే యోచనలో కేంద్రం!

లీటర్‌కు రూ.6-10 తగ్గించే అవకాశం !



న్యూఢిల్లీ: అధిక పెట్రో ధరల నుంచి ప్రజానీకానికి కాస్తంత ఉపశమనం కల్గించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మూడు రాష్ట్రాల్లో గెలుపుతో జోరు మీదున్న బీజేపీ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించే ఉద్దేశంతో ప్రజలకు పెట్రో ధరల భారం తగ్గించనుందని జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.6-10 తగ్గించాలని మోదీ సర్కార్ భావిస్తోందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ధరల తగ్గింపునకు సంబంధించిన ప్రతిపాదనలను పెట్రోలియం శాఖ అధికారులు ప్రధాని మోదీ ఆమోదం కోసం పంపించారని వార్తలొచ్చాయి. అయితే ఈ ధరల సవరణపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. చాలా నెలలుగా ప్రభుత్వరంగ రిటైల్ చమురు కంపెనీలు పెట్రో ధరలను తగ్గించలేదు, పెంచలేదు. గత ఆర్థికసంవత్సరంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరగడంతో రిటైల్ కంపెనీలు ఆ ధరల భారాన్ని ప్రజలపై పడేశాయి. దీంతో అప్పుడు ధరలు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గినా ఆమేరకు రిటైల్ అమ్మకం ధరలను సంస్థలు తగ్గించలేదు. దాంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత పెట్రోలియం కార్పొరేషన్, హెచ్‌పీసీఎల్‌లు ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి ఆరు నెలల్లో ఏకంగా రూ.58,198 కోట్ల ఆదాయాన్ని మూటగట్టుకున్నాయి. చివరిసారిగా 2022 మే 22వ తేదీన కేంద్రం పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ఎక్సయిజ్ సుంకాన్ని తగ్గించింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.8 , లీటర్ డీజిల్ ధర రూ.6 తగ్గింది. కొద్ది నెలలుగా కీలక రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో పెట్రో ధరలను పెంచలేదని, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మరింత తగ్గించనున్నారని జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

ఫొటో ఫ్లాష్‌బ్యాక్ 2023




కానరాదా వైకల్యం.. మూలనపడిన యంత్రాంగం

కరీంనగర్ జిల్లా ఎల్కతుర్తి చెందిన దివ్యాంగుడు బాజీరావు ట్రై సైకిల్ దరఖాస్తు చేసుకొని ఏళ్ల తరబడి చూస్తున్నా ఇవ్వలేదు. అయితే కరీంనగరలోని అంబేడ్కర్ స్టేడియంలో ట్రై సైకిళ్లు పంచనకుండా ఓ మూలనపడేశారు. దీంతో అవి తప్ప పట్టిపోయాయి.



ఆదివాసీ.. అడవి దాటి

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం దబోలి పంచాయతీ పరిధిలోని లొద్దిగూడకు చెందిన ఆదివాసీ ఓటర్లు ఓటేయడానికి ఏడు కిలోమీటర్లు నడిచారు. రవాణా సౌకర్యం లేకపోవడంతో కొండకోనలు దాటి దబోలికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.



పోలీసు చేసిన సాయం

హోరున వర్షం.. ఒక్కసారిగా వరద ముంచెత్తింది. చూస్తుండగానే ఊరూ ఏరూ ఏకమైంది. ఈ ఏడాది ఆగస్టులో సిరిసిల్ల పట్టణంలో వరద విలయం సృష్టించింది. పలువురు నీటిలో చిక్కుకుపోయారు. ఈ సందర్భంలో వరదనీటిలో చిక్కుకున్న వృద్ధురాలిని బయటకు తీసుకొచ్చినప్పటి దృశ్యమిది.

నేడు మేడిగడ్డకు మంత్రుల బృందం



సాక్షిప్రతినిధి,వరంగల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కోసం రాష్ట్ర మంత్రుల బృందం శుక్రవారం మేడిగడ్డకు రానుంది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, బ్యారేజీలు, పంపుహౌసుల్లో జరిగిన నిర్మాణ వ్యయాలు, విధివిధానాలపై ఆరా తీసింది. కాగా, ప్రాజెక్టుపై ఈఎన్సీ మురళీధర్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనుండడంతో రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డిలు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వద్దకు నేడు ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రానున్నారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ద్వారా షెడ్యూల్ ఖరారు చేశారు. అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో 21వ పియర్ కుంగిపోవడం, అదే వారంలో అన్నారం వద్ద సీపేజీ బుంగలు ఏర్పడటంతో ఈ అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కాగా, మంత్రుల బృందం కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషను చూసిన తర్వాత, మేడిగడ్డ బ్యారేజీ పియర్‌లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై సమీక్ష జరుపనుంది. మంత్రులు మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి తిరిగి క్యాంపునకు వెళుతారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు మీడియా ప్రతినిధులతో కలసి భోజనం చేస్తారు. తర్వాత మధ్యాహ్నం 3.20 సమయంలో మేడిగడ్డ నుంచి అన్నారం బ్యారేజీకి హెలికాప్టర్‌లో చేరుకుంటారు. 4.20 గంటల వరకు అన్నారం బ్యారేజీని పరిశీలిస్తారు. 4.30 గంటలకు అన్నారం బ్యారేజీని నుంచి బయలుదేరి తిరిగి హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖ ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీ వద్ద మంత్రుల పర్యటనకోసం అవసరమైన ఏర్పాట్లను చేసింది. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు.

రామంతాపూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ఇంకెన్నాళ్లకు?

- ప్రభుత్వ శాఖల తీరుపై హైకోర్టు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని రామంతాపూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో జాప్యంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక శాఖపై మరో శాఖ సాకులు చెప్పడాన్ని తప్పుపట్టింది. రెవెన్యూ శాఖ సహకరించడం లేదని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ.. లేదు లేదు వారే స్పందించడం లేదని రెవెన్యూ అధికారులు చెప్పడంపై మండిపడింది. సమన్వయంతో నిర్ణయం తీసుకోకపోతే ఆయా శాఖల అధికారులను కోర్టుకు పిలిపించి ఎవరు బాధ్యులో తేల్చుతామని కూడా హెచ్చరించింది. కొత్తగా హెచ్‌ఎండీఏ, ప్రైవేట్ వ్యక్తులను ప్రతివాదులుగా చేర్చి, వారికి కూడా నోటీసులు జారీ చేసి విచారణను వాయిదా వేసింది. హైదరాబాద్ పరిధిలో 532 చెరువులు క్షీణిస్తున్నాయని, 26 ఎకరాల్లోని రామంతాపూర్ పెద్దచెరువును డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని, ఈ కారణంగా నీటికాలుష్యం పెరిగి దుర్వాసన వ్యాపిస్తోందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కేఎల్ వ్యాస్ 2005లో లేఖ రాశారు. ఈ లేఖను హైకోర్టు విచారణకు స్వీకరించి జీహెచ్‌ఎంసీ కమిషనర్ హాజరుకావాలని ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో కమిషనర్ గురువారం కోర్టుకు హాజరయ్యారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది.

వెస్టిబ్యూల్..

డబుల్ డెక్కర్!

ప్రయాణికుల రద్దీని తట్టుకోవడంపై ఆర్టీసీ దృష్టి



- మహాలక్ష్మి పథకం అమలుకు తీసుకోవాల్సిన చర్యల కోసం 5 కమిటీలు
- బస్సుల సంఖ్య పెంపు, ఒకేసారి ఎక్కువ మంది తరలింపు అవకాశాల పరిశీలన
- వెస్టిబ్యూల్, డబుల్ డెక్కర్లతో పాటు 12 మీటర్ల బస్సులూ పరిగణనలోకి..
- సిబ్బంది పెంపు, నిర్వహణ వ్యయం, బస్టాండ్ల విస్తరణపై అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: మహాలక్ష్మి పథకంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చి రద్దీ పెరగడంపై ఆర్టీసీ దృష్టి సారించింది. బస్సుల సంఖ్య పెంచడంతో పాటు ట్రామ్ తరహాలో రెండు కోచ్‌లుగా ఉండే వెస్టిబ్యూల్, డబుల్ డెక్కర్ బస్సులు నగరం వెలుపల నడపడం, ప్రస్తుతం నడుస్తున్న బస్సులు కాకుండా 12 మీటర్ల పొడవుండే భారీ వెడల్పాటి బస్సులు కొనుగోలు చేయడం తదితర అంశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం రోజు వారీ ప్రయాణికుల సంఖ్య గతంలో కంటే దాదాపు 10 లక్షల నుంచి 13 లక్షల వరకు పెరిగి మొత్తం ప్రయాణికుల సంఖ్య 40 లక్షలు దాటింది. సోమవారాల్లో అయితే ఇది 50 లక్షలను మించుతోంది. ఆక్యుపెన్సీ రేషియో 90 శాతం నమోదవుతోంది. మరోవైపు పురుషులకు చోటుండటం లేదు. ఈ నేపథ్యంలో పెరిగిన రద్దీని సులభంగా తట్టుకుని ఈ పథకాన్ని సజావుగా అమలు చేయాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలో గుర్తించాలని పేర్కొంటూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఐదు కమిటీలను ఏర్పాటు చేశారు. నాలుగైదు రోజులుగా కసరత్తు చేస్తున్న ఆ కమిటీ ప్రతినిధులు మరో రెండు రోజుల్లో నివేదిక అందించనున్నారు. అందులోని సిఫారసులకు అనుగుణంగా ఆర్టీసీ చర్యలు తీసుకోనుంది.

నగరంలోనా? వెలుపలా?

ప్రస్తుతం ఆర్టీసీలో 9,300 బస్సులున్నాయి. వీటిల్లో 3 వేలకు పైగా పాతబడి ఉన్నాయి. తాజా పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు 4 వేల వరకు బస్సులు కొనాల్సి ఉంటుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే సాధారణ బస్సులకు బదులు పెద్ద బస్సులు కొంటే ఎలా ఉంటుందనే కోణంలో ఆర్టీసీ ఆలోచిస్తోంది. ప్రస్తుతం వాడుతున్న 11 మీటర్ల పొడవు బస్సులకు బదులు 12 మీటర్ల బస్సులు కొంటే అదనంగా నాలుగు సీట్లు కలిసి వస్తాయి. వెడల్పు ఎక్కువగా ఉండటంతో నిలబడే స్థలం పెరుగుతుంది. ఇక ఒకదాని వెనక మరొకటిగా రెండు కోచ్‌లతో ఉండే వెస్టిబ్యూల్ బస్సులు కొంటే ఒకేసారి ఎక్కువమందిని తరలించే వీలుంటుంది. డబుల్ డెక్కర్‌లో కూడా ఎక్కువమంది ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. వీటిని నగరం వెలుపల విశాలమైన రోడ్లు ఉండే ప్రాంతాల్లో తిప్పే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఒకవేళ నగరంలో అయితే ఏయే రూట్లు ఇందుకు యోగ్యంగా ఉంటాయో కూడా గుర్తిస్తున్నారు.

4 వేల బస్సులకు 10 వేల మంది సిబ్బంది కావాలి

ఒక బస్సుకు సగటున 2.6 చొప్పున సిబ్బంది. అవసరమన్నది ఆర్టీసీ లెక్క. కొత్తగా 4 వేల బస్సులు కొంటే 10 వేల మందిని రిక్రూట్ చేసుకోవాలి. ఒకవేళ అద్దె ప్రాతిపదికన బస్సులు తీసుకుంటే సిబ్బంది సంఖ్య అంత అవసరం ఉండదు. కాగా సిబ్బంది పెంపు ఎలా ఉండాలన్న అంశంపై ఓ కమిటీ నివేదిక సిద్ధం చేస్తోంది. అదే సమయంలో బస్సుల నిర్వహణపైనా సంస్థ దృష్టి సారించింది. షాక్ అబ్జార్బర్స్‌గా పనిచేసే కమాన్ పట్టీలు, టైర్లు, బ్రేక్ లైనర్స్ మన్నిక పెంచేందుకు ఏం చేయాలి? నిర్వహణ వ్యయం, అవసరమైన మెకానిక్‌లు తదితర అంశాలను మరో కమిటీ పరిశీలిస్తోంది.

బస్‌స్టేషన్లు, ప్లాట్ ఫామ్స్‌పై దృష్టి

భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. అన్నింటిలో టికెట్ జారీ యంత్రాలు వాడుతున్నారు. వీటి చార్జింగ్‌కు ఇబ్బంది పడకుండా టిమ్స్‌ను బస్సుల్లోనే చార్జ్ చేసే సాంకేతికత సమకూర్చుకోవచ్చా? స్మార్ట్ కార్డుల జారీ, విచారణ కేంద్రాలలో ట్యాబ్స్ వినియోగం లాంటి అంశాలపై ఇంకో కమిటీ దృష్టి పెట్టింది. అదే సమయంలో పెరుగుతున్న బస్సులకు అనుగుణంగా ప్లాట్‌ఫామ్స్ సంఖ్య పెంచటం, తదనుగుణంగా బస్టాండ్లు, బస్‌స్టేషన్లను విస్తరించటం, బస్టాండ్లలో వసతుల కల్పన, పెరిగిన దొంగల బెడదను అరికట్టేందుకు భద్రత పెంపు, మహిళా ప్రయాణికులకు టాయిలెట్లు, మంచినీటి వసతిని మెరుగుపరచటం లాంటి వాటిపై ఒక కమిటీ అధ్యయనం చేస్తోంది.

యాదాద్రిలో ముగిసిన అధ్యయనోత్సవాలు



శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి అలంకరణ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం అధ్యయనోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఆరవ రోజు శ్రీలక్ష్మీనరసింహస్వామిగా అలంకరించి తిరు, మాడ వీధుల్లో శ్రీస్వామిని ఊరేగించారు. అనంతరం అధ్యయనోత్స వాలకు పరిసమాప్తి పలికారు. శుక్రవారం నుంచి ఆలయంలో నిత్య, శాశ్వత కల్యాణాలు, శ్రీసుదర్శన నారసింహ హోమం పూజలు పునఃప్రారంభం కానున్నాయి.

గొర్రెల పంపిణీ పథకంలో గోల్‌మాల్

గచ్చిబౌలి: కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కై గొర్రెల పంపిణీ పథకంలో గోల్‌మాల్ చేసి రూ.2.10 కోట్లు దారి మళ్లించిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ముగ్గురు నిందితులపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. డీఐ రాఘవేందర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి....గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా రాష్ట్ర పశుసంవర్ధక శాఖ వేర్వేరు రాష్ట్రాల నుంచి గొర్రె పిల్లలను కొనుగోలు చేసి వాటిని తెలంగాణ రైతులకు ఉచితంగా పంపిణీ చేసేది. ఇందులో భాగంగా కొండాపూర్ కేంద్రంగా 'లోలోనా దిలైవ్‌స్టాక్ కంపెనీ' నిర్వహిస్తున్న సయ్యద్ మోయిద్ అనే కాంట్రాక్టర్‌తో కలిసి పశుసంవర్ధక శాఖతో అసిస్టెంట్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న రవికుమార్, కేశవసాయి గత ఆగస్టు 13 నుంచి 23 వరకు ఏపీలోని పలు జిల్లాల్లో పర్యటించి రైతుల వద్ద ఉన్న గొర్రె పిల్లలను పరిశీలించారు. 20 గొర్రెలు, ఒక పొట్టేలు కలిపి ఒక యూనిట్‌గా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇలా మొత్తం 18 మంది రైతుల నుంచి 133 యూనిట్ల గొర్రె పిల్లలను కొనుగోలు చేశారు. అనంతరం అధికారులు రైతులకు సంబంధించిన ఆధార్‌కార్డు, పాన్‌కార్డుతోపాటు బ్యాంక్ అకౌంట్ నెంబర్లను సేకరించి ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి నేరుగా రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేయాల్సి ఉంటుంది. అయితే అధికారులు ఈ బాధ్యతను కాంట్రాక్టర్ మోయిద్‌కు అప్పగించారు. దీంతో అతను రైతుల స్థానంలో తమ బినామీలకు చెందిన బ్యాంక్ ఖాతాల నెంబర్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. అనంతరం పశుసంవర్ధక శాఖ నుంచి విడుదలైన డబ్బులు నేరుగా బినామీ ఖాతాల్లో పడ్డాయి, ఇలా మొత్తం రూ.2,10,14000 అధికారులు, కాంట్రాక్టర్ స్వాహా చేశారు. గొర్రె పిల్లలు తీసుకెళ్లి నెలలు గడుస్తున్నా తమ అకౌంట్‌లో డబ్బులు పడకపోవడంతో అనుమానం వచ్చిన రైతులు ఇటీవల కొండాపూర్‌లోని మోయిద్ కార్యాలయానికి వచ్చి అతడిని నిలదీశారు. ప్రభుత్వం ఇంకా డబ్బులు విడుదల చేయలేదని చెప్పాడు. దీంతో రైతులు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా తమకు రావాల్సిన డబ్బులు ఇతర ఖాతాల్లోకి మళ్లించినట్లు తెలిసింది. దీంతో ఈనెల 26న గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7న ఫిక్కీ వార్షిక బిజినెస్ అవార్డుల ప్రదానం

- టీహబ్ సీఈవో మహంకాళి శ్రీనివాస్‌రావు



ఫిక్కీ వార్షిక బిజినెస్ అవార్డుల కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట(హైదరాబాద్): అవార్డు తీసుకునే మహిళాపారిశ్రామికవేత్తలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తారని టీహబ్ సీఈవో మహంకాళి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం సోమాజిగూడ పార్క్ హోటల్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్‌ఎల్‌వో), యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఎఫ్‌ఎల్‌వో) వార్షిక హైదరాబాద్ బిజినెస్ అవార్డుల వివరాలను వెల్లడించారు. కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. మొత్తం 10 విభాగాల్లో 20 అవార్డులను జనవరి 7న కోఠి ఉమెన్స్ కాలేజీలోని బ్రిటిష్ రెసిడెన్సీలో ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. వీటితోపాటు పురుషాధిపత్యం ఉన్న తయారీరంగంలో ఐదు ప్రత్యేక అవార్డులు అందజేయనున్నట్లు ఎఫ్‌ఎల్‌వో హైదరాబాద్ చైర్‌పర్సన్ రీతూషా, మాజీ చైర్‌పర్సన్ హీనా శ్రీవాస్తవ తెలిపారు. మహిళావ్యాపారవేత్తలు, మహిళల యాజమాన్యంలోని కంపెనీల ఆవిష్కరణ, శ్రేష్టత, ఉత్తమ అభ్యాసాలు, ప్రభావం, విజయం, ఆర్థిక, సామాజిక కోణాలతోపాటు సుస్థిరత, ఆరోగ్య సంరక్షణ, దాతృత్వం, విద్య, తయారీ, వెల్‌నెస్, అందం, కళ, సాంకేతికత, సేవ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అవార్డులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి డి.శ్రీధర్‌బాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎఫ్‌ఎల్‌వో జాతీయ అధ్యక్షురాలు పింకీరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎఫ్‌ఎల్‌వో హైదరాబాద్ చైర్‌పర్సన్ ఆర్తీషా, గత చైర్‌పర్సన్ అపూర్వ పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' విద్యార్థిని బలవన్మరణం

- హాస్టల్‌లోనే ఉరేసుకుని..
- కాలేజీ యాజమాన్యం ఒత్తిడే కారణమని విద్యార్థి సంఘాల ఆరోపణ



వర్ష

మేడిపల్లి: శ్రీచైతన్య కళాశాల విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో బలవన్మరణానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. వనపర్తి జిల్లా వీపన్నగుడ్లకు చెందిన జి.భీరయ్య కుమార్తె జి.వర్ష ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూప్ ఫస్టియర్ స్థానిక శ్రీచైతన్య పీర్జాదిగూడ గర్ల్స్ రెసిడెన్షియల్ క్యాంపస్‌లోని హాస్టల్‌లో ఉంటూ చదువుతోంది. గురువారం మధ్యాహ్నం భోజన సమయం అనంతరం వాష్ రూంలోనే చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కళాశాల యాజమాన్యం మేడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చి.. స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోలీసులు గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కాగా, విద్యార్థిని బలవన్మరణానికి పూర్తి బాధ్యత కళాశాల యాజమాన్యానిదేనని, పరీక్షల్లో ర్యాంకులు సాధించాలని ఒత్తిడి తేవడంతోనే ఆమె తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడిందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టాయి. పోలీసులు మాత్రం తల్లిదండ్రులకు దూరం కారణంగా మానసిక ఒత్తిడి వల్లనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది.

రైలు ఢీకొని ఇద్దరి దుర్మరణం

- మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఘటన

మంచిర్యాల క్రైం: రైల్వేస్టేషన్‌లో పట్టాలపై నుంచి ఒకటో ప్లాట్‌ఫాం నుంచి రెండో ప్లాట్‌ఫాం వైపు దాటుతుండగా బెల్లంపల్లి వైపు నుంచి వస్తున్న తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. జీఆర్‌పీ వర్గాలు తెలిపిన వివరాలిలా.. కూలి పనులు చేసుకుని జీవించే మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం రంగపేటకు చెందిన బబ్బెర లక్ష్మి(45) ఈనెల 27న మంచిర్యాలకు వ్యక్తిగత పనులపై వచ్చి ప్రమాదవశాత్తూ మృతి చెందింది. ఆమెతో పాటు ఉన్న మరో వ్యక్తి(48 పూర్తి వివరాలు తెలియరాలేదనీ, అతడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా దండేపల్లి మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్టు పోలీసులు చెబుతున్నారు.

కారు యాక్సిడెంట్ కేసులో నిందితుడిగా ఇన్‌స్పెక్టర్?

- నాటి పరిణామాల నేపథ్యంలో అధికారుల యోచన
- బేరసారాల తర్వాతే సాహిల్ 'ఎస్కేప్'కు పథకమా?
- ముమ్మరంగా సాగుతున్న అంతర్గత విచారణ

సాక్షి, హైదరాబాద్: ప్రజాభవన్ వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న 'బీఎండబ్ల్యూ కారు ప్రమాదం' కేసులో పంజగుట్ట ఠాణా మాజీ ఇన్‌స్పెక్టర్ బి.దుర్గారావునూ నిందితుడిగా చేర్చాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. దీనిపై శాఖాపరమైన విచారణ పూర్తయిన తరువాత ఈ దిశలో చర్యలు తీసుకోనున్నారు. భారీ మొత్తం చెల్లింపునకు ఒప్పందం కుదిరిన తర్వాతే ఈ ఎస్కేప్ డ్రామా నడిచిందని అనుమానిస్తున్న అధికారులు... అవసరమైతే అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) సమాచారం ఇవ్వాలని యోచిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ప్రమాదం జరిగిన వెంటనే అక్కడకు చేరుకున్న అప్పటి పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అప్పటి నుంచే పోలీసులతో షకీల్ అనుచరుల సంప్రదింపులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. సాహిల్‌ను తప్పించడానికి దాదాపు రూ.30 లక్షలకు బేరం కుదిరిందని సమాచారం. అరగంటకు పైగా పోలీసు స్టేషన్‌లోనే సాహిల్ ఉండగా, కొందరు అక్కడకు వచ్చి పోలీసులతో సంప్రదింపులు జరిపినట్లు, కొంత నగదు ముట్టచెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. సాహిల్ స్థానంలో వారి ఇంట్లో డ్రైవర్ ఆరిఫ్‌ను నిందితుడిగా చూపించడానికి స్కెచ్ సిద్ధం చేశారు. ఠాణా వరకు వచ్చిన సాహిల్‌ను అలా వదిలేస్తే ఇబ్బందులు వస్తాయన్న ఉద్దేశంతోనే బ్రీత్ అనలైజర్‌తో పరీక్ష కోసమంటూ ట్రాఫిక్ ఠాణా వరకు హోంగార్డును ఇచ్చి పంపడం, అక్కడ అతడు ఎస్కేప్ కావడం... ఇదంతా పథకంలో భాగమే అని ఉన్నతాధికారులు తేల్చారు. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన సీసీ కెమెరా ఫుటేజ్‌లో కదలికలు సైతం అనుమానాస్పదంగానే ఉన్నాయని ఓ అధికారి వ్యాఖ్యానించారు. ఈ ఎస్కేప్ జరిగిన దాదాపు గంట తర్వాత నమోదు చేసిన కేసులో సాహిల్ పేరు, పరారైన ప్రస్తావన సహా ఏ అంశాన్నీ పేర్కొనకపోవడానికి ఇదే కారణమని అధికారులు భావిస్తున్నారు. ఈ వ్యవహారంలో బేరసారాలు చేసిన వారితో పాటు షకీల్ పాత్రను పరిగణనలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఓపక్క ఈ వ్యవహారంలో ముమ్మరంగా శాఖాపరమైన విచారణ చేస్తున్న ఉన్నతాధికారులు విదేశాల్లో ఉన్న సాహిల్‌ను రప్పించడంపైనా దృష్టి పెట్టారు. ఇతడి విచారణతో పాటు సాంకేతిక ఆధారాలు, ఇతర వాంగ్మూలాల ఆధారంగా కేసులో షకీల్ పేరును చేర్చే అంశాన్ని నిర్ణయించనున్నారు.

ఫొటో ఫ్లాష్‌బ్యాక్ ◀◀ 2023



ఆదిలాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట గత సెప్టెంబర్‌లో అంగన్‌వాడీలు తమ డిమాండ్ల సాధనకు ధర్నా చేశారు. ఈ సందర్భంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఆందోళనకారులు ఓ మహిళా ఎస్సై జుట్టు పట్టుకుని లాగినప్పటి దృశ్యం

మహారాష్ట్ర అభ్యంతరాలు, నీటి లభ్యత లేకనే..

'ప్రాణహిత'ను వదిలేయాల్సి వచ్చింది
నేడు మంత్రులకు తెలుపనున్న నీటిపారుదల శాఖ

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర అభ్యంతరాలు, తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేకనే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైనింగ్ చేసి ప్రాణహిత, కాళేశ్వరం ప్రాజెక్టులుగా విభజించినట్టు రాష్ట్ర నీటిపారుదల శాఖ స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని శుక్రవారం మంత్రుల బృందానికి తెలుపనుంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ఎందుకు వదిలేయాల్సింది అన్న అంశంపై ఇరిగేషన్ శాఖ పీపీటీ రూపొందించింది.

తొలుత రూ.17,875 కోట్లతో అనుమతులు

ప్రాణహిత నది నుంచి 160 టీఎంసీలను ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు తరలించి 12 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో రూ.17,875 కోట్ల అంచనాలతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలన అనుమతులు జారీ చేస్తూ 2007 మే 16న జీవో 124 జారీ చేశారు. అయితే ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, నల్లగొండ, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి ప్రాజెక్టు అంచనాలను రూ.38,500 కోట్లకు పెంచుతూ 2008 డిసెంబర్ 17న జీవో 238 ద్వారా సవరించిన పరిపాలన అనుమతులను జారీ చేశారు. ప్రాజెక్టు విద్యుత్ అవసరాలు 3,466 మెగావాట్లు కాగా, ఏటా 8,701 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం అవసరం అవుతుందని అంచనా వేశారు.

మహారాష్ట్ర అభ్యంతరాలు: ఈ ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో 5.09 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజీని ప్రతిపాదించగా, మహారాష్ట్ర పరిధిలో 3,786 ఎకరాలు ముంపునకు గురవుతాయంటూ ఆ రాష్ట్రం అభ్యంతరం తెలిపింది. ఎత్తును 148 మీటర్లకు తగ్గించాలని పట్టుబట్టింది. గత తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్రతో చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే నిల్వ సామర్థ్యం 1.85 టీఎంసీలకు తగ్గిపోతుంది. కేంద్ర జలసంఘం అంచనాల ప్రకారం తుమ్మిడిహట్టి వద్ద 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా నీటి లభ్యత 165.38 టీఎంసీలు మాత్రమే. అందులో ఎగువ రాష్ట్రాలు వాడుకోని 63 టీఎంసీల మిగులు జలాలూ ఉన్నాయి. దీంతో నీటి నిల్వల కోసం ప్రత్యామ్నాయాలను చూడాలని సీడబ్ల్యూసీ సూచించింది. వ్యాప్కోస్ ద్వారా అధ్యయనం జరపించగా, మేడిగడ్డ వద్ద 282.3 టీఎంసీల లభ్యత ఉందని తేలింది. దీంతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు రీఇంజనీరింగ్ జరిపి ప్రాణహిత ప్రాజెక్టు, కాళేశ్వరం ప్రాజెక్టులుగా విడగొట్టారు. ప్రాణహిత ప్రాజెక్టు కింద ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మించి 20 టీఎంసీలను తరలించడం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయాలని ప్రతిపాదించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద గోదావరిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించి 18.82 లక్షల కొత్త ఆయకట్టును ప్రతిపాదించారు. 2016లో రీఇంజనీరింగ్ చేపట్టే నాటికి రూ.11,679.71 కోట్ల విలువైన ప్రాజెక్టు పనులు చేశారు. కాగా రీఇంజనీరింగ్ తర్వాత 'ప్రాణహిత' పనులను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది.

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అంచనా వ్యయం, చేసిన ఖర్చు వివరాలను కింది పట్టికలో చూడవచ్చు. (రూ.కోట్లలో)

ప్రాజెక్టు ఒప్పందం విలువ	36,257.83
2014 నాటికి జరిగిన వ్యయం	6,156.92
2014-16 మధ్య జరిగిన వ్యయం (రీఇంజనీరింగ్‌కు పూర్వం)	5,522.79
మొత్తం వ్యయం 2016 నాటికి	11,679.71

'వ్యూహం' విడుదలకు బ్రేక్

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన వ్యూహం చిత్ర విడుదలకు హైకోర్టు బ్రేక్ వేసింది. సీబీఎఫ్‌సీ జారీ చేసిన సర్టిఫికెట్‌ను జనవరి 11 వరకు సస్పెన్షన్‌లో ఉంచుతూ ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను జనవరి 11కు వాయిదా వేసింది. 'వ్యూహం'కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పార్టీ జెండాలు, నేతల పేర్లతో చిత్రం తీశారని, ఇది పలు పార్టీల నేతల పరువు నష్టం కలిగించేదిగా ఉందని పిటిషనర్ తరఫున న్యాయవాది మురళీధర్‌రావు వాదించారు. నిర్మాత-దర్శకుడి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'రిట్ పిటిషన్ మెయింటినబుల్ కాదు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 29(ఏ) ప్రకారం ఈ పిటిషన్ వేసే అర్హత పిటిషనర్‌కు లేదు. ఎవరి పరువుకు నష్టం కలుగుతుందని భావిస్తే.. వారే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలి. చిత్రం చూడకుండానే పరువుకు నష్టం వాటిల్లుతుందని.. ఊహించి పిటిషన్ వేయడం ఆక్షేపణీయం. వ్యక్తులను, పార్టీలను కించపరిచే విధంగా ఉంటే సివిల్ కోర్టులో వారు పరువు నష్టం దావా వేసుకోవాలి. హైకోర్టులో వేయడం తప్పుబట్టాల్సిన అంశం. పిటిషన్‌ను కొట్టివేయాలి' అని విజ్ఞప్తి చేశారు. అనంతరం సీబీఎఫ్‌సీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) వాదనలు వినిపిస్తూ.. సినిమాటోగ్రఫి చట్టం, ఫిల్మ్ సర్టిఫికేషన్ మార్గదర్శకాలు, ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం భావ ప్రకటన హక్కును పరిగణనలోకి తీసుకుని రివైజింగ్ కమిటీ ఏకగ్రీవంగా 'యు' సర్టిఫికెట్ మంజూరు చేసిందని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి... సీబీఎఫ్‌సీ జారీ చేసిన సర్టిఫికెట్‌ను వచ్చే నెల 11 వరకు సస్పెన్షన్‌లో ఉంచుతూ ఉత్తర్వులిచ్చారు.

● **వెలుగు నీడలు..**

ఈ ఏడాది రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి అయ్యింది. ఒకేసారి ఏడు ప్రభుత్వ కాలేజీల ప్రారంభోత్సవం, వచ్చే సంవవత్సరానికి మరో ఏడు జిల్లాల్లోనూ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా వైద్యవిద్యకు పెద్దపీట వేశారు. ఇది సాకారం అయితే దేశంలోనే ప్రతిజిల్లాలోనూ మెడికల్ కాలేజీలున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డులకెక్కుతుంది. సాగునీటిరంగంలో కాళేశ్వం ప్రాజెక్టు లోపాలు పెద్ద కుదుపుగా చెప్పవచ్చు. పింఛన్ల పెంపు ఆసరా లబ్ధిదారులకు కొంత ఊరట కలిగించింది. ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిరాశే మిగిలింది. బదిలీలు, పదోన్నతులకు బ్రేక్ పడింది. కేంద్రంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘర్షణ వైఖరి కారణంగా ఉపాధి హామీ నిధుల విడుదలలో జాప్యం జరిగింది.



9 మెడికల్ కాలేజీలు

జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కలిగిన ఏకైక రాష్ట్రం ● రాష్ట్రంలో పది వేలకు చేరువకానున్న ఎంబీబీఎస్ సీట్లు



వైద్య, ఆరోగ్యశాఖ ఈ ఏడాది సాధించిన ప్రధాన విజయాల్లో కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించడంగా చెప్పవచ్చు. 2023-24 సంవత్సరంలో కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగాం జిల్లాల్లో మెడికల్ కాలేజీలను ప్రారంభించింది. ఈ ఏడాది ఇప్పటికే మెడికల్ విద్యార్థులు వాటిల్లో చేరారు. ఇక 2024-25 సంవత్సరంలోనూ జోగుళాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోనూ మెడికల్ కాలేజీలను ప్రారంభించనున్నారు. వచ్చే ఏడాది నుంచి ఒక్కో కాలేజీలో 100 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోనుంది. అంటే 800 మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. 33 జిల్లాలకుగాను ఇప్పటికే 25 జిల్లాల్లో మెడికల్ కాలేజీల ఏర్పాటు కాగా, తాజాగా అనుమతించిన 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వస్తే అన్ని జిల్లాల్లో ఒక మెడికల్ కాలేజీ లక్ష్యాన్ని ప్రభుత్వం చేరుకుంటుంది. ఇవి పూర్తయితే రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య మొత్తం 34కు చేరుతుంది. తాజా నిర్ణయంతో అన్ని జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండే ఏకైక రాష్ట్రంగా దేశంలోనే తెలంగాణ సరికొత్త రికార్డు సొంతం చేసుకున్నట్టే. అంటే మొత్తంగా రాష్ట్రంలో 10 వేల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయి.



పీఆర్ అండ్ ఆర్‌డీ

పింఛన్ రూ. 3,016 నుంచి రూ.4,016కు పెంపు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ విషయానికొస్తే..ప్రధానంగా ఆసరాలో భాగంగా దివ్యాంగుల పింఛన్ రూ.3,016 నుంచి రూ. 4,016కు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెంచింది. పెంపునకు అనుగుణంగా 5,11,656 మందికి నెలకు రూ.205.48 కోట్లు అందజేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

- జీపీలు, సర్పంచ్‌లకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విడుదలలో జాప్యం గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎప్పటికప్పుడు రావాల్సిన నిధులు విడుదల కాకపోవడంతో పలు జీపీల్లో సర్పంచ్‌లు తీవ్ర సమస్యలను ఎదుర్కొన్నారు. వివిధ పనుల కోసం సొంత నిధులు ఖర్చు చేసినా ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు రాలేదు. ఈ బిల్లుల కోసం ఎదురుచూస్తూ, ఆర్థిక ఇబ్బందుల్లో మునిగి కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారు.
- జాతీయ ఉపాధి హామీ పథకం అమల్లోనూ నిధుల సమస్య ఉపాధి హామీ అమల్లో భాగంగా... తెలంగాణలో నియమ,నిబంధనలు, మార్గదర్శకాలు సరిగ్గా పాటించడం లేదంటూ రాష్ట్రానికి కేంద్రం నిధులు నిలిపేసింది. అయితే కేంద్రం పక్షపాతం ప్రదర్శిస్తూ సకాలంలో నిధులు విడుదల చేయడం లేదంటూ బీఆర్ఎస్ సర్కార్ విమర్శలు సంధించింది. ఇదిలా ఉంటే...ఈ పథకంలో భాగంగా ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్, ఔట్‌సోర్సింగ్-కాంట్రాక్ట్ పద్ధతుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి గత రెండు, మూడు నెలలుగా వేతనాలు విడుదల కాకపోవడంతో వీరిలో తీవ్ర ఆందోళన నెలకొంది.

రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి



2022-23 సీజన్లో వరి ఉత్పత్తి 2.58 కోట్ల టన్నులు
రికార్డులు బద్దలు కొట్టిన తెలంగాణ వ్యవసాయరంగం

రాష్ట్రంలో వరి ఉత్పత్తి రికార్డు స్థాయిలో జరిగింది. 2022-23 వానాకాలం, యాసంగి సీజన్లలో వరి ధాన్యం 2.58 కోట్ల టన్నులు ఉత్పత్తి అయ్యింది. వానాకాలం సీజన్‌లో 1.38 కోట్ల టన్నులు, యాసంగిలో 1.20 కోట్ల టన్నులు ఉంది. ఈ మేరకు తుది నివేదికను ఈ ఏడాది ప్రభుత్వం విడుదల చేసింది. వానాకాలం సీజన్‌లో 65 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఉత్పాదకత ఎకరానికి 2,124 కిలోలు వచ్చింది. కాగా, ఈ యాసంగిలో 57.46 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. వరి ఉత్పాదకత ఎకరానికి 2,091 కిలోలు వచ్చింది. మొత్తంగా చూస్తే ఈ రెండు సీజన్లలో 1.22 కోట్ల ఎకరాల్లో వరి సాగు కాగా, ఎకరానికి 2,108 కిలోల ఉత్పాదకత వచ్చింది. ఆ మేరకు 2.58 కోట్ల టన్నుల వరి ఉత్పత్తి అవుతుందని తెలిపింది. అయితే కేంద్ర ప్రభుత్వం గత మార్చి 15వ తేదీన విడుదల చేసిన నివేదిక ప్రకారం తెలంగాణ వరి ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉంది. కాగా, ఈ ఏడాది వరకు 11 విడతల్లో కలిపి రైతుబంధు కింద రైతులకు పెట్టుబడి సాయం రూ. 72,815 కోట్లు ఇచ్చారు. ప్రస్తుతం 12వ విడత సొమ్మును కొత్త ప్రభుత్వం అందజేసే ప్రక్రియ చేపట్టింది. అందులో ఒక ఎకరాలోపు రైతులకు రైతుబంధు సొమ్ము అందజేస్తున్నారు.

మా'స్టార్' ఏదీ?

సాగని పదోన్నతులు... ఆగిన బదిలీలు
ఆఖరులో తప్పని టెట్ చిక్కులు.. టీచర్ పోస్టులకూ బ్రేకులు
ఉన్నత విద్యామండలిలో మహా నిశ్శబ్దం



దీర్ఘకాలిక డిమాండ్ అయిన బదిలీలు, పదోన్నతులుపై ఆశలు రేకెత్తిందీ ఈ ఏడాదే. 10 వేలమంది టీచర్లు ప్రమోషన్లపై కలలుగన్నారు. దాదాపు 50 వేలమంది స్థానచలనం ఉంటుందని ఆశించారు. కానీ నోటిఫికేషన్ ఇచ్చిన ఊరట ఎంతోకాలం నిలవలేదు. అడ్డుపడ్డ కోర్టు వ్యాజ్యాలు టీచర్ల ఆనందాన్ని ఆవిరి చేసింది. ప్రమోషన్లకూ బ్రేకులు పడటం 2023 మిగిల్చిన చేదు జ్ఞాపకమే. ఉపాధ్యాయ కొలువుల భర్తీపై నిరుద్యోగుల గంపెడాశలకు 2023 నీళ్లు చల్లింది. విద్యాశాఖలో 20 వేల పోస్టులు ఖాళీగా ఉన్నా, 5 వేల ఉద్యోగాలకే నోటిఫికేషన్ రావడం, అదీ అర్ధంతరంగా ఆగిపోవడం నిరుద్యోగులకు 2023 అందించిన ఓ పీడకల. జాతీయ ర్యాంకుల్లో మన విశ్వవిద్యాలయాల వెనుకబాటు, యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీ కోసం జరిగిన ఉద్యమాలు దూరమయ్యే కాలంలో కన్పించిన దృశ్యాలు. బాసర ట్రిపుల్ ఐటీలో వెంటవెంట జరిగిన విద్యార్థుల ఆత్మహత్యలు విద్యార్థిలోకాన్ని కలవరపెట్టాయి. టెన్త్ పరీక్షల సరళీకరణ, ఇంటర్ పరీక్షల్లో మార్పులకు శ్రీకారం 2023లో కనిపించిన కొత్తదనం. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఉన్నత విద్యామండలిలో కుదుపులకు గతించే కాలమే సాక్షీభూతమైంది. మండలి చైర్మన్, వైస్‌చైర్మన్ తొలగింపుతో కార్యకలాపాలే మందగించిపోవడం ఈ ఏడాదిలో ఊహించని పరిణామమే. ఉపాధ్యాయ అర్హత పరీక్షకు విద్యార్థులు పోటెత్తడం ఈ సంవత్సరంలో కనిపించిన విశేషం. కరోనా కాలం నుంచి ఆటుపోట్లు ఎదుర్కొంటున్న జేఈఈ మెయిన్ కాస్తా గాడిలో పడింది.

కాళేశ్వరం 'కుదుపు'



మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలతో మసకబారిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రతిష్ట

ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం చివరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రతిష్టను కుంగదీసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో బయటపడిన లోపాలు.. 2023 చివరి త్రైమాసికంలో రాష్ట్ర రాజకీయాలను కుదిపివేశాయి. మేడిగడ్డ(లక్ష్మి) బ్యారేజీ పియర్లు గత అక్టోబర్ 21వ తేదీన కుంగిపోగా, కొన్ని రోజులకే అన్నారం బ్యారేజీలో బుంగలు ఏర్పడ్డాయి. ప్లానింగ్, డిజైన్, నాణ్యత, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలతోనే మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకులోని పియర్లు కుంగినట్టు ..నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్‌ఏ) ఆధ్వర్యంలోని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది. 7వ బ్లాక్‌ను పూర్తిగా పునర్నిర్మించాల్సిందేనని సిఫారసు చేసింది. ఇతర బ్లాకులూ విఫలమైతే బ్యారేజీని పూర్తిగా పునర్నిర్మించక తప్పదని స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ బ్యారేజీకి ఎగువన నిర్మించిన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకి సైతం ఇలాంటి డిజైన్లు, నిర్మాణ పద్ధతులనే అవలంబించడంతో భవిష్యత్‌లో వాటికి సైతం ఇలాంటి సమస్యలు తలెత్తవచ్చని ఎన్డీఎస్‌ఏ ఆందోళన వ్యక్తం చేసింది. అన్నారం బ్యారేజీ పునాదుల (రాఫ్ట్) కింద నిర్మించిన కటాఫ్ వాల్స్‌కి పగుళ్లు రావడంతోనే బ్యారేజీకి బుంగలు ఏర్పడినట్టు ఎన్డీఎస్‌ఏ బృందం మరో నివేదికలో స్పష్టం చేసింది. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులను సొంత ఖర్చులతో చేస్తామని గతంలో హామీ ఇచ్చిన నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే మాట మార్చింది. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ విషయం ఎవరు చేపట్టాలని అన్న అంశంపై ఎల్‌అండ్ టీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఇంకా ఎలాంటి అంగీకారం కుదరలేదు.

మిల్లుల్లోనే రూ. 22 వేల కోట్ల విలువైన బియ్యం



పేదలకు ఉచిత బియ్యం పంపిణీతో పాటు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించే బృహత్తర బాధ్యత నిర్వహిస్తున్న పౌరసరఫరాల శాఖ 2023లో కొన్ని తప్పటడుగులు వేసింది. తద్వారా కార్పొరేషన్‌కు అప్పులు గుదిబండగా మారాయి. 2022 రబీ(యాసంగి)లో రైతుల నుంచి సేకరించిన సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐకి అప్పగించకపోవడంతో ఆ భారం సంస్థపై పడింది. యాసంగి ధాన్యాన్ని ముడిబియ్యంగా మిల్లింగ్ చేయడం వల్ల బియ్యం విరిగి తమకు నష్టం వస్తుందని, అందుకే మిల్లింగ్ చేయలేమని రైస్‌మిల్లర్ల వాదనను అంగీకరించింది. మిల్లర్ల పట్ల ఉదారత చూపి, ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రయత్నించగా, ఎన్నికల సంఘం బ్రేక్ వేయడంతో మిల్లుల్లోనే 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉండిపోయాయి. వీటితో పాటు అంతకు ముందు లెక్క తేలని ధాన్యం కలిపి సుమారు రూ. 22వేల కోట్ల విలువైన 83 ఎల్‌ఎంటీ ధాన్యం మిల్లుల్లోనే ఉన్నట్లు మిల్లర్లు చూపారు. కొత్త ప్రభుత్వం కొలువు తీరిన వెంటనే ఈ లెక్కలు తీసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పౌరసరఫరాల సంస్థ ఏకంగా రూ.56వేల కోట్ల అప్పులు ఉన్నట్లు లెక్కలు చెప్పారు. ఇవి కాకుండా రూ. 11వేల కోట్లు సంస్థ నష్టపోయినట్లు తేల్చారు. మిల్లర్ల పట్ల ఉదాసీనంగా వ్యవహరించిన కారణంగా 2023లో ఆ సంస్థ ప్రజల్లో పలుచనైపోయిందన్న వాదనలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి.

కాళేశ్వరం ఖర్చు రూ.93,872.07 కోట్లు

ఆయకట్టు అభివృద్ధి 98,570 ఎకరాలే!

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా 215 టీఎంసీల గోదావరి జలాలను తరలించి రూ.19.63 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అభివృద్ధి, 18.82 లక్షల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరణ జరపాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 98,570 ఎకరాల కొత్త ఆయకట్టు అభివృద్ధి చేశారు. మొత్తం రూ.1,27,872.28 కోట్ల అంచనాతో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టగా, ఇప్పటివరకు రూ.93,872.07 కోట్లు ఖర్చు చేశారు. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేపీసీఎల్) ద్వారా సమీకరించిన రూ.61,665.20 కోట్ల రుణాలతోపాటు రూ. 32,206.87 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులు అందులో ఉన్నాయి. కాళేశ్వరం కింద 18,64,970 ఎకరాల మిగులు ఆయకట్టును 2028-29 నాటికి అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. శుక్రవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ బృందం కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించనుంది. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ కాళేశ్వరం ప్రాజెక్టు పుట్టుపూర్వోత్తరాలపై మంత్రుల బృందానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ఇవ్వనున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎందుకు అర్ధంతరంగా విరమించుకున్నారు? ఆ ప్రాజెక్టుకు బదులుగా కాళేశ్వరం ప్రాజెక్టును ఎందుకు నిర్మించాల్సి వచ్చింది? వ్యయం, ప్రతిపాదిత ఆయకట్టు, నిధుల సమీకరణ, విద్యుత్ అవసరాల విషయంలో రెండు ప్రాజెక్టుల మధ్య తేడాలేంటి? మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో తలెత్తిన లోపాలు, సమస్యలేంటి? వాటికి పరిష్కార మార్గాలేంటి? అన్న అంశాలతో నీటిపారుదల శాఖ పీపీటీని సిద్ధం చేసింది.

వడ్డీ రూపంలో రూ.16,201.94 కోట్లు

ఇప్పటివరకు తీసుకున్న రుణంలో అసలు రూ.4,696.33 కోట్లు మాత్రమే చెల్లించగా, గత ఐదేళ్లలో వడ్డీలు రూ.16,201.94 కోట్లు చెల్లించారు. అసలు, వడ్డీ కలిపి రూ.21,157.87 కోట్లు చెల్లించారు. కాళేశ్వరం కార్పొరేషన్‌లో భాగమైనపాలమూరు-రంగారెడ్డికి రూ.10 వేల కోట్ల రుణం మంజూరు కాగా.. పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.7,721.51 కోట్లు విడుదల చేసింది. ఇంకో రూ.2,278.49 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కోసం తీసుకున్న అప్పులకు గత మూడేళ్లలో రూ.1,522.8 కోట్ల వడ్డీ చెల్లించగా, అసలు చెల్లింపులు ఇంకా మొదలుకాలేదు.

17.08 లక్షల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరణ

దిగువ మానేరు జలాశయం కింద ఎస్సారెస్పీ స్టేజ్-1కి సంబంధించిన పాత ఆయకట్టుతోపాటు ఎస్సారెస్పీ స్టేజ్-2, నిజాంసాగర్ ప్రాజెక్టుల కింద పాత ఆయకట్టుకు 2023-24 ఖరీఫ్, రబీ సీజన్లలో కాళేశ్వరం ద్వారా సాగునీరు అందించారు. దీంతో మొత్తం 17,08,230 ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరించినట్టు నీటిపారుదల శాఖ మంత్రులకు నివేదించనుంది.

- కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వల ద్వారా 456 చెరువులను నింపగా, వాటి కింద 39,146 ఎకరాల ఆయకట్టు ఉంది. కాళేశ్వరం నీళ్లను ఎస్సారెస్పీ-1, 2, నిజాంసాగర్ కాల్వల ద్వారా 2,143 చెరువులకు తరలించగా, వాటి కింద మరో 1,67,050 ఎకరాల ఆయకట్టు ఉంది.
- 2020-21 రబీ నుంచి 2023-24 ఖరీఫ్ వరకు కుందెల్లి వాగు, హల్దివాగు, 66 చెక్‌డ్యామ్‌ల కింద ఉన్న మొత్తం 20,576 ఎకరాల ఆయకట్టుకు కాళేశ్వరం జలాలను విడుదల చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయం, ఇప్పటివరకు జరిగిన ఖర్చులు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	అంచనా వ్యయం	జరిగిన వ్యయం		మొత్తం వ్యయం
		కాళేశ్వరం కార్పొరేషన్	రాష్ట్ర ప్రభుత్వం	
2 టీఎంసీల ప్రాజెక్టు	94,413.27	44,614.06	28,885.93	73,499.99
మూడో టీఎంసీ	33,459.01	17,051.14	3,320.93	20,372.07
మొత్తం	1,27,872.28	61,665.20	32,206.87	93,872.07

రూ.1.27 లక్షల కోట్ల అంచనాతో ప్రాజెక్టు నిర్మాణం
2028-29 నాటికి 18,64,970 ఎకరాల మిగులు ఆయకట్టు అభివృద్ధి
ఇప్పటివరకు 1,053.98 టీఎంసీల ఎత్తిపోత
అందుకు 6,918 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం
కాళేశ్వరం పెండింగ్ బిల్లులు రూ.3,192.08 కోట్లు
నేడు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల సందర్శనకు మంత్రుల బృందం
పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్న నీటిపారుదల శాఖ

కాళేశ్వరం కింద ఇప్పటివరకు ఎత్తిపోసిన నీళ్లు, అందుకు వినియోగించిన విద్యుత్

సంవత్సరం	ఎత్తిపోసిన నీళ్లు(టీఎంసీల్లో)	వాడిన కరెంట్(మిలియన్ యూనిట్లలో)
2019-20	318.49	2036.701
2020-21	254.772	1599.362
2021-22	238.188	1643.639
2022-23	181.921	1179.492
2023-24	60.609	458.967
మొత్తం	1053.98	6918.306

కాళేశ్వరం కింద ఆయకట్టు (ఎకరాల్లో..)

ప్రతిపాదించిన కొత్త ఆయకట్టు	19,63,360
అభివృద్ధి చేసినది	98,570
ఇంకా అభివృద్ధి చేయాల్సినది	18,64,970

మిగులు ఆయకట్టుకు సాగునీటి సరఫరా కోసం చేపట్టిన కార్యాచరణ ప్రణాళిక..

సంవత్సరం	మిగులు ఆయకట్టు (ఎకరాల్లో)
2024-25	2,83,404
2025-26	5,13,054
2026-27	2,91,867
2027-28	3,35,300
2028-29	4,41,165

కాళేశ్వరం ప్రాజెక్టు పెండింగ్ బిల్లులు (రూ.కోట్లలో)

వర్క్ బిల్లులు..		భూసేకరణ	ఆర్‌అండ్‌ఆర్	సబ్ స్టేషన్లు	కేపీఎంజీ	ఎన్పీడీసీఎల్	మొత్తం
ప్రభుత్వం	కాళేశ్వరం కార్పొరేషన్						
576.577	1915.885	466.589	229.154	2.430	1.180	0.265	3,192.08

సాక్షి
కరీంనగర్
శుక్రవారం | 29 | డిసెంబర్ | 2023

కొండగట్టు మాస్టర్ ప్లాన్‌పై కలెక్టర్ యాస్మిన్‌బాషా, అధికారులతో చర్చిస్తున్న సీఎం కేసీఆర్ (ఫైల్)



న్యూస్‌రీల్

రైస్ మిల్లులపై టాస్క్‌ఫోర్స్ దాడులు



జమ్మికుంట/హుజూరాబాద్ రూరల్: గత రాష్ట్ర ప్రభుత్వం అలాట్ చేసిన ధాన్యం సీఎమ్మార్‌కు పెట్టకుండా పక్కదారి పట్టించిన రైస్ మిల్లులపై స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. రాత్రి వరకు రికార్డులు, ధాన్యం నిల్వలను పరిశీలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని కోరపల్లి పరిధి మహాశక్తి ఆగ్రో ఇండస్ట్రీస్, ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి పరిధి శ్రీసీతారామ ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లులపై దాడులు చేసి, ధాన్యం లెక్కలు పరిశీలించారు. 2022 వానాకాలం సీజన్‌లో మహాశక్తి మిల్లుకు 1,26,179 క్వింటాళ్లు, 2022–23 యాసంగి సీజన్‌లో 1.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం అలాట్ చేయగా 12 వేల క్వింటాళ్ల బియ్యం ఇచ్చారు. శ్రీరాములపల్లి శ్రీసీతారామ ఆగ్రో ఇండస్ట్రీస్‌కు 2022 వానాకాలం సీజన్‌లో 93,305 క్వింటాళ్లు, 2023 యాసంగిలో 82,168 క్వింటాళ్లు అలాట్ చేయగా 13 వేల కింటాళ్ల బియ్యం సీఎమ్మార్‌కు పెట్టారు. 2022–23 వానాకాలం, యాసంగి సీజన్లలో తీసుకున్న ధాన్యాన్ని బియ్యంగా మార్చి, సీఎమ్మార్‌కు పెట్టలేదన్న ఫిర్యాదు మేరకు తనిఖీలు చేశామని అధికారులు తెలిపారు. హుజూరాబాద్ మండలంలోని మరో మూడు, జమ్మికుంట మండలంలోని మరొక మిల్లుల్లోనూ చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు పాటించడం లేదని, భారీ మొత్తంలో అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అంతేకాకుండా ఇప్పటివరకు మిల్లర్లు తీసుకున్న ధాన్యం, సీఎమ్మార్‌కు పెట్టినవి, గోదాముల్లో నిల్వ ఉన్న ధాన్యం వివరాలు సేకరించామని పేర్కొన్నారు. మరికొన్ని మిల్లుల్లో తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. తనిఖీలు జరిపిన మిల్లుల్లో పెద్ద మొత్తంలో తరుగు ఉన్నట్లు గుర్తించామని, నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. టాస్క్‌ఫోర్స్ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐలు జంగయ్య, కృష్ణ ఉన్నారు.

క్వింటాల్ పత్తి రూ. 6,700

జమ్మికుంట: జమ్మికుంట పత్తి మార్కెట్‌లో గురువారం క్వింటాల్ పత్తి ధర రూ. 6,700 పలికింది. ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్ పత్తికి గరిష్టంగా రూ. 6,400, మోడల్ ధర రూ. 6,200, కనిష్ట ధర రూ. 5,200 చెల్లించారు. సీసీఐ ఆధ్వర్యంలో 97 మంది రైతుల నుంచి 384.15 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. క్రయ విక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.


వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి



కరీంనగర్ అర్బన్: వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 61 సంవత్సరాలు పైబడిన ఉమ్మడి జిల్లా వీఆర్‌ఏలు గురువారం కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం జీవోఎంఎస్ నం.81, 85 ప్రకారం 3,797 మంది 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులకు త్వరితగతిన నియామక ఉత్తర్వులు జారీ చేసినా అమల్లోకి రాలేదన్నారు. జీవోలపై స్టేఉన్న కారణంగా నియామకం చేయలేదని, స్టే ఎత్తివేసినందున త్వరగా ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఐదు నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, మానసికంగా కృంగిపోతున్నామని వాపోయారు. విద్యార్హతలను బట్టి 61 సంవత్సరాలు నిండిన వారి వారసులకు జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్‌గా నియామకం చేయాలని కోరారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపిక

జమ్మికుంట: పట్టణంలోని న్యూ మిలినియం పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వనాథరెడ్డి గురువారం తెలిపారు. ఆరోతరగతి విద్యార్థిని వేముల శర్విక, మూడో తరగతి విద్యార్థిని ఆరాధ్యశ్రీ ఈనెల 24న హైదరాబాద్‌లోని భారత ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారన్నారు.



ఎంపికైన శర్విక

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ



కరీంనగర్ 14వ డివిజన్‌లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

- హాజరైన స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు
- దరఖాస్తులు ఇచ్చేందుకు బారులు తీరిన జనం
- తొలిరోజు అప్లికేషన్ల సంఖ్య 28,452



చొప్పదండిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్ దేవసేన, కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: 'ప్రజాపాలన' అభయహస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ గురువారం జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైంది. కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాలతో పాటు కరీంనగర్ కార్పొరేషన్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల్లో దరఖాస్తుదారులు వెల్లువలా తరలివచ్చారు. 'ప్రజాపాలన' వేదికల వద్ద ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దని.. సౌకర్యాలు కల్పించి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా యంత్రాంగం దిశానిర్దేశం చేయడంతో సజావుగా సాగింది. మరికొన్ని సెంటర్ల వద్ద జనం ఫారాలు నింపేందుకు హైరానా పడటం కనిపించింది. ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ దేవసేన చొప్పదండి మండలం ఆర్నకొండ, చాకుంట, కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లి గ్రామాల్లో పర్యటించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆర్నకొండ గ్రామంలో సమ్మక్క అనే మహిళ భర్త మల్లయ్యకు వికలాంగుల పింఛన్ మంజూరు కోసం దరఖాస్తు సమర్పించడానికి రాగా... నోడల్ అధికారి దేవసేన నమోదు ప్రక్రియపూర్తయిన తర్వాత కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా సమ్మక్కకు రసీదు అందజేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బోయినపల్లిలో జరిగిన ప్రజాపాలనకు హాజరయ్యారు. కరీంనగర్‌లోని భగత్‌నగర్, గోదాంగడ్డ, శివారు గ్రామాలైన ఆరెపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మేయర్ వై.సునీల్‌రావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ నమోదును పరిశీలించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చెల్పూర్‌లో జరిగిన ప్రజాపాలన వేదికకు హాజరు కాగా.. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ పట్టణంలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని ఇల్లంతకుంట లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, శంకరపట్నంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ పరిశీలించారు.

తొలిరోజు దరఖాస్తులు 28,452...

జిల్లా వ్యాప్తంగా తొలిరోజు మొత్తం 28,452 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. 15 మండలాల్లో 16,127 దరఖాస్తులు రాగా, కరీంనగర్ కార్పొరేషన్‌లో 9,319, జమ్మికుంటలో 1,102, హుజూరాబాద్‌లో 1,298, చొప్పదండిలో 402, కొత్తపల్లిలో 204 దరఖాస్తులు వచ్చాయి.

ఆరో తేదీవరకు దరఖాస్తులు స్వీకరించాలి...

ఆరుగ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వచ్చేనెల 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాలని ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఎ.దేవసేన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌డీవో శ్రీలత రెడ్డి, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో పాల్గొన్నారు.

సరిపడా దరఖాస్తు ఫాంలున్నాయ్



కరీంనగర్ అర్బన్: జిల్లాలో ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీ దరఖాస్తు ఫాంలు కావాల్సినన్ని అందుబాటులో ఉన్నాయని.. కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. దరఖాస్తు ఫారాల కోసం ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. వచ్చేనెల 6వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన అభయ హస్తం గ్యారంటీ దరఖాస్తుల స్వీకరణ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పుస్తకాలు చదవడంలో ఆనందమే వేరు

కరీంనగర్ కల్చరల్: పరిణామ క్రమంలో ఆన్‌లైన్ పుస్తకాలు చదివే రోజులు వచ్చినా.. ఫిజికల్‌గా పుస్తకాలు చదవడంలో ఉన్న ఆనందమే వేరని నగర మేయర్ వై.సునీల్ రావు అన్నారు. సమైక్య సాహితీ ఆధ్వర్యంలో స్థానిక భగవతి పాఠశాలలో సంపత్ కుమార్ రచించిన తెలంగాణ పల్లె పదాల పరిమళం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన చీఫ్‌గెస్ట్‌గా హాజరయ్యారు. ఆన్‌లైన్‌లో పత్రికలు వస్తున్నప్పటికీ తాను రోజు ఫిజికల్ గా ఎనిమిది దినపత్రికలు చదివిన తర్వాతే బయటకు వెళ్తానన్నారు. కవులు రచయితలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నారని కొనియాడారు. యువత భాషపై పట్టు కోల్పోయి పెడదోవ పడుతున్న ప్రస్తుత తరుణంలో.. సంపత్ కుమార్ తెలంగాణ భాషను కాపాడుతూ గ్రామీణ పదాలు సేకరించి భద్రపరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి కేఎస్ అనంత ఆచార్య పుస్తకాన్ని సమీక్షించారు. విశిష్ట అతిథులుగా హాజరైన ఎస్ఆర్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ కలువకుంట రామకృష్ణ మాట్లాడుతూ ఈపుస్తకం భావితరాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సంస్థ అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రుద్రమసాహితీ సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ అడువాల సుజాత, రచయిత్రి నీలగిరి అనిత, ప్రముఖ డాక్టర్ ప్రశాంత్, ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న మేయర్ సునీల్ రావు

'స్మార్ట్‌సిటీ' అక్రమాలపై విచారణ చేపట్టాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

కరీంనగర్: స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనుల్లో రూ. 200 కోట్ల అవినీతి, అక్రమాలు జరిగాయని.. వాటన్నింటిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి మాటున అడ్డూఅదుపు లేని అవినీతి జరిగిందన్నారు. ఈ వ్యవహారంలో పాలకవర్గం, కాంట్రాక్టర్లు, బీఆర్ఎస్ లీడర్ల హస్తం ఉందన్నారు. స్మార్ట్‌సిటీ అక్రమాలపై తమ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే విచారణ చేపట్టి నిధులు రికవరీ చేయించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నిధుల దుర్వినియోగంపై దృష్టి సారించాలని.. లేదంటే బీఆర్ఎస్ తో మిలాఖత్ అయినట్లు భావించాల్సి వస్తుందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించిందని ఆరోపించారు. కరోనా టైంలో చేపట్టిన పనుల్లో క్వాలిటీ లేకుండా పోయిందన్నారు. తెలంగాణ చౌక్ జంక్షన్‌ను మూడుసార్లు చేర్పులు, మార్పులు చేస్తూ టెండర్లు పిలవడంలో మర్మమేమిటో చెప్పాలన్నారు. తెలంగాణతల్లి విగ్రహం జంక్షన్ ఇంప్రూమెంట్ ఎన్నిసార్లు చేస్తారని.. చొక్కారావు విగ్రహం ఎక్కడ ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. అవినీతి ఇంజినీరింగ్ అధికారులను సస్పెండ్ చేయాలని.. వారి ఆస్తులపై ఏసీబీ దాడులు చేయించి రికవరీ చేయించాలని డిమాండ్ చేశారు. రాజశ్రీ గార్డెన్ వేదికగా అధికారులు, ప్రజాప్రతినిధులు డబ్బులు పంచుకున్న విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, టేకుమల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, నాయకులు రాజమల్లు, సంపత్, కృష్ణ, లింగన్న పాల్గొన్నారు.

నేతల రాక.. రాజకీయ కాక

- అసెంబ్లీ ఎన్నికల ఏడాదిలో వరుస పర్యటనలు
- ఆరోపణలు, ప్రత్యారోపణలతో పొలిటికల్ హీట్
- ఐఏఎస్, ఐపీఎస్‌ల ఆకస్మిక బదిలీలు
- శాసన సమరంలో అనూహ్యంగా పుంజుకున్న కాంగ్రెస్
- ఉమ్మడి జిల్లాలో 8 సీట్లు గెలిచి, అధికారంలోకి..
- బీఆర్ఎస్‌కు 5 సీట్లు.. ఖాతా తెరవని బీజేపీ

2023 రివైండ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఈ ఏడాది పలు పార్టీల అగ్రనేతలు వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సంవత్సరం కావడంతో ఆందోళనలు, ఆరోపణలు, ప్రత్యారోపణలకు వేదికైంది. ఐఏఎస్, ఐపీఎస్‌ల అనూహ్య బదిలీలు జరిగాయి. మొదటి ఆరు నెలల్లో పలు అభివృద్ధి పనులు, మెడికల్ కాలేజీలు, కేబుల్ బ్రిడ్జి ప్రారంభోత్సవాలు, ఆత్మీయ సమ్మేళనాలతో బీఆర్ఎస్ బిజీగా గడిపింది. కర్ణాటక ఎన్నికల్లో సాధించిన విజయంతో కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. తర్వాత ఆరు నెలల్లో రాజకీయ వేడి పెరిగింది. అభ్యర్థుల కూర్పు, ప్రకటన, ఎన్నికల ప్రచారం, ప్రధాని నుంచి ముఖ్యమంత్రి, జాతీయ నేతలు తదితరులు ప్రచారం చేశారు. శాసన సమరంలో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ 8 సీట్లు గెలిచి, అధికారంలోకి రాగా, బీఆర్ఎస్ కేవలం 5 సీట్లకు పరిమితమైంది. బీజేపీ ఖాతా తెరవలేకపోయింది.



ప్రచారానికి వచ్చిన ప్రధాని మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ సంజయ్



ఎన్నికల సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో రాహుల్ గాంధీ యాత్ర

జనవరి 16: మంత్రి గంగులకు సీఎం పరామర్శ.. మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య మరణించడంతో ఆయన పెద్దకర్మకు సీఎం కేసీఆర్ వచ్చారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యులను ఓదార్చి, 10 నిమిషాల్లోనే పర్యటన ముగించుకున్నారు.

జనవరి 25: బీఆర్ఎస్‌ను వీడిన భోగ శ్రావణి.. జగిత్యాల మున్సిపాలిటీలో అసమ్మతి పుట్టింది. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో విభేదాల కారణంగా శ్రావణి మున్సిపల్ చైర్ పర్సన్ పదవికి, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. మార్చిలో బీజేపీలో చేరారు.

జనవరి 26: సీపీలు, ఎస్పీల బదిలీ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు పోలీసు బాస్‌ల బదిలీలు జరిగాయి. కరీంనగర్ సీపీగా ఎల్.సుబ్బారాయుడు, రామగుండం సీపీగా రెమా రాజేశ్వరి, జగిత్యాల ఎస్పీగా భాస్కర్, సిరిసిల్ల ఎస్పీగా అఖిల్ మహాజన్ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఉన్న సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, సింధూశర్మ, రాహుల్ హెగ్డేలు బదిలీ అయ్యారు.

జనవరి 30: ఇతర నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నట్లు వస్తున్న వార్తలను ఎంపీ బండి సంజయ్ వర్గం ఖండించింది. కరీంనగర్ అసెంబ్లీ బరిలో ఉంటారని 'సాక్షి'కి లీకులిచ్చింది.

ఫిబ్రవరి 03: రైల్వే బడ్జెట్‌లో రూ.647 కోట్లు.. కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ఈసారి రైల్వే ప్రాజెక్టులకు పెద్దపీట వేశారు. రూ.647 కోట్లు కేటాయించారు.

ఫిబ్రవరి 15: అంజనాద్రి మాస్టర్ ప్లాన్‌కు రూ.600 కోట్లు.. జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో సీఎం కేసీఆర్ పర్యటించారు. కొండగట్టును అంజనాద్రిగా మారుస్తామన్నారు. సంబంధిత మాస్టర్ ప్లాన్‌కు రూ.600 కోట్లు కేటాయించారు.

మార్చి 08: ఆరోగ్య మహిళకు శ్రీకారం.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 57 మెడికల్ టెస్టులు నిర్వహించేందుకు ఉద్దేశించిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు కరీంనగర్‌లో శ్రీకారం చుట్టారు.

మార్చి 09: కరీంనగర్ కవాతు.. రాహుల్ గాంధీ చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు సంఘీభావంగా కరీంనగర్ కవాతు పేరిట కాంగ్రెస్ పార్టీ కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఛత్తీస్‌ఘడ్ సీఎం భూపేశ్ బగేల్ తోపాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీనియర్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్, శ్రీధర్‌బాబు తదితరులు హాజరయ్యారు.



ప్రచార సభలో సీఎం కేసీఆర్, గంగుల

మార్చి 21: గులాబీ సమ్మేళనాలు.. బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో జరిపారు.

మార్చి 23: ఎకరాకు రూ.10 వేలు.. అకాల వర్షాల కారణంగా కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలంలో దెబ్బతిన్న పంటలను సీఎం కేసీఆర్ పరిశీలించారు. ఎకరానికి రూ.10 వేల పరిహారం ప్రకటించారు.

ఏప్రిల్ 08: ఎంపీ బండికి పరామర్శ.. ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో అరెస్టయి, విడుదలైన ఎంపీ బండి సంజయ్‌ను బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ పరామర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ తీరుపై విరుచుకుపడ్డారు.

ఏప్రిల్ 14: ప్రకాశ్ అంబేడ్కర్ పర్యటన.. బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన దళితబంధు యూనిట్లను పరిశీలించేందుకు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్ హుజూరాబాద్‌లో పర్యటించారు.

మే 13: కర్ణాటక ఎన్నికల బూస్టింగ్.. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఉమ్మడి జిల్లా హస్తం పార్టీ నేతలు సంబరాలు జరుపుకున్నారు.

మే 14: మదర్సాలను రద్దు చేశా : అసోం సీఎం.. హనుమాన్ జయంతి సందర్భంగా ఎంపీ బండి సంజయ్ నిర్వహించిన హిందూ ఏక్తాయాత్రలో అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ పాల్గొన్నారు. తాను అసోంలో మదర్సాలను రద్దు చేశానని తెలిపారు.

మే 31: టీటీడీ ఆధ్వర్యంలో కరీంనగర్ పద్మనగర్‌లో నిర్మింతలపెట్టిన వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమిపూజ నిర్వహించారు.

జూన్ 15: బూట్లు వేసుకోలేదు : ఎంపీ బండి వివరణ.. బీజేపీ నేత ప్రకాశ్ జవడేకర్ వేములవాడ ఆలయంలోకి బూట్లు వేసుకొని వచ్చారన్న ప్రచారం రాజకీయ దుమారం రేగింది. దీనికి ఆయన సాక్షులతో ఆలయంలోకి వచ్చారని ఎంపీ బండి సంజయ్ వివరణ ఇచ్చారు.

జూన్ 21: కేబుల్ బ్రిడ్జి ప్రారంభం.. కరీంనగర్‌లో రూ.220 కోట్లతో నిర్మించిన కేబుల్ బ్రిడ్జిని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

జూన్ 22: పొత్తుల్లేవ్: ఎంపీ సంజయ్.. అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

జూలై 16: పెద్దపల్లి కలెక్టర్ సంగీత సత్యనారాయణ స్థానంలో ముజమ్మిల్‌ఖాన్ నియమితులయ్యారు.

జూలై 25: కరీంనగర్ కలెక్టర్ కర్ణన్ బదిలీ అవగా, ఆయన స్థానంలో బి.గోపి బాధ్యతలు చేపట్టారు. అడిషనల్ కలెక్టర్లుగా ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ విధుల్లో చేరారు.

సెప్టెంబర్ 5: గంగులకు ఈడీ నోటీసులు.. గ్రానైట్ వ్యాపారంలో మంత్రి గంగుల కమలాకర్ ఫెమా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఈడీ ఆయన కుటుంబసభ్యులకు నోటీసులు అందజేసింది.

సెప్టెంబర్ 15: మెడికల్ కాలేజీల ప్రారంభం.. సిరిసిల్ల, కరీంనగర్‌లలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

అక్టోబర్ 06: తులం బంగారం.. కాంగ్రెస్ మేనిఫెస్టో రూపకల్పనలో భాగంగా కల్యాణలక్ష్మి పథకానికి అదనంగా తులం బంగారం ఇస్తామని కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తీర్మానం చేసి, అధిష్టానానికి పంపారు.

అక్టోబర్ 28: కరీంనగర్ సీపీ, కలెక్టర్ బదిలీ.. కరీంనగర్ కలెక్టర్ బి.గోపి, సీపీ సుబ్బారాయుడులను ఎన్నికల సంఘం అనూహ్యంగా బదిలీ చేసింది. వీరి స్థానంలో పమేలా సత్పతి, అభిషేక్ మహంతిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బీజేపీ నేతల ఫిర్యాదులతో చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

నవంబర్ 23: గాదె ఇన్నయ్య, మావోయిస్టు నేత పుల్లూరి ప్రసాద్‌లపై రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఉపా కేసు నమోదైంది.

జాతీయ, రాష్ట్ర నేతల సందడి

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో నవంబర్ నెలలో పలువురు జాతీ య, రాష్ట్ర నేతలు తరలివచ్చారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా, యూపీ సీఎం యోగి, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మాజీ సీఎం మాయావతి, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటించారు.



కరీంనగర్ తీగల వంతెనను ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, గంగుల (ఫైల్)



రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ శ్రావణి(ఫైల్)

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగసుధారాణి, పీడీ వినీత్

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థిని శాన్వి ఎస్జీఎఫ్ అండర్–14 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగసుధారాణి, పీడీ వినిత్‌కుమార్ తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో శాన్వి అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. శాన్విని పాఠశాల సిబ్బంది గురువారం అభినందించారు.

పట్టా అందుకున్న అట్ల శ్రీనివాస్‌రెడ్డి



పట్టా అందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్: జిల్లాకు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ డా.అట్ల శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక విద్య(మేధో వైకల్యం) పట్టా అందుకున్నారు. గురువారం డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం జూబ్లిహిల్స్‌లో 25వ స్నాతకోత్సవం సందర్భంగా వివిధ విభాగాల్లో ఉత్తీర్ణత సాధించినవారందరికీ పట్టా ప్రదానోత్సవం కార్యక్రమం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ఎం.జగదీష్‌కుమార్, ప్రొఫెసర్ వి.ఎస్.ప్రసాద్, ఉప కులపతి కె.సీతారామరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు సాక వెంకటేశ్వర్‌రావు, సభ్యులు మేతరి సింపోనియా తదితరులు అభినందించారు.

అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలలో ఆర్బీఐ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సమాల్

కొత్తపల్లి: కరీంనగర్ సీతారాంపూర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మహిళల ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్బీఐ హైదరాబాద్ బ్రాంచి డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రభుతి సమాల్, మేనేజర్ తాన్యాసంగ్మా, అసిస్టెంట్ మేనేజర్ వసుప్రద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మహిళలు ఉద్యోగ అవకాశాలు ఎలా పొందాలో వివరించారు. ఉద్యోగం సాధించే క్రమంలో పరీక్షా విధానంతో పాటు మూడు దశల్లో నిర్వహించే నియామక ప్రక్రియ, వ్యక్తిగత ఇంటర్వ్యూ నియమాలను విశదీకరించారు. కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాళ్లు బి.విజయలక్ష్మి, జి.చంద్రశేకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కబ్జాకోరులపై కఠిన చర్యలు

- గంజాయి దందాపై ఉక్కుపాదం
- ఇసుక అక్రమ రవాణా చేస్తే జైలుకే
- అక్రమాల నియంత్రణకు ప్రత్యేక విభాగం
- వచ్చే ఏడాది విజిబుల్ పోలీసింగ్ లక్ష్యంగా పనిచేస్తాం
- సీపీ అభిషేక్ మహంతి
- వార్షిక నేరాల నివేదిక వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: నకిలీ భూ పత్రాలు తయారు చేయడం... ఇతరుల భూములను కబ్జా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, డ్రగ్స్, గంజాయి దందాపై ఉక్కుపాదం మోపుతామని కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి హెచ్చరించారు. గురువారం కరీంనగర్ కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో 2023 సంవత్సరం వార్షిక నేరాల నివేదిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా పూర్తిచేశామన్నారు. కొత్త సంవత్సరం విజిబుల్ అండ్ రెస్పాన్సింగ్ పోలీసింగ్ కోసం కృషిచేస్తామన్నారు. స్టేషన్ స్థాయి నుంచి ఉన్నతాధికారులకు వరకు ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలపాలు చేస్తున్నవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే డ్రైవర్లతో పాటు వాహన యజమానులపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. అక్రమాల కట్టడికి ప్రత్యేక పోలీస్ టీంలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఆర్థిక నేరాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని, విదేశాలకు పంపిస్తామని మోసాలు చేసేవారిపై ప్రత్యేక దృష్టిసారించి కటకటాల్లోకి పంపుతామన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఇప్పటికే పరిశీలించామని.. త్వరలో సిగ్నల్స్ ప్రారంభిస్తామన్నారు.

న్యూ ఇయర్ వేడుకలకు అనుమతి తప్పనిసరి..

నూతన సంవత్సరం సందర్భంగా ఈవెంట్లు నిర్వహించేవారు ఖచ్చితంగా పోలీసుశాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సీపీ స్పష్టంచేశారు. నూతన సంవత్సరం వేడుకలు పూర్తయ్యే వరకు నిత్యం డ్రంకెన్ డ్రైవ్ ఉంటుందన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా వేడుకలు జరుపుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) లక్ష్మీనారాయణ, ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, మాధవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

2022, 2023 సంవత్సరాలలో జరిగిన నేరాల వివరాలు

నేరం	2022	2023
ఆస్తికోసం హత్య	01	02
దోపిడీ	04	07
దొంగతనాలు	243	321
హత్యలు	24	20
హత్యాయత్నాలు	41	46
కల్పబుల్‌హోమీసైడ్	02	06
అల్లర్లు	22	25
కిడ్నాప్‌లు	41	48
అత్యాచారాలు	34	25
గొడవలు	525	659
మోసాలు	533	442
క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్	25	38
రోడ్డు ప్రమాదాలు	621	653
ఇతర కేసులు	1836	2616
ప్రత్యేక చట్టాల కింద కేసులు	95	286
సీఆర్‌పీసీ కేసులు	722	714

దాడి సంఘటనలో నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌లో భార్యభర్తల వివాదం విషయంలో పెద్దల సమక్షంలో పంచాయితీ జరుగుతున్న క్రమంలో అనుప రజిత ఆమె కుమారులు, తల్లిపై దాడిచేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. అనుప రజిత తన భర్త అంజయ్య మధ్య గొడవలు ఉన్నాయి. ఈ విషయంలో కులపెద్దలు ఈనెల 23న పంచాయితీ నిర్వహిస్తుండగా.. అక్కడే ఉన్న తన భర్త అంజయ్యతోపాటు అనుప మల్లయ్య, అనుప పర్శయ్య, అనుప ఎల్లయ్యలు కలిసి తన ఇద్దరు కొడుకులతోపాటు తన తల్లి నర్సవ్వపై దాడి చేశారని ఫిర్యాదు చేసింది. రజిత ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివేకానంద పాఠశాలలో క్రీడా దినోత్సవం

విద్యానగర్(కరీంనగర్): స్థానిక జగిత్యాల రోడ్‌లోని వివేకానంద రెసిడెన్షియల్(సీబీఎస్ఈ) పాఠశాలలో క్రీడా దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కరీంనగర్ రూరల్ ఏసీపీ టి.కరుణాకర్‌రావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలు క్రీడాకారుల జట్ల మధ్య స్నేహపూర్వక భావాన్ని, బృంద స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. క్రీడలు విద్యలో ఒక అంతర్భాగమని, ప్రతి విద్యార్థి క్రీడల్లో చురుగ్గా పాల్గొని శారీరక, మానసిక ఆనందాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వివిధ రకాల శకటాలను ప్రదర్శించారు. అందులో వసుధైక కుటుంబం, చంద్రయాన్-3, ప్రపంచ క్రికెట్-2023 కప్ ప్రాముఖ్యం తెలిపే శకటం ఆకట్టుకున్నాయి. విద్యార్థుల రకరకాల ఆటల ప్రదర్శనలు మంత్రముగ్ధులను చేశాయి. జిల్లా యువజన క్రీడల అధికారి కీర్తి రాజవీరు, పాఠశాల చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు పాల్యాని, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్.టి.లలితాకుమారి, పాఠశాల ప్రిన్సిపాల్ టి.రేణుకా బలివాడ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఏసీపీ తదితరులు

యువతి బలవన్మరణం



ఆర్థిక మృతదేహం

చిగురుమామిడి: మండల కేంద్రానికి చెందిన మేకల ఆర్థిక (17) అనే యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆర్థిక ఇంటర్ వరకు చదివింది. సునీత–పర్శరాములు దంపతులకు మూడో కూతురు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌గా శిక్షణ పొందుతోంది. తన తండ్రి పర్శరాములుకు పక్షవాతం, క్యాన్సర్ వ్యాధితో సంవత్సర కాలంగా మంచానికే పరిమితమయ్యాడు. వ్యాధిని నయం చేయించేందుకు చేతిలో డబ్బు లేక తీవ్ర మనస్తాపానికి గురైన ఆర్థిక.. గురువారం సాయంత్రం సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రకాశ్ తెలిపారు. శవ పంచనామా నిర్వహించి హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

నిద్రలోనే అనంతలోకాలకు..

- ఏడాది చిన్నారి పైనుంచి వెళ్లిన ట్రాక్టర్
- నిద్రలోనే ప్రాణాలు వదలిన పైనం
- జగిత్యాల జిల్లా గుండంపల్లిలో ఘటన

మల్లాపూర్: అభం శుభం తెలియని చిన్నారి నిద్రలోనే అనంతలోకాలకు చేరింది. ట్రాక్టర్ చక్రాల కింద నలగగా.. ఆ పసిబిడ్డకు ఏడాదికే నూరేళ్లు నిండాయి. తన తల్లికి కడుపుకోత మిగలగా.. వలస కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం గుండంపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా వర్ని గ్రామానికి చెందిన సబావత్ స్వరూప– రాజు దంపతులు జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం గుండంపల్లికి చెరుకు నరికేందుకు వలస వచ్చారు. స్థానికంగా గుడారాలు వేసుకుని నివసిస్తున్నారు. గ్రామానికి చెందిన రెబ్బసు సాలమ్మ తోటలో చెరుకు నరికేందుకు తమ కూతురు కీర్తి(1)ని వెంట తీసుకుని వెళ్లారు. స్వరూప కూతురు కీర్తిని తోటపక్కన ఉన్న రోడ్డుకు సమీపంలో ఓ చెట్టుకింద పడుకోబెట్టి చెరుకు కొట్టేందుకు వెళ్లింది. చెరుకు లోడ్ తీసుకెళ్లేందుకు ట్రాక్టర్ తీసుకొచ్చిన కేతావత్ చిరంజీవి చిన్నారి రోడ్డు పక్కన నిద్రపోయింది గమనించకుండా ఆమె పైనుంచి తీసుకెళ్లాడు. ఆ చక్రాల కింద నలిగిన కీర్తి అక్కడికక్కడే మరణించింది. తమ కళ్లముందే కన్నకూతురు ప్రాణాలు పోగొట్టుకోగా ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ వివరించారు.

కాలువలో పడి కూలీ మృతి

గోదావరిఖని(రామగుండం): స్థానిక సంతోష్‌నగర్‌లో ఉంటూ కూలీ పనిచేసుకుంటున్న బిల్ల బాపు అలియాస్ మల్లికార్జున్(36) గురువారం కాలువలో పడి మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. ఈనెల 21న ఇంటి నుంచి వెళ్లిన బాపు తిరిగి రాలేదు. అడ్డగుంటపల్లి సమీపంలోని మోరీలో పడి ఊపిరాడక మృతిచెందాడు. ప్రమాదవశాత్తు మోరీలో పడి మృతిచెందాడని మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

మనవరాలి శారీ ఫంక్షన్ కోసం వచ్చి..

ధర్మారం(ధర్మపురి): మండలంలోని పత్తిపాక గిరిజనతండా మధ్యలో గురువారం రాత్రి మోటార్‌సైకిల్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలైనాయి. ఎస్సై అశ్విని వివరాల ప్రకారం.. చొప్పదండి మండల కేంద్రానికి చెందిన బాలి వెంకటేశం (60), అతడి భార్య విజయ, పెద్ద కూతురు వినోదతో కలిసి ఆటోలో పత్తిపాకలోని మరో కూతురు గాజుల స్రవంతి ఇంటికి వచ్చారు. భార్య, కూతురును అక్కడే ఉంచి తిరిగి ఆటోలో చొప్పదండికి వెళ్తుండగా ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ఉన్న వెంకటేశం అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవర్‌తో పాటు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన సిరికొండ అనందంకు తీవ్ర గాయాలైనాయి. వారిని చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

మళ్లీ రేపు వస్తానని..

వెంకటేశం రెండో కూతురు స్రవంతిని పత్తిపాకకు చెందిన గాజుల మురళికి ఇచ్చి వివాహం చేశారు. స్రవంతి కూతురుకు శుక్రవారం శారీ ఫంక్షన్ చేయుటకు నిర్ణయించారు. ఫంక్షన్‌ను ఘనంగా చే యాలనే ఉద్దేశంతో ఒక రోజు ముందుగానే వెంకటేశం సామగ్రితో పాటు భార్య, పెద్ద కూతురుతో పత్తి పాకకు వచ్చారు. సామగ్రి ఇంట్లో దించి రేపు వస్తానని ఆటోలో చొప్పదండికి బయలుదేరిన వెంకటేశం ప్రమాదంలో మృతిచెందడం విషాదం నింపింది.

పిల్లలు పుట్టడం లేదని ఆత్మహత్య



లక్ష్మణ్ మృతదేహం

వెల్గటూర్: ఎండపల్లి మండలం పాతగూడూరు గ్రామంలో పిల్లలు పుట్టడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని లక్ష్మణ్(40)కు మొదటి భార్యతో విడాకులు అయ్యాయి. రెండేళ్ల క్రితం కవితను రెండో వివాహం చేసుకున్నాడు. రెండేళ్లు గడిచినా సంతానం కలగకపోవడంతో తరుచూ బాధపడేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. పిల్లలు పుట్టడంలేదనే మనస్తాపంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన రమేశ్

కోనరావుపేట(వేములవాడ): ద్విచక్రవాహనం అదుపుతప్పి పొలంలో పడిపోగా ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం కొండాపూర్‌కు చెందిన పిట్టల రమేశ్(32) గ్రామంలోనే కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం సాయంత్రం వ్యవసాయ పనులకు వెళ్లి బైక్‌పై ఇంటికొస్తున్నాడు. కొండాపూర్ స్టేజీ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన మూడు గజాల లోతులో ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. పొలంలో బోర్లాపడడంతో ఊపిరాడక మృతిచెందాడు. మృతునికి భార్య రేణ, కుమారుడు చరణ్, కూతురు శరణ్య ఉన్నారు. నాలుగేళ్ల క్రితం సిలిండర్ పేలడంతో ఇల్లు కూలిపోయి నిరాశ్రయులయ్యారు. అప్పటి నుంచి అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



రాములు (ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని కాచాపూర్ శివారులో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో వేల్పుల రాములు(48) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కుమ్మరికుంట గ్రామానికి చెందిన వేల్పుల రాములు వ్యవసాయ కూలీ పనులు చేసేవాడు. బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై పనుల నిమిత్తం పెద్దపల్లికి వెళ్లాడు. రాత్రి వచ్చే సమయంలో కాచాపూర్ శివారులోని రోడ్యాం వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో రోడ్డుపై తీవ్రగాయాలతో పడిపోయాడు. కుమ్మరికుంటకు చెందిన మనోజ్, రాములు గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే పెద్దపల్లిలోని ప్రధాన ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడిపి మృతికి కారణమైన కాచాపూర్‌కు చెందిన బాలసాని తిరుమల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఉద్యోగి..



అనిల్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఉద్యోగి మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సింగాపూర్ గ్రామానికి చెందిన గాడి అనిల్ (29) ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం తన ద్విచక్ర వాహనంపై జమ్మికుంటకు వెళ్లి పని ముగించుకొని రాత్రి ఇంటికి వస్తున్న క్రమంలో టిప్పర్ అతివేగంగా, అజాగ్రత్తగా వెనుక నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. చేతికందిన కొడుకు అకాలమరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఆర్థిక ప్రగతి



శిక్షణలో మెలకువలు నేర్పుతున్న అధికారి

కరీంనగర్ అర్బన్: రైతులు మూసధోరణిలో కాకుండా నైపుణ్య మెలకువలతో సాగు చేస్తే అధిక దిగుబడి పొందొచ్చని పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త సంచాలకులు అనసూయ అన్నారు. గురువారం నగరంలోని పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో రైతు నైపుణ్య అభివృద్ధి.. శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టు పురుగుల పెంపకంలో అధిక దిగుబడులు పొందే విధానాలను వివరించారు. మలబ్రీలో పోషకాల లోపాన్ని సరి చేయడం, తెగుళ్ల నివారణ, బెడ్ డిసిన్ఫెక్షన్ వాడకం వంటి పద్ధతులను తెలిపారు. నకిలీ ఉత్పత్తులను ఉపయోగించొద్దని, ప్రభుత్వం సిఫారసు చేసిన పురుగు మందులను మాత్రమే వినియోగించాలని సూచించారు.

కేడీసీసీ బ్యాంకు ఎదుట మహిళా రైతు ఆందోళన



ధర్నా చేస్తున్న మహిళా రైతు

చిగురుమామిడి: మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంకు మేనేజర్ వ్యవహార శైలికి నిరసనగా బ్యాంకు ఎదుట ఇందుర్తి గ్రామానికి చెందిన దుస్స రాజమణి అనే మహిళా రైతు ధర్నాకు దిగింది. దుస్స రాజమణికి 457 సర్వే నెంబర్‌లో 4.35 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో 4 ఎకరాలకు మాత్రమే దీర్ఘకాలిక రుణమిచ్చేందుకు అంగీకరించారు. ఆగస్టు నెలలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ విచారణ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో 24.8.2022న కేడీసీసీ బ్యాంకు పేరిట రిజిస్ట్రేషన్ అయింది. బ్యాంకు రుణం కోసం కావాల్సిన పత్రాలన్నీ సమర్పించినా.. రుణం ఇవ్వడం లేదు. రుణం ఎందుకు ఇవ్వడం లేదని బ్యాంకు మేనేజర్‌ను ప్రశ్నించగా.. కాలయాపన చేశారు. దుస్స రాజమణి గురువారం బ్యాంకు ఎదుట ధర్నా చేపట్టింది. మేనేజర్ రాజమణిని పిలిచి విచారించారు. మీ వైఖరికి నిరసనగా ధర్నా చేస్తున్నట్లు చెప్పింది. మీ భూమిపై మీ బంధువు కోర్టు కేసు పెండింగ్ ఉన్నందున రుణం మంజూరు చేయలేకపోయానని విలేకర్లకు వివరించారు. ఈ విషయాన్ని తనకు ఎందుకు చెప్పలేదని బాధితురాలు మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు నుంచి క్లియరెన్స్ తెచ్చుకున్న మరుక్షణమే రుణం మంజూరు చేస్తానని వివరణ ఇచ్చారు.

జాతీయ సాహస శిక్షణ శిబిరానికి ఎంపిక



రవిచందర్‌ను అభినందిస్తున్న దృశ్యం

కరీంనగర్‌స్పోర్ట్స్: హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో ఈనెల 30 నుంచి జనవరి 8 వరకు జరగనున్న జాతీయ సాహస శిక్షణ శిబిరానికి కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్) వలంటీర్ ఎం.రవిచందర్ ఎంపికైనట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్.గోపికృష్ణ తెలిపారు. శిబిరంలో పర్వతారోహణ, పర్వత అధిరోహణ, నదులు దాటడం, ట్రెక్కింగ్, శిబిరాలు ఏర్పాటు చేయడం(కాంపింగ్), నాయకత్వ లక్షణాలు తదితర అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. రవిచందర్‌ను కళాశాల కరస్పాండెంట్ వి.ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, సతీష్, సంపత్‌కుమార్, ఎండీ అలీఖాన్, శ్రవణ్‌కుమార్, రామేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

చదరంగ పోటీలకు జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు



శ్రీనిజ



సిరిమేఘన



తన్మయి

కరీంనగర్‌స్పోర్ట్స్: తమిళనాడులోని చెన్నై అంబేడ్కర్ యూనివర్సిటీలో నేటి నుంచి జరగనున్న సౌత్ జోన్ యూనివర్సిటీ చదరంగ పోటీలకు స్థానిక జీనియస్ చెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు అకాడమీ డైరెక్టర్ కంకటి కనకయ్య, కోచ్ కంకటి అనూప్‌కుమార్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన సిరిమేఘన, తన్మయి, శ్రీనిజ సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. జీనియస్ చెస్ అకాడమీ బాధ్యులు సజన్, తరుణ్, అనూష్‌కుమార్, అభిరామ్, వారి తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

వైన్‌షాపులో దొంగతనం

- రూ.36వేల నగదు అపహరణ
- రూ.29వేల విలువ గల మద్యం చోరీ



వైన్‌షాపులో సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మొదటి బైపాస్‌రోడ్డులో గల శ్రీలక్ష్మీనరసింహ వైన్‌షాపులో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి దొంగతనానికి పాల్పడ్డాడు. వైన్‌షాపులో ఉన్న రూ.36 వేల నగదు, రూ.29వేల విలువ చేసే మద్యం బాటిళ్లను, ఒక సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారు. బుధవారం రాత్రి వైన్స్ నిర్వాహకులు షాపును బంద్‌చేసి వెళ్లారు. అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తి ముసుగు ధరించి గడ్డపారతో షాపు తాళాలు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించాడు. అదే గడ్డపారతో క్యాష్ కౌంటర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.36వేల నగదు ఎత్తుకెళ్లాడు. అంతేకాకుండా దుకాణంలోని రూ.29వేల మద్యం బాటిళ్లను సైతం అపహరించుకెళ్లాడు. సమాచారం అందుకున్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపడుతున్నారు. రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన వైన్స్ యజమాని చిదుగు శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రెండు ఇళ్లల్లో చోరీ


- ఆరు తులాల బంగారం, 10 తులాల వెండి అపహరణ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ నటేశ్



ఇంట్లో వస్తువులు చిందరవేసిన దొంగలు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని విజయపురికాలనీలో గురువారం వేకువజామున తాళం వేసిన రెండు ఇళ్లలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. విజయపురికి చెందిన బాలగంగాధర్ కుటుంబం తాళంవేసి బంధువుల ఇంటికి వెళ్లారు. అదే కాలనీకి చెందిన వరికోలు రాజశేఖర్ అనారోగ్యంతో ఉండగా, కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. రాజశేఖర్ ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు ఇంట్లోని ఆరు తులాల బంగారం, 10 తులాల వెండి ఎత్తుకెళ్లారు. బాలగంగాధర్ ఇంట్లో ఎలాంటి సొత్తు చోరీకి గురికాలేదు. ఉదయం పక్కింటి వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ నటేశ దొంగతనం జరిగిన ఇళ్లను పరిశీలించారు. సమీప ఇళ్లల్లో ఉన్న సీసీపుటేజీలను పరిశీలించగా జగిత్యాలలోని బ్రాహ్మణవాడ, సాయిరాంనగర్‌లో దొంగతనానికి పాల్పడ్డ దొంగగానే గుర్తించారు. రాజశేఖర్ భార్య రవళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండి మల్లయ్యయాదవ్ కోరారు. గురువారం మొగ్దుంపూర్‌లో ఆటో యూనియన్ అడ్డాను సందర్శించారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత బస్సుతో ఆటోలకు కిరాయి లేకపోవడంతో డ్రైవర్లు ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఆటోలకు ఫైనాన్స్ కిస్తీలను చెల్లించలేక అప్పులు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.10వేలిచ్చి ఆదుకోవాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు దాడి సంపత్‌యాదవ్, బండారి మహేందర్, రమణ, చంద్రయ్య, నర్సయ్య, రవి, అంజయ్య, వీరేశం, శంకర్, పర్శరాములు, మొండయ్య, శ్రీనివాస్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజాపాలన సద్వినియోగం చేసుకోండి



అర్జీల స్వీకరణను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ అర్బన్: ప్రజల అభివృద్ధి, మెరుగైన పరిపాలన కోసం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ కోరారు. గురువారం కరీంనగర్ పట్టణంలోని భగత్‌నగర్, గోదాంగడ్డ, ఆరేపల్లి, మల్కాపూర్ ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ప్రజల వద్దకే వచ్చి దరఖాస్తులను స్వీకరిస్తోందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రేషన్ కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు ఫారాలను తప్పులు లేకుండా నింపి అధికారులకు అందజేయాలన్నారు. ఆయన వెంట నగర మేయర్ వై.సునీల్‌రావు, నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్, కార్పొరేటర్ తోట రాములు తదితరులున్నారు.

ఉచితంగా పంపిణీ

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజాపాలన దరఖాస్తు ఫారాలను నగరపాలక సంస్థ అన్ని డివిజన్లలో ఉచితంగా పంపిణీ చేస్తుందని కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ స్పష్టం చేశారు. జిరాక్స్ సెంటర్లలో ఫారాలను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు సంబంధిత డివిజన్లలో ఉచితంగా దరఖాస్తు ఫారాలను తీసుకోవచ్చని చెప్పారు.

ఏఐటీయూసీ గెలుపుపై హర్షం

కరీంనగర్: సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించడం పట్ల సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కార్మికులందరికీ సీపీఐ అండగా ఉంటుందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని అన్నారు. కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఐఎన్‌టీయూసీ గెలుపు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు రంగంలోకి దిగి డబ్బులు, మద్యం ఇతర ప్రలోభాలకు గురి చేసినా.. కార్మిక లోకమంతా ఎర్రజెండా నీడన ఉన్న ఏఐటీయూసీకి పట్టం కట్టడం అభినందనీయమన్నారు.

కాలయాపనకే దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీకి నమ్మించడం, మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్యని, ఎన్నికల ముందు హడావిడిగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేకే దరఖాస్తుల స్వీకరణ పేరిట ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించిందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గురువారం మీసేవ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీల ఎగవేతకు ప్రభుత్వం దారులు వెతుక్కుంటోందని, తెల్ల రేషన్ కార్డులుంటేనే ఆరు గ్యారంటీలకు అర్హులని చెబుతున్న ప్రభుత్వం.. తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని కోరడం వెనక పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రైతుబంధు, పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, నగర యువత అధ్యక్షుడు దీకొండ కులదీప్, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, ఆరె రవిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, పర్శరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన షురూ..



దరఖాస్తు స్వీకరిస్తున్న మేయర్ సునీల్‌రావు



బద్దిపల్లిలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి



బొమ్మకల్ గ్రామసభలో సీఎం సందేశం చదువుతున్న ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి



తీగలగుట్టపల్లి సెంటర్‌ను సందర్శించిన నోడల్ అధికారి దేవసేన

- బల్దియాలో తొలిరోజు 9,319 దరఖాస్తులు
- పర్యవేక్షించిన నోడల్ అధికారి, జిల్లా కలెక్టర్

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరిన తరువాత తొలిసారి చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం గురువారం నగరపాలక సంస్థ పరిధిలో ప్రారంభమైంది. పది డివిజన్లలో సభలు నిర్వహించగా.. 60 డివిజన్లలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి దేవసేన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి 1వ డివిజన్ పరిధిలోని తీగలగుట్టపల్లి సెంటర్‌ను సందర్శించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ భగత్‌నగర్, గోదాంగడ్డ, ఆరెపల్లి ప్రజాపాలన కేంద్రాలను సందర్శించారు. నగరపాలక సంస్థ కమిషనర్, ప్రత్యేకాధికారి బోనగిరి శ్రీనివాస్ నగరంలోని కేంద్రాలను పర్యవేక్షించారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు తన 33వ డివిజన్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో పాల్గొన్నారు. పది సంవత్సరాల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాపాలన కేంద్రాల వద్ద సందడి చేశారు. ఈ క్రమంలో అక్కడక్కడా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల నడుమ స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి.

9,319 దరఖాస్తులు

నగరంలో ప్రజాపాలన కార్యక్రమాలకు భారీ స్పందన లభించింది. మొదటిరోజు గురువారం 1, 6, 12, 14, 18, 20, 25, 33, 42, 45 డివిజన్లలో సభలు నిర్వహించారు. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగం వినిపించారు. అనంతరం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. అన్ని డివిజన్లలో కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా డివిజన్లకు కేటాయించిన సిబ్బంది, అధికారులు ప్రజాపాలన దరఖాస్తు ఫారాలను అందజేయడంతో పాటు దరఖాస్తులపై అవగాహన కల్పించారు. మొదటిరోజు నగరవ్యాప్తంగా 9,319 దరఖాస్తులు వచ్చాయి. 4వ తేదీ వరకు దరఖాస్తుల సంఖ్య భారీగా పెరగనుందని అధికారులు భావిస్తున్నారు.

రేషన్ కార్డులపై ఆరా..

నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కు గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా అందించే గృహజ్యోతి, పింఛన్లు అందించే చేయూత పథకాలకు సంబంధించి మాత్రమే ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత పథకాలకు ప్రజలు అధికంగా దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యమిచ్చారు. అయితే వీటితో పాటు చాలామంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు రావడం కనిపించింది. రేషన్ కార్డుల దరఖాస్తుకు ఫారంలో చోటు లేకున్నా.. తెల్ల కాగితంపై దరఖాస్తు రాసి ఇచ్చేందుకు వచ్చారు. ఇదిలా ఉంటే రేషన్ కార్డు ఉన్న వాళ్లే దరఖాస్తు చేసుకోవాలని చెప్పినా.. చాలామంది రేషన్ కార్డు లేకున్నా దరఖాస్తు చేశారు. రేషన్ కార్డు అన్న చోట లేదు అని రాసి మరీ దరఖాస్తు చేసుకోవడం విశేషం

కాంగ్రెస్ నాయకుల సందడి

దశాబ్ద కాలం తరువాత తమ పార్టీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం కావడంతో ప్రజాపాలనలో కాంగ్రెస్ నాయకుల సందడి కనిపించింది. ప్రజాపాలన కేంద్రాల ప్రాంతాల్లో ఆయా డివిజన్లకు సంబంధించిన నాయకులు ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కేంద్రాల్లోనూ స్థానిక కాంగ్రెస్ నాయకులు దరఖాస్తులు ఇప్పిస్తూ.. తీసుకుంటూ హడావుడి చేశారు. ఈ క్రమంలోనే కొన్ని డివిజన్లలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు, డివిజన్ స్థాయి కాంగ్రెస్ నాయకులకు నడుమ స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. సెంటర్ల ఏర్పాటు ఎక్కడ చేయాలనే విషయంలో కార్పొరేటర్లతో సమానంగా కాంగ్రెస్ నాయకులు సైతం అధికారులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. వేదికపై కూర్చునే విషయంలోనూ అక్కడక్కడా వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి.

గ్యారంటీలకు దరఖాస్తుల వెల్లువ

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన అభయహస్తం గ్యారంటీలకు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలిరోజు గురువారం బద్దిపల్లి, బావుపేట గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో 956 దరఖాస్తులు వచ్చాయి. గ్రామస్తులకు తొలుత ప్రభుత్వ ఉద్దేశాన్ని అధికారులు చదివి వినిపించారు. బద్దిపల్లిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు టీం లీడర్‌గా ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించగా.. డిప్యూటీ తహసీల్దార్ సుమలత, విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీనారాయణ, వైద్యాధికారి మౌనిక, ఎంపీవో సీహెచ్ రంజిత్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ ఎం.అనూష, ఈజీఎస్ ఏపీవో స్వందన, సర్పంచ్ రాచమల్ల మధు పాల్గొన్నారు. బావుపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన గ్రామసభకు తహసీల్దార్ ఎస్.రాజేశ్ టీం లీడర్‌గా, ఎంపీవో డి.శ్రీనివాస్, సీహెచ్‌వో శ్రీనివాస్, ఏఈవో లలిత, సెర్ప్ ఏపీఎం రఘుపతి, సీఆర్పీ పరశురాములు, కార్యదర్శి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు హాజరయ్యారు. బావుపేటలో 756 దరఖాస్తులు రాగా, బద్దిపల్లిలో 156 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను నింపడంతో పాటు జిరాక్స్ ప్రతుల కోసం మహిళలు జిరాక్స్ సెంటర్లు, ఇతరుల సహాయం తీసుకున్నారు.

కొత్తపల్లి మున్సిపల్‌లో..


కొత్తపల్లి పట్టణంలోని 1వ వార్డులో నిర్వహించిన అభయహస్తం గ్యారంటీల వార్డు సభకు 204 దరఖాస్తులు వచ్చాయి. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, స్థానిక కౌన్సిలర్ వాసాల రమేశ్, ప్రత్యేకాధికారి రాజవీరు, మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

1,174 దరఖాస్తులు..

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్, చామనపల్లిలో నిర్వహించిన గ్రామసభల్లో ముందుగా అధికారులు ప్రజాపాలన గ్రామసభలపై సీఎం సందేశాన్ని చదివి విన్పించారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ఒక్కో గ్రామంలో ఏడు కౌంటర్లను ఏర్పాటు చేసి అధికారులను నియమించారు. దరఖాస్తు చేసేందుకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఐదు సంక్షేమ పథకాలైన మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూతకు ప్రభుత్వం రూపొందించిన ఒకే దరఖాస్తులో లబ్ధిదారులు వివరాలను నింపివ్వాలని తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు కోరారు. చామనపల్లి గ్రామసభను అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, ఆర్డీవో కె.మహేశ్వర్ తనిఖీ చేశారు. దరఖాస్తుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బొమ్మకల్‌లో 808, చామనపల్లిలో 366 మొత్తం 1,174 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎంపీపీ టి.లక్ష్మయ్య, సర్పంచులు బోగొండ లక్ష్మి, పురుమల్ల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు వెంగల్‌దాసు శ్రీనివాస్, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బావుపేట బ్రిడ్జి పనులకు బ్రేక్

- నీరు నిలవడంతో నిలిచిన వంతెన పనులు
- హైలెవల్ వంతెన నిర్మాణంలో ఏళ్లుగా జాప్యం
- కరీంనగర్–వేములవాడ మార్గంలో ప్రయాణానికి ఆటంకాలు
- తరచూ ప్రమాదాలతో ప్రయాణికుల ఆందోళన



నిలిచిన బావుపేట వంతెన పనులు



చింతకుంట బ్రిడ్జి సమీపంలో గుంతలు

కొత్తపల్లి: పద్మనగర్–ఒద్యారం నాలుగు లైన్ల రహదారి విస్తరణలో భాగంగా బావుపేట శివారులో నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పనులు నిలిచిపోయాయి. వర్షాలు అధికంగా కురవడంతో బావుపేట చెరువు నుంచి ఎలగందుల చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఈ క్రమంలో రెండు చెరువుల మధ్య ప్రవాహంపై నిర్మించతలపెట్టిన వంతెన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా బావుపేట హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్(బావుపేట) పారిశ్రామిక ప్రాంతం మీదుగా వేములవాడ, కామారెడ్డికి వెళ్లే రహదారిపై ప్రతినిత్యం నెలకొన్న రద్దీని దృష్టిలో పద్మనగర్–ఒద్యారం మధ్య 13.8 కిలోమీటర్ల నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులను రూ.89కోట్లు నిధులతో చేపట్టారు. అయితే ఈ నాలుగు లైన్ల రహదారి విస్తరణలో భాగంగా బావుపేట గ్రామ శివారులో చేపట్టిన వంతెన నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది.

నిలిచిన పనులు

పద్మనగర్–ఒద్యారం రహదారి విస్తరణ పనుల్లో భాగంగా బావుపేటలో చేపట్టిన వంతెన నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. రహదారి విస్తరణలో భాగంగా చింతకుంట ఎస్సారెస్పీ కెనాల్‌పై రూ.1.69కోట్లతో, కమాన్‌పూర్, బావుపేటలో రూ.3.60కోట్లతో మూడు హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణ పనులను చేపట్టారు. ఎట్టకేలకు చింతకుంట, కమాన్‌పూర్‌లో వంతెనల నిర్మాణ పనులు పూర్తయినా.. బావుపేట శివారులో నిర్మిస్తున్న వంతెనకు గ్రహణం పట్టుకుంది. నిర్మాణ పనుల్లో జాప్యం మూలంగా వేలాది వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అంతేగాకుండా దుమ్ముతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

చింతకుంట బ్రిడ్జి వద్ద గుంతలు

రహదారి విస్తరణలో భాగంగా చింతకుంట వద్ద నిర్మించిన హైలెవల్ వంతెనకిరువైపులా గుంతలున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వంతెన చివర్లో తారు వేయకపోవడంతో గుంతలు పడ్డాయి. వెంటనే అధికారులు స్పందించి గుంతలు పూడ్చేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తరచూ ప్రమాదాలు

బావుపేట బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ప్రయాణం నరకంగా మారింది. కరీంనగర్ నుంచి పారిశ్రామిక ప్రాంతం బావుపేట, వేములవాడ, సిరిసిల్ల, కామారెడ్డి తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలు, అటువైపు నుంచి కరీంనగర్‌కు వచ్చే వాహనాల ప్రయాణానికి ఆటంకం ఏర్పడుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటం.. ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలూ లేకపోలేదు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో పురోగతి లేకపోవడం ప్రయాణికులను నిరాశకు లోను చేస్తుండటం ఒకెత్తయితే.. ప్రమాదాలు వాహనదారులను కలవరపెడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



మహిళలు బిజీబిజీ



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీల పథకాల్లో భాగంగా ప్రజాపాలన దరఖాస్తులు సమర్పించేందుకు గురువారం నుంచి ప్రారంభమైన సమావేశాల్లో మహిళలు ఎక్కడ చూసినా దరఖాస్తు ఫారాలు తీసుకొని ఫారాలను నింపడం కనిపించింది. మరోవైపు కొన్ని రోజులుగా గ్యాస్ ఏజెన్సీల వద్ద కేవైసీ చేయించుకోవాలని ఉచిత గ్యాస్ పథకానికి కేవైసీకి సంబంధం ఉందని జరుగుతున్న ప్రచారంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతూ మహిళలు బిజీబిజీగా ఉంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



అయ్యప్పకు అభిషేకం చేస్తున్న సుధాకర్

ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లో గురువారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. చల్మెడ ఆనందరావు ఆస్పత్రి సమీపంలోని గురుస్వామి దాది సుధాకర్ స్వగృహంలో ఉదయం 10 గంటలకు అయ్యప్ప స్వామి మెట్లను రంగురంగుల పూలతో అలంకరించారు. వేదపండితులు మంగళంపల్లి వేణయ్య, హరిశర్మ ఆధ్వర్యంలో గురుస్వాములు చంద్రమౌళి, భాష్యం శ్రీను, జీకే శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాముల అయ్యప్ప నామస్మరణతో పరిసరాలు మారుమోగాయి. అనంతరం స్వాములకు భిక్ష పెట్టారు. మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్, బీజేపీ నాయకులు అజయ్‌వర్మ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల కుటుంబ సర్వే



కుటుంబ సర్వే ప్రోగ్రాం ప్రారంభిస్తున్న రుద్ర రాజు, లక్ష్మీనారాయణ

కొత్తపల్లి(కరీంనగర్): జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు కుటుంబ దత్తత కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ వైద్య కళాశాల మొదటి సంవత్సరం(2023–24) ఎంబీబీఎస్ విద్యార్థులు కొత్తపల్లి పట్టణంలో చేపట్టే కుటుంబ సర్వే ప్రోగ్రాంను గురువారం కొత్తపల్లి పీహెచ్‌సీ వద్ద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ప్రారంభించారు. ఒక్కో వైద్య విద్యార్థి పట్టణంలోని మూడు నుంచి ఐదు కుటుంబాలను సర్వే చేసి వారి ఆరోగ్య పరిస్థితులను ఫీల్డ్ రిజిస్టర్‌లో నమోదు చేసి వారి ఆరోగ్య వివరాలను పరిశీలించి సూచనలు అందిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత, ఏవో అగస్టిన్, పీహెచ్‌సీ వైద్యాధికారి నాజియా, ఎంఎస్‌డబ్ల్యూ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ శారద, హెచ్‌ఈవో శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి



వినతి పత్రం చూపిస్తున్న యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కరీంనగర్: రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ జూనియర్ కళాశాలలైన శ్రీచైతన్య, నారాయణ, ఇతర కళాశాలలు పదోతరగతి విద్యార్థులకు ముందస్తుగా స్కాలర్‌షిప్, నీట్, మెయిన్స్, టాలెంట్ పరీక్షలు నిర్వహించి ప్రవేశాలు చేయిస్తున్నారని, అలాంటి కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ గురువారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డు ఇంటర్ ప్రవేశాలకు తేదీలు ప్రకటించకముందే కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలు బ్రోకర్లను నియమించుకొని పరీక్షలు నిర్వహిస్తూ ప్రవేశాలు చేస్తున్నారని, స్థానికంగా ఉన్న జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రద్దు చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సంధ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



డీసీసీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

దేశాభివృద్ధిలో కాంగ్రెస్‌ది ప్రధాన పాత్ర

కరీంనగర్ కార్పొరేషన్: దేశ స్వాతంత్ర్యోద్యమంలో కీలక భూమిక పోషించడంతో పాటు దేశాన్ని అభివృద్ధి పథంలోకి నడిపించిన పార్టీ కాంగ్రెస్ అని ఆ పార్టీ నాయకులు అన్నారు. గురువారం కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. డీసీసీ కార్యాలయం, సిటీ కాంగ్రెస్ కార్యాలయాలతో పాటు 27, 11 డివిజన్లలో కాంగ్రెస్ జెండా ఎగరేశారు. నాయకులు మాట్లాడుతూ.. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ రానున్న లోకసభ ఎన్నికల్లో ఘన విజయం సొంతం చేసుకుంటుందన్నారు. నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కట్ల సతీష్, ఎం.డి.తాజ్, సిరాజ్‌హుస్సేన్, కొరివి అరుణ్‌కుమార్, శ్రవణ్‌నాయక్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం మధు తదితరులు పాల్గొన్నారు.



చామనపల్లిలో..

చామనపల్లిలో..

కరీంనగర్‌రూరల్: చామనపల్లిలో మండల అధ్యక్షుడు కె.రాంరెడ్డి జెండా ఎగరేశారు. బ్లాక్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు జగ్గాని కనకయ్య, ప్రధాన కార్యదర్శులు భూమయ్య, శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మీసాల సాయిలు, దీకొండ శంకరయ్య, బుర్ర గంగయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ క్రికెటర్ అంబటి రాయుడు



సాక్షి,అమరావతి: టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు సీఎం జగన్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజకీయాలు తన సెకండ్ ఇన్నింగ్స్ అని మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు తెలిపారు. సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. మొదటి నుంచి సీఎం జగన్ మీద మంచి అభిప్రాయం ఉందని, ఆయన కులమతాలు, రాజకీయాలతో పనిలేకుండా పారదర్శకంగా పాలన చేస్తున్నారని ప్రశంసించారు. అందుకే ఆయనకు మద్దతుగా గతంలో ట్వీట్లు పెట్టినట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చాలా ఆరోపణలు చేశారని, అయితే ఇప్పుడు వారే అంతకంటే ఎక్కువ ఇస్తామని ఎలా చెప్తారని ప్రశ్నించారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రాయుడు అన్నారు.

‘కెప్టెన్’ విజయకాంత్ కన్నుమూత

- విషాదంలో మునిగిన ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు
- ప్రధాని మోదీతోపాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల సంతాపం
- నివాళులర్పించిన తమిళనాడు సీఎం స్టాలిన్
- నేడు చెన్నైలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

అనారోగ్యంతో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచిన డీఎండీకే అధ్యక్షుడు



చెన్నైలో విజయ్‌కాంత్ భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు బారులు తీరిన అభిమానులు

సాక్షి, చెన్నై: డీఎండీకే అధ్యక్షుడు, తమిళ సినీ నటుడు విజయకాంత్ (71) అనారోగ్యంతో కన్నుమూశారు. చెన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం 6.10 గంటలకు తుది శ్వాస విడిచారు. ఈ సమాచారంతో ఆయన అభిమానులతోపాటు ఆ పార్టీ శ్రేణులు విషాదంలో మునిగిపోయాయి. విజయకాంత్ మృతితో సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం 4.45 గంటలకు చెన్నై కోయంబేడులోని డీఎండీకే పార్టీ ప్రధాన కార్యాలయం ఆవరణలో విజయకాంత్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. తమిళనాడు రాజకీయాల్లో ప్రధాన పాత్రను పోషించిన, పోషిస్తున్న వారంతా సినీరంగానికి సుపరిచితులే అన్న విషయం తెలిసిందే. ఇందులో విజయకాంత్ కూడా ఒకరు. సినీ రంగంలో పురట్చి కలైంజ్ఞర్‌గా, కెప్టెన్‌గా పేరుగడించిన విజయకాంత్ 2005లో డీఎండీకే (దేశీయ ముర్పోగు ద్రావిడ కళగం) పార్టీ ఏర్పాటుతో రాజకీయాల్లోకి ప్రవేశించారు. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలిచే ప్రయత్నం చేసిన ఆయన తమిళ రాజకీయాల్లో ఓ ఆశాదీపంగా కనిపించారు.

మరణంతో విషాదం...

విజయకాంత్ గత నెలలో మూడు వారాలు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ సమయంలో అనేక వదంతులు వచ్చాయి. అయితే గత వారం జరిగిన డీఎండీకే పార్టీ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరుకావడంతో అభిమానులు, కేడర్‌లో ఆనందం వెల్లివిరిసింది. ఈ క్రమంలో మళ్లీ అస్వస్థతకు గురికావడంతో మంగళవారం రాత్రి చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన గురువారం కన్నుమూశారు. తొలుత ఆయన పార్థివ దేహాన్ని చెన్నై శాలిగ్రామంలోని నివాసంలో ఉంచారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్‌తోపాటు పలువురు ప్రముఖులు విజయకాంత్‌కు అంజలి ఘటించారు. అనంతరం కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయానికి భౌతికకాయాన్ని తీసుకొచ్చారు. విజయకాంత్‌కు నివాళులర్పించేందుకు ప్రముఖులతోపాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలు పార్టీల నేతలు, సినీ ప్రముఖులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

ప్రముఖుల సంతాపం

విజయకాంత్ మృతి పట్ల ప్రధాని మోదీ, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, పి.చిదంబరం, టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, దివంగత సీఎం జయలలిత నెచ్చెలి శశికళ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, సినీనటుడు కమల్‌హాసన్‌తోపాటు పలు పార్టీల నేతలు సంతాపం వ్యక్తంచేశారు. ‘విజయకాంత్ మరణం నన్ను ఎంతగానో కలచివేసింది. తమిళ సినీ ప్రపంచంలో దిగ్గజమైన ఆయన లక్షలాది మంది అభిమానుల మనసు గెలుచుకున్నారు. రాజకీయ నేతగా ప్రజలకు ఎంతగానో సేవచేసిన ఆయన తమిళనాడు రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు’ అని మోదీ ‘ఎక్స్’లో పోస్ట్‌చేశారు.

‘కరుప్పు ఎంజీఆర్’గా...

అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు దివంగత ఎంజీఆర్ ఆశయ సాధన నినాదం, ఆయనే ఆదర్శంగా రాజకీయాల్లోకి వచ్చిన విజయకాంత్ ‘కరుప్పు ఎంజీఆర్’ (నల్ల ఎంజీఆర్)గా గుర్తింపు పొందారు. 2006 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పార్టీ పోటీచేయగా, తానొక్కడే గెలిచినా 8.2 శాతం ఓట్లు సాధించి తమిళ రాజకీయాల్లో కీలకంగా మారారు. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేను గద్దె దింపాలన్న లక్ష్యంతో జయలలిత (అన్నాడీఎంకే).. విజయకాంత్ పార్టీతో పొత్తు పెట్టుకున్నారు. ఆ ఎన్నికల్లో ఆయన పార్టీ 41 స్థానాల్లో బరిలో దిగగా, 29 చోట్ల గెలిచి రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆ ఎన్నికల్లో ఆ కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో అప్పటివరకు అధికారంలో ఉన్న డీఎంకే మూడో స్థానానికి పరిమితమైంది. ఆ తదుపరి అసెంబ్లీ వేదికగా అన్నాడీఎంకే అధినేత్రి, సీఎం జయలలితతో తలెత్తిన విభేదాల కారణంగా విజయకాంత్ అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా ఉండేందుకు ఎన్‌డీఏ నేతృత్వంలోని కూటమిలో చేరారు. ఆ ఎన్నికల్లో ఆయన పార్టీ ఒక్క స్థానంలోనూ గెలవకపోగా, ఓటు బ్యాంకు ఐదు శాతానికి పడిపోయింది. తర్వాత 2016 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి పీపుల్స్ వెల్ఫేర్ ఫ్రంట్‌గా తన నేతృత్వంలోనే కూటమి ఏర్పాటు చేశారు. అందులో విజయకాంత్‌నే కూటమి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. కానీ, ఆ ఎన్నికల్లో డీఎండీకే ఒక్క సీటు కూడా గెలవకపోగా, 2.4 శాతం ఓట్లకే పరిమితమైంది. చివరకు రాష్ట్ర పార్టీ గుర్తింపు కూడా కోల్పోయింది. ఈ రెండు ఎన్నికలు నిరాశ పరిచినా, రాజకీయంగా వెనకడుగు వేయకుండా ముందుకు సాగిన విజయకాంత్‌ను తర్వాత అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో పార్టీని విజయకాంత్ సతీమణి ప్రేమలత తన భుజాన వేసుకుని నడిపిస్తున్నారు. పెద్దకుమారుడు విజయ ప్రభాకరన్ రాజకీయాల్లో, చిన్న కుమారుడు షణ్ముగ పాండియన్ సినీ రంగంలో అడుగుపెట్టారు.

విజయరాజ్ నాయుడు...

విజయకాంత్ తమిళనాడులోని మదురైలో స్థిరపడ్డ తెలుగు సంతతికి చెందిన కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు కేఎస్ అళగర్‌స్వామి, ఆండాళ్ అళగర్‌స్వామి. విజయకాంత్ అసలు పేరు విజయరాజ్ నాయుడు అన్న విషయం కొందరికే తెలుసు.

లోకేశ్‌కు నోటీసులు జారీచేయండి

- విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఆదేశం
- లోకేశ్ అరెస్ట్‌కు అనుమతించాలన్న ఏపీ సీఐడీ పిటిషన్‌పై విచారణ
- తదుపరి విచారణ జనవరి 9కి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి కేసుల్లో చంద్రబాబుకు రిమాండ్ విధింపును తప్పుబట్టడంతోపాటు కీలక సాక్షులుగా ఉన్న అధికారులను బెదిరిస్తూ వ్యాఖ్యలు చేసిన నారా లోకేశ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ వ్యవహారంలో ఆయనకు నోటీసులు జారీచేయాలని విజయవాడ ఏసీబీ న్యాయస్థానం గురువారం ఆదేశించింది. లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ పిటిషన్‌పై న్యాయస్థానం కీలక ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో 41ఏ నోటీసు కింద సీఐడీ విచారణకు హాజరైన సందర్భంగా విధించిన ఆంక్షలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం, ఈ కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న అధికారులు, న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాశానని.. వారి సంగతి తేలుస్తానని లోకేశ్ ఇటీవల పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో బెదిరించడం కలకలం రేపింది. గతంలో విధించిన ఆంక్షలను ఉల్లంఘించడంతోపాటు కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్న ఆయన్ని అరెస్ట్ చేసేందుకు అనుమతి కోరుతూ సీఐడీ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై విచారించిన విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఈ అంశంలో లోకేశ్‌కు నోటీసులు జారీచేయాలని ఆదేశించింది. ఆయన్ని అరెస్ట్ చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఆ నోటీసుల్లో పేర్కొనాలని తెలిపింది. ఈ కేసులో తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 9కు వాయిదా వేసింది.

రేపు రావాలని సీఐడీ అధికారులకు చెప్పిన లోకేశ్ వ్యక్తిగత సిబ్బంది

టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న ఉన్నతాధికారులను బెదిరించే రీతిలో చేసిన వ్యాఖ్యలపై కోర్టు నోటీసులు అందించేందుకు వెళ్లిన సిబ్బందికి లోకేశ్ అందుబాటులోకి రాలేదు. ఈ కేసులో లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఆయనకు నోటీసులు జారీచేయాలని విజయవాడ ఏసీబీ న్యాయ స్థానం ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఆయనకు నోటీసులు అందించేందుకు సీఐడీ అధికారులు కృష్ణా కరకట్ట మీద ఉన్న నివాసానికి గురువారం వెళ్లారు. ఆ సమయంలో లోకేశ్ నివాసంలో ఉన్నా బయటకు రాలేదు. అధికారులు చాలాసేపు నిరీక్షించినా ఫలితం లేకపోయింది. నోటీసులు అందించేందుకు శుక్రవారం రావాలని లోకేశ్ వ్యక్తిగత సిబ్బంది చెప్పారు. దీంతో సీఐడీ అధికారులు నోటీసులు అందించకుండానే వెనుదిరిగారు.

విశ్వసనీయత చాటుకున్నాం

అవ్వాతాతలకు పెన్షన్ల పెంపు నుంచి అక్కచెల్లెమ్మలకు హామీలన్నీ పూర్తిగా నెరవేరుస్తున్నాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: అవ్వాతాతలకు పెన్షన్ల పెంపుతోపాటు అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలను అమలు చేస్తూ ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చడం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశ్వసనీయతకు మారుపేరు అని మరోసారి రుజువు చేసుకుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇదే సందేశాన్ని అవ్వాతాతలతో పాటు ప్రతి లబ్ధిదారుడికీ, ప్రతి గడప వద్దకు తీసుకెళ్లాలని అధికార యంత్రాంగానికి సూచించారు. జనవరిలో మూడు కార్యక్రమా లతో పాటు ఫిబ్రవరిలో ఒక కార్యక్రమం కలిపి మొత్తం నాలుగు ప్రధాన కార్యక్రమాలను తలపెట్టామని, వీటి ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా బ్రహ్మాండంగా జరిగేలా కలెక్టర్లు, జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రతి కార్యక్రమానికి నిర్దేశించిన విధంగా ప్రీ లాంచ్, లాంచ్, పోస్ట్ లాంచ్ కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా కలెక్టర్లు షెడ్యూల్ చేసుకోవాలని సూచించారు. జనవరి 1 నుంచి 8 వరకు ‘వైఎస్సార్ పెన్షన్ కానుక’ రూ.3 వేలకు పెంపు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని, రెండో కార్యక్రమంగా జనవరి 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని, మూడోది జనవరి 23 నుంచి 31 వరకు ‘వైఎస్సార్ ఆసరా’ కార్యక్రమాన్ని తలపెట్టగా నాలుగో కార్యక్రమం ‘వైఎస్సార్ చేయూత’ ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు జరుగుతుందని జగన్ ప్రకటించారు. ఈ నాలుగు కార్యక్రమాలను ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఉన్నతాధి కారులకు దీనికి సంబంధించి దిశానిర్దేశం చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇవీ 4 కార్యక్రమాలు..

- జనవరి 1 – 8: వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలకు పెంపు
- జనవరి 19: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ
- జనవరి 23 – 31: వైఎస్సార్ ఆసరా
- ఫిబ్రవరి 5 – 14: వైఎస్సార్ చేయూత

కలిసొచ్చిన క్రాస్ ఓటింగ్!

- సింగరేణిని ప్రభావితం చేసిన శ్రీరాంపూర్
- ఇక్కడి మెజార్టీతోనే ఏఐటీయూసీకి గుర్తింపు హోదా



ఏఐటీయూసీ జెండా

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ఫలితాలను శ్రీరాంపూర్ ఏరియా ఓటర్లు ప్రభావితం చేశారు. ఇక్కడ వచ్చిన ఓట్ల మెజార్టీతోనే ఏఐటీయూసీ కంపెనీలో గుర్తింపు సంఘంగా అవతరించింది. మొత్తం 11 ఏరియాలకుగాను ఆరు ఏరియాలు ఐఎన్టీయూసీకి దక్కినా మిగతా ఐదు ఏరియాలను ఏఐటీయూసీ కైవసం చేసుకొంది. అన్ని ఏరియాల్లో కంటే శ్రీరాంపూర్ ఏరియా పెద్దది కావడంతో ఇక్కడే ఏఐటీయూసీకి భారీ మెజారిటీ లభించింది. శ్రీరాంపూర్‌లో కనీసం వెయ్యి ఓట్లు మెజార్టీ తగ్గినా ఏఐటీయూసీ గుర్తింపు గల్లంతయ్యేది. మిగతా ఏరియాల్లో రెండు యూనియన్ల మధ్య వందల ఓట్ల తేడానే ఉంది. ఇక్కడే పెద్ద మెజారిటీ వచ్చింది. కాగా, శ్రీరాంపూర్‌లో ఈ మెజార్టీ రావడానికి టీబీజీకేఎస్ కూడా ముఖ్యపాత్ర పోషించిందని చెప్పవచ్చు. యూనియన్ సంక్షోభం వల్ల ఇక తాము గెలువలేమని భావించిన టీబీజీకేఎస్ కింది స్థాయి శ్రేణులు అంతిమంగా ఐఎన్టీయూసీ గెలువొద్దనే ఏకైక లక్ష్యంతో ఏఐటీయూసీకి క్రాస్ ఓటింగ్ చేసినట్లు చర్చ జరుగుతోంది. టీబీజీకేఎస్‌లో పదవులు అనుభవించి యూనియన్ కష్టకాలంలో కొందరు నేతలు వదిలి ఐఎన్టీయూసీలో చేరారు. వీరిపై కూడా కోపంతో వారు వెళ్లిన సంఘం గెలువొద్దని తమ ఓటును ఏఐటీయూసీకి మళ్లించారు. చివరి రెండు రోజులు ఏఐటీయూసీ నేతలు కూడా టీబీజీకేఎస్ కేడర్, సానుభూతిపరులతో టచ్‌లో ఉంటూ తమకు వేయాల్సిందిగా అభ్యర్థించారు. అంతిమంగా ఏఐటీయూసీకి మెజారిటీ లభించి కంపెనీలో గుర్తింపు సంఘంగా అవతరించింది.

కంపెనీ వ్యాప్తంగా..

ఏఐటీయూసీకి వచ్చిన ఓట్లు: 16177
ఐఎన్టీయూసీకి వచ్చిన ఓట్లు: 14178
ఏఐటీయూసీ మెజారిటీ ఓట్లు: 1999

శ్రీరాంపూర్‌లో..

ఏఐటీయూసీకి వచ్చిన ఓట్లు: 4856
ఐఎన్టీయూసీకి వచ్చిన ఓట్లు: 2690
మెజారిటీ ఓట్లు: 2166

సింగరేణిలో పుంజుకున్న సీఐటీయూ



గోదావరిఖనిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

- ఆర్జీ–1 ఏరియాలో పెరిగిన ఓట్లు
- సంస్థవ్యాప్తంగా మూడో స్థానం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఈసారి సీఐటీయూ ఓట్ల శాతం భారీగా పెరిగింది. సంస్థవ్యాప్తంగా ఓటింగ్ పెంచుకుని మూడో స్థానంలో నిలిచింది. అన్నింటికి మించి ఆర్జీ–1 ఏరియాలో ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాలను కలిపి 3,710 ఓట్లు సాధించింది. 2017లో జరిగిన ఎన్నికల్లో 1,646 ఓట్లు వచ్చాయి. గతంలో నాలుగో స్థానంలో నిలవగా ఈసారి మూడోస్థానానికి చేరుకుంది. ఆర్జీ–1 ఏరియాలో 1,115 ఓట్లతో నాలుగంకెల డిజిట్ దాటింది. మొదటి నుంచి ఆర్జీ–1 ఏరియాలో ప్రాతినిధ్య సంఘంగా గెలుపొందాలనే పట్టుదలతో ముందుకు సాగింది. ఇదే క్రమంలో తన ప్రచారాన్ని ముమ్మరం చేసింది. యువ ఓటర్లను తమవైపు తిప్పుకోవడంలో నాయకులు సఫలీకృతులయ్యారు. కార్మికవాడల్లో పర్యటించి సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమాలు నిర్వహించడం, గనులపై నెలకొన్న సమస్యలపై పోరాటం చేయడం మూలంగా కార్మికుల దృష్టిని తమవైపు తిప్పుకున్నట్లు తెలుస్తోంది.

మహిళా కార్మికుల సమస్యలపై..

కార్మికుల సమస్యలను సీరియస్‌గా తీసుకుని పరిష్కారంపై సీఐటీయూ దృష్టి సారించింది. గనుల్లో నూతనంగా చేరిన మహిళా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇచ్చింది. వారి సమస్యలపై పోరాటంతో పాటు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారంలో ముందుకు సాగారు. అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి నేతృత్వంలో యూనియన్‌లో ఈసారి సంస్థలో ఓటింగ్ పెంచుకుని యూనియన్ బలోపేతం దిశగా ముందుకు సాగినట్లుగా అంచనా వేస్తున్నారు.

సింగిల్‌డిజిట్ దాటని నాలుగు యూనియన్లు

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో నాలుగు యూనియన్లు సింగిల్ డిజిట్ దాటలేదు. ప్రజాతెలంగాణ సింగరేణి కార్మిక సంఘం రెండు ఓట్లు, శ్రామిక శక్తి గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రెండు ఓట్లు, తెలంగాణ గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం 6ఓట్లు, సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ 8ఓట్లు, సింగరేణి గని కార్మిక సంఘం 10ఓట్లు మాత్రమే సాధించాయి.

ఏరియాల వారీగా సాధించిన ఓట్లు

ఏరియా	2023	2017
కార్పొరేట్	42	86
కొత్తగూడెం	48	63
ఇల్లెందు	07	17
మణుగూరు	66	64
ఆర్జీ–1	1,115	434
ఆర్జీ–2	666	169
ఆర్జీ–3	656	471
భూపాల్‌పల్లి	75	101
బెల్లంపల్లి	11	18
మందమర్రి	583	113
శ్రీరాంపూర్	441	110
మొత్తం	3,710	1,646

చేనులోనే తెల్లబంగారం



సాగు చేసిన నుంచి పత్తి చేతికందే దాకా రైతుకు అడుగడుగునా కష్టాలే. ప్రస్తుతం పంట చేతికందే దశలో ఉండగా సేకరించేందుకు కూలీలు దొరకక.. మార్కెట్‌లో మద్దతు ధర లేక రైతన్నలు దిగులు చెందుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం రామాయి గ్రామానికి చెందిన ఓ రైతు సాగు చేసిన పత్తి చేతికందే దశలో ఉండగా కూలీలు దొరకలేదు. దీంతో చేనులోనే పత్తి ఆరబోసినట్లు ఇలా కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఈ–కేవైసీ ఇక్కట్లు



హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే వరుస



చెట్లనిడన భోజనం చేస్తున్న మహిళ

గ్యాస్ వినియోగదారుల ఈ–కేవైసీ ఇక్కట్లు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రూ.500లకే సిలిండర్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ–కేవైసీ ఉంటేనే పథకం వర్తిస్తుందని ప్రచారం జరుగడంతో వినియోగదారులు వేకువ జాము నుంచే గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు తీరుతున్నారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలో గ్యాస్ ఏజెన్సీల ఎదుట పిల్లాపాపలతో క్యూ కట్టిన మహిళలు ఇబ్బంది పడ్డారు. పథకం అమలుకు ప్రభుత్వం ఇంకా విధివిధానాలు రూపొందించలేదు. అయినా ఈ–కేవైసీ చేసుకుంటేనే రాయితీ వర్తిస్తుందనే ప్రచారంతో వినియోగదారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఓ మహిళ అయితే అక్కడికే భోజనం తెచ్చుకుని తినడం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

ఆత్మస్థైర్యానికి జూడో క్రీడ దోహదం



పోటీలు ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి

- రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: ఆత్మస్థైర్యానికి, ఆత్మ విశ్వాసానికి జూడో క్రీడ దోహదపడుతుందని తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. జిల్లా విద్యాశాఖ, జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో, జిల్లా జూడో సంఘం సహకారంతో కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడాపాఠశాలలో గురువారం 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్– 17 బాలబాలికల జూడో పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా జూడో హబ్‌గా తయారైందన్నారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి పోతన శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జనవరి 3 నుంచి 7 వరకు పంజాబ్‌లో జరుగనున్న 67వ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.పెద్దపల్లి జిల్లా జూడో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్, జిల్లా జూడో సంఘం సంయుక్త కార్యదర్శి ఎల్వీ రమణ పాల్గొన్నారు.

రైలు కూతే సిగ్నల్..!



లక్ష్మీపురంలో గేట్ లేని రైల్వేట్రాక్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రైలు వస్తుందంటే సిగ్నల్ పడుతుంది. కానీ ఇక్కడ రైలు కూత వినిపిస్తేనే సిగ్నల్ పడినట్లు భావించాలి. ఒకవేళ రైలు కూత వినిపించకుంటే అంతే సంగతులు. సింగరేణి సీహెచ్‌పీ నుంచి ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌కు లక్ష్మీపురం మీదుగా నిత్యం పదుల సంఖ్యలో రైళ్లు నడుస్తుంటాయి. ఫర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్ నుంచి పోతనకాలనీతోపాటు సుమారు 20 గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. రోజూ పదుల సంఖ్యలో వాహనా లు ఈ మార్గం ద్వారానే వెళ్తుంటాయి. ఇక్కడ గేట్ లేకపోవడంతో రైలు కూత పెడితేనే ప్రయాణికులు ఆగాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే గేట్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శుక్రవారం ॥ 29-12-2023

2023 - ఆంధ్రప్రదేశ్ మహిళ

సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర కీలకం.
అవని అంతటినీ నడిపించే శక్తి ఆమె.
గ్రామీణ విద్యార్థులను అంతర్జాతీయ వేదిక మీద నిలిపిన టీచర్ ఒకరు.
సమాజంలో నెలకొన్న రుగ్మతలకు కూడా చికిత్స చేస్తున్న డాక్టర్ ఒకరు.
నిస్సహాయుల బతుకును ఈతతో దరిచేరుస్తున్న తల్లి ఒకరు.
సాటి మహిళకు స్వావలంబన సాధనలో సహకారం అందిస్తున్న శక్తి ఒకరు.
స్థితప్రజ్ఞత సాధనకై నాట్య యోగ ధ్యాన క్రియలతో శ్రమిస్తున్న ఔత్సాహిక ఒకరు.
చక్కటి జాతి నిర్మాణంలో తమదైన పాత్రను పోషిస్తున్న ఆణిముత్యాలు వీళ్లు.
ఇయర్ రౌండప్‌లో ఈ ఏడాది వారు సాధించిన లక్ష్యాల గురించి క్లుప్తంగా...

ఆణిముత్యాలు

శ్రుతకీర్తి



శ్రుతకీర్తి ప్రముఖ కూచిపూడి నాట్యకారిణి. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డాన్స్ హెచ్‌వోడీగా శాస్త్రీయ నాట్యంలో కొత్తతరాలకు మార్గదర్శనం చేస్తున్నారు. మూడేళ్ల వయసులో వేదిక మీద తొలి ప్రదర్శన ఇచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు దేశవిదేశాల్లో వెయ్యికి పైగా ప్రదర్శనలిచ్చారామె. గొంతు, ఉచ్చారణ బాగుందని టీచర్లు స్కూల్ రేడియోలో వ్యాఖ్యాతగా అవకాశం ఇచ్చారు. అలా మొదలైన వ్యాఖ్యాన పరంపరలో ఆరవ తరగతిలో ప్రముఖుల కార్యక్రమాలకు వేదిక మీద వ్యాఖ్యాతగా వ్యవహరించే స్థాయికి ఎదిగారు. ఐదు వందలకు పైగా సభలను నిర్వహించిన శ్రుతకీర్తి తొమ్మిదవ తరగతి నుంచి న్యూస్ ప్రెజెంటర్‌గా జెమినీ టీవీలో వార్తలు చదివారు. ఎంబీఏ, ఎల్‌ఎల్‌బీ, కౌన్సెలింగ్ సైకాలజీలో డాక్టరేట్ చేసిన కీర్తి... దశాబ్దకాలంగా మాతా ఆత్మానందమయి శిష్యరికంలో సుషుమ్న క్రియ యోగదీక్ష సాధన చేస్తూ ప్రపంచ శాంతి, మెంటల్ అండ్ ఎమోషనల్ హెల్త్ కోసం దేశవిదేశాల్లో స్కూళ్లు, కాలేజ్‌లతోపాటు కార్పొరేట్ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. మనసు చంచలమైనది. సాధన ద్వారా స్థితప్రజ్ఞత సాధించాలి. ఇప్పుడు ప్రపంచం అంతటా యువతను పీడిస్తున్న సమస్య ఏకాగ్రతలోపం. నాట్యం, యోగసాధన, ధ్యానం ద్వారా ఏకాగ్రతను సాధించవచ్చని ఆచరణాత్మకంగా తెలియచేస్తున్నానని చెబుతారు శ్రుతకీర్తి.



గోపీచంద్‌తో రజనీ లక్కా

రజనీ లక్కా

రజనీ లక్కా స్విమ్మింగ్ చాంపియన్. ఆమె తన కోసం తాను రికార్డు సాధించడమే కాదు, స్పెషల్లీ చాలెంజ్‌డ్ (దివ్యాంగులు) పిల్లలకు ఉచితంగా ఈతలో శిక్షణనిస్తున్నారు. ప్రమాదవశాత్తూ నీటిలో పడిపోయినప్పుడు మామూలు వాళ్లు ఈదుకుంటూ ఒడ్డుకు చేరతారు. కానీ దివ్యాంగులు... శారీరక వైకల్యం కారణంగా ఈదలేక నిస్సహాయంగా నీటిలో మునిగిపోవడాన్ని సహించలేకపోయారామె. వారికి ఉచితంగా ఈత నేర్పిస్తున్నారు. దశాబ్దకాలంగా సాగుతున్న ఆమె సర్వీస్‌లో అరవై మందికి పైగా పిల్లలు ఈత నేర్చుకుని, పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఆమె సాధించిన పతకాలు నూట పాతికకు చేరితే ఆమె శిష్యులు సాధించిన పతకాల సంఖ్య రెండు వందల యాభై దాటాయి. సాయి నిఖిల్ గత ఏడాది నేషనల్ రికార్డు సాధించగా గోపీచంద్ ఈ ఏడాది ఏషియన్ గేమ్స్‌లో పాల్గొన్నాడు. అనంతపురానికి చెందిన ఆమె బళ్లారిలో నివసిస్తున్నారు. ప్రతి వ్యక్తీ ఆల్ రౌండర్‌గా ఉండాలని అభిలషించే రజని సోలో ట్రావెలర్, గార్డెనర్, మిసెస్ ఇండియా కిరీటధారి కూడా. ఇంటర్నేషనల్ ఇన్‌స్పిరేషన్ అవార్డు- 2020 అందుకున్న రజని లక్కా ఈ ఏడాది కర్ణాటక ప్రభుత్వం నుంచి వ్యక్తిగత సేవావిభాగంలో పురస్కారం అందుకున్నారు.

పెన్నా కృష్ణప్రశాంతి



డాక్టర్ పెన్నా కృష్ణ ప్రశాంతి, కన్సల్టెంట్ ఫిజీషియన్. తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. జాతీయ స్థాయిలో బైరాక్ (బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెంట్ కౌన్సిల్) బోర్డు మెంబర్‌గా ఎంపికైన తొలి మహిళ. అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, డయాబెటిక్ రీసెర్చ్ సొసైటీ కౌన్సిల్ మెంబర్. ఇంతకు ముందు ఈ హోదాల్లో మగవాళ్లే బాధ్యతలు నిర్వర్తించారు. ఆ గిరిగీతను చెరిపేసిన మహిళ ఆమె. శ్రీసాయి హర్షిత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తిరుపతి, పరిసర ప్రాంతాల్లో ఆమె వైద్యసేవలందిస్తున్నారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో బయోటెక్ ఇన్‌క్యుబేషన్ సౌకర్యాల కల్పనతోపాటు విద్యార్థినులకు సలహా సూచనలిస్తున్నారు. పలు విద్యాసంస్థల్లో పాలక వర్గంలో సభ్యురాలు. మహిళా సంక్షేమం కోసం పోలీస్ శాఖతో కలిసి పని చేస్తున్నారు. ఆమె వైద్యరంగానికి, సమాజానికి అందిస్తున్న సేవలకుగాను 'తెలివిగల నాయకత్వ లక్షణాలున్న మహిళ'గా రాష్ట్రపతి ప్రశంసలు అందుకున్నారు.

నీరజ గొడవర్తి



'సంకల్ప బలమే లక్ష్యం వైపు నడిపిస్తుంది. నా జీవితంలో 'నో' అనే పదానికి స్థానమే లేదు' అంటున్న నీరజ గొడవర్తిది అంబేద్కర్ కోనసీమ జిల్లా ముంగండ. ఏకోల కెమికల్స్ లిమిటెడ్‌కి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా దాదాపు నలభై ఏళ్లుగా ఆ సంస్థను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇక ప్రవృత్తి, అభిరుచుల విషయానికి వస్తే... ఇకబెనా ఫ్లవర్ డెకరేషన్, కర్ణాటక సంగీత గాయని, పాటల రచయిత, స్వరకర్త, రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ బిజీగా ఉంటారు. పారిశ్రామిక రంగం అంటే మగవాళ్ల ప్రపంచం అనే అభిప్రాయం స్థిరంగా ఉన్న రోజుల్లో పరిశ్రమ స్థాపించి, విజయవంతమైన పారిశ్రామికవేత్తగా నిలదొక్కుకోవడానికి ఎంతగా శ్రమించాల్సి వచ్చిందో తనకు తెలుసంటారామె. అందుకే పరిశ్రమల రంగంలోకి రావాలనే ఆసక్తి ఉన్న మహిళలకు ఒక మార్గం వేయాలనే ఉద్దేశంలో కోవె(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్) నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ ద్వారా మహిళలను సంఘటితం చేస్తూ, ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు సహాయ సహకారాలందిస్తున్నారు. ఆమె విశిష్ట సేవలకు గాను ఈ ఏడాది 'డాక్టర్ సరోజినీ నాయుడు ఇంటర్నేషనల్ అవార్డు, హార్టికల్చరిస్ట్, మల్టీ టాలెంటెడ్ ఉమన్' పురస్కారాలను అందుకున్నారు.

లక్ష్మీదేవి



కృష్ణా జిల్లా, పెడన గ్రామం, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సైన్స్ టీచర్ లక్ష్మీదేవి. విద్యార్థులకు పాఠాలు నేర్పించడంతోపాటు ప్రయోగాల్లోనూ మేటిగా తీర్చిదిద్దుతారామె. ఆమె స్టూడెంట్స్ మణికంఠ, వినయ్ కుమార్ ఈ ఏడాది యూఎస్‌లోని డాలస్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫేర్‌లో పాల్గొని ఎకో ఫ్రెండ్లీ ఫ్లవర్ పాట్‌ను ప్రదర్శించి నాలుగో స్థానంలో నిలిచారు. ఇప్పటివరకు వందకు పైగా ప్రయోగాలు చేసిన లక్ష్మీదేవి తన పరిశోధన ఫార్ములాను స్టార్టప్ కంపెనీలకు ఉచితంగా ఇస్తూ... 'వినియోగదారులకు తక్కువ ధరకు ఇవ్వండి. అదే మీరు నాకిచ్చే గొప్ప పారితోషికం' అంటారు. ప్రస్తుతం ఫ్లోరైడ్ బాధిత ఆదివాసీ గ్రామాల కోసం మట్టిలో తులసి ఆకుల పొడి కలిపి కుండలను చేసి ప్రయోగాన్ని విజయవంతం చేశారు. నూజివీడు సమీపంలోని ఆదివాసీ గ్రామాలకు వెళ్లి పంచడానికి కుండలను సిద్ధం చేస్తున్నారు. ఒక సందేహం రావడం, ఆ సందేహానికి సమాధానం కోసం అన్వేషణ. పరిశోధన, ప్రయోగాలతో సమాధానాన్ని రాబట్టడం ఆమె వంతు. ఆ సమాధానంతో సమాజంలోని సమస్యకు పరిష్కారం లభించడం... ఆమె ప్రయోగాల గొప్పతనం. సమాజానికి ఆమె అందిస్తున్న శాస్త్రీయ సేవకు గాను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలందుకున్న లక్ష్మీదేవి ఈ ఒక్క ఏడాదిలోనే పదికి పైగా సత్కారాలందుకున్నారు.

కాలం తిరిగి రాదు. కాలం విలువైనది. తెలుసు మనకు.
కాని డిజిటల్ చొరబాటు పెరిగాక సమయమంతా ఫోన్‌కే పోయిందా?
ఒక ఇంట్లో భార్య 3 గంటలు, భర్త 3 గంటలు,
పిల్లలు చెరి 3 గంటలు ఫోన్ వాడితే రోజులో 12 విలువైన గంటలు నాశనమైపోతాయి.
2023లో మీ కుటుంబం మొత్తం కనీసం 180 రోజులు ఫోన్‌లో వృథా చేసింది.
2024లో మీ సమయం మీరు పొందగలరా?

మీ సమయమంతా ఫోన్‌కే పోయిందా?

2023కు వీడ్కోలు



ఏదో సినిమాలో 'నేనొక వంద రూపాయల అవినీతి చేస్తే తప్పేంటి?' అని విలన్ అంటే, 'అలా వంద రూపాయల అవినీతి కోటి మంది చేస్తే చిన్న తప్పు అవుతుందా?' అని హీరో ప్రశ్నిస్తాడు.

సేమ్.

'ఇంట్లో కాసేపు ఫోన్ చూస్తే తప్పేంటి?' అని తల్లో, తండ్రో, కొడుకో, కూతురో అనుకోవచ్చు. 'మీ అందరూ కలిసి చాలా టైమ్ వేస్ట్ చేయడం తప్పే' అని సమాధానం చెప్పాల్సి వస్తుంది.

టైమ్‌ను సద్వినియోగం చేస్తే చాలా పనులు అవుతాయి. దుర్వినియోగం చేస్తే చాలా నష్టాలు తప్పక జరుగుతాయి.

• • •

ఇటీవల చాలా స్కూళ్లల్లో పిల్లలు సరిగ్గా ఎగ్జామ్స్ రాయడం లేదని టీచర్లు మొత్తుకుంటున్నారు. దానికి కారణం పిల్లలు ఎగ్జామ్స్‌కు చదవడానికి కూచుని ఫోన్లు చూస్తున్నారని అర్థమవుతోంది. కరోనా వల్ల జరిగిన చాలా నష్టాల్లో పిల్లలకు ఫోన్లు అలవాటు కావడం ఒకటి. వాళ్ల ఫోన్లకు అడిక్ట్ అవడం వారి భవిష్యత్తునే ప్రభావితం చేస్తోంది. పిల్లల్ని ఫోన్లు చూడొద్దని చెప్పే నైతిక హక్కు తల్లిదండ్రులకు ఎప్పుడు వస్తుంది? వాళ్ల ఫోన్లు చూడనప్పుడు. కాని తల్లిదండ్రులు పిల్లల కంటే ఎక్కువగా ఫోన్లకు అలవాటు పడి ఉన్నారు. మానసిక, శారీరక, కౌటుంబిక, ఆర్థిక, అనుబంధ జీవనాలన్నింటికీ ఈ ఫోన్ వల్ల వృథా అవుతున్న సమయం చావు దెబ్బ తీస్తోంది.

• • •

ఫోన్ ఎందుకు? కాల్స్ మాట్లాడేందుకు. ఏ మనిషికైనా రోజులో ఐదారు కాల్స్ మాట్లాడే అవసరం ఉంటుంది. ఉద్యోగాల్లో వృత్తిగతమైన కాల్స్ ఆఫీస్ టైమ్ కిందకే వస్తాయి. కాని ప్రయివేట్ టైమ్‌లో ఫోన్లు- అవసరమైనవి మాత్రమే తీసుకుంటే ఐదారు మించవు. మరి ఫోన్లకు ఇవాళ ఎలా వాడుతున్నారు? ఫోనులోని ఏవేవి మీ సమయాన్ని తీసుకుంటున్నాయి?

1. వాట్సాప్,
2.యూట్యూబ్, 3. రీల్స్
4. ఫేస్‌బుక్, 5. ఓటీటీ యాప్స్
6. 'ఎక్స్'(ట్విటర్) 7.ఇన్‌స్టా

ఇప్పుడు 2023లో వీటి ద్వారా నిజంగా మీరు పొందిన జ్ఞానం ఎంత? ప్రయోజనం ఎంత? లాభం ఎంత? ఆలోచించండి. వీటిని చూడటం వల్ల ఆర్థికంగా ఏమైనా ఉపయోగం జరిగిందా? ఆరోగ్య పరంగా ఏదైనా ఉపయోగం జరిగిందా? ఉద్యోగాలు వచ్చాయా? ప్రమోషన్లు సమకూరాయా? పిల్లలకు ర్యాంకులు వచ్చాయా?

కెరీర్, విద్య కోసం సోషల్ మీడియాను ఉపయోగిస్తే సరే. లేకుండా ఊరికే కాలక్షేపం కోసం ఫోన్‌ను స్క్రోల్ చేస్తూ రోజులు దొర్లించేస్తే ఏం సాధించినట్టు?

• • •

'తేనెలో భార్యాభర్తల ఫొటో కూరితే వారు అన్యోన్యంగా ఉంటారు', 'షూటింగ్ మధ్యలో హీరో హీరోయిన్‌తో ఏమన్నాడో తెలిస్తే షాక్ అవుతారు', 'మా హోమ్‌టూర్‌కు రెడీయా?'... ఇలాంటి వీడియోలు, పిచ్చి నృత్యాల రీల్స్... వీటితో సమయం వృథా అయిపోతోంది ఫోన్ వల్ల. క్రైమ్, సస్పెన్స్, హారర్ వెబ్ సిరీస్‌లు బింజ్‌వాచ్ చేస్తే సమయం మొత్తం వృథా. గేమ్స్‌లో కూరుకుపోతే, ఫోన్‌లో బెట్టింగ్‌లకు అలవాటు పడితే, ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు అడిక్ట్ అయితే, పోర్న్ వీడియోలు వదల్లేకపోతే... సమయం వృథా, వృథా, వృథా.

పుస్తకం మనం ఎంచుకుని చదివేది. ఫోన్ అదేం చూపాలనుకుంటే అది చూపేది.

• • •

కుటుంబం మొత్తం కలిసి ఏదైనా రెస్టరెంట్‌కు వెళితే కుటుంబ సభ్యులు నలుగురూ ఫోన్లు చూసుకుంటూ కూచుని ఉంటే కనుక అది ఏ మాత్రం కమ్యూనికేషన్ ఉన్న కుటుంబం కాదు. ప్రతి ఒక్కరూ సంబంధం లేని కంటెంట్‌తో కమ్యూనికేషన్‌లో ఉన్నట్టు. కుటుంబానికి ఇవ్వాల్సిన సమయం, వ్యాయామానికి ఇవ్వాల్సిన సమయం, స్నేహితులను పరామర్శించుకోవడానికి ఇవ్వాల్సిన సమయం, డాక్యుమెంట్స్ చక్కదిద్దుకోవాల్సిన సమయం, బ్యాంకు లావాదేవీలు.. పాలసీలు సరి చేసుకోవాల్సిన సమయం, సంపాదన మెరుగు పర్చుకోవాల్సిన సమయం, డబ్బు ఆదా కోసం వెచ్చించాల్సిన సమయం, పిల్లల్ని చదివించాల్సిన సమయం, భార్యాభర్తలు కలిసి మాట్లాడుకోవాల్సిన సమయం మొత్తం ఫోన్ల వల్ల, సోషల్ మీడియా వల్ల 2023లో ఎంత వృథా అయ్యిందో ఆలోచిస్తే 2024ను సరిగ్గా ఆహ్వానించగలుగుతారు.

2024వ సంవత్సరం విలువైన కాలాన్ని వెంటబెట్టుకుని వస్తోంది. సద్వినియోగం చేసుకోండి.

వంటిల్లు

టేస్టీ విషెస్

ఇంటిల్లిపాదికి.. బంధువులు, స్నేహితులకు కొత్త సంవత్సరంలో సరికొత్త రుచులను పరిచయం చేస్తూ విష్ చేద్దాం అంటోంది ఈ వారం వంటిల్లు...



స్వీట్ పొటాటో పిజా బాల్స్

కావలసినవి: చిలగడ దుంపలు – అరకేజీ(తొక్కతీసి ముక్కలు తరగాలి); **మటన్ ఖీమా** – అరకప్పు; **చీజ్ తురుము** – ముప్పావు కప్పు; **పీజా సాస్** – రెండు టేబుల్ స్పూన్లు; **గోధుమ పిండి** – ముప్పావు కప్పు; **గుడ్లు** – రెండు(సొనను బాగా కలిపి పెట్టుకోవాలి); **బ్రెడ్ క్రంబ్స్** – కప్పు; **నూనె** – డీప్ ఫ్రైకి సరిపడా; **ఉప్పు** – రుచికి తగినంత.

తయారీ: చిలగడ దుంప ముక్కల్ని మెత్తగా ఉడకబెట్టి, చిదుముకోవాలి. ఇందులో మటన్ ఖీమా, చీజ్ తురుము, పీజా సాస్, రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి, బాల్స్‌లా చుట్టి పెట్టుకోవాలి ● గోధుమ పిండి, గుడ్లసొన, బ్రెడ్ క్రంబ్స్‌ను వరుసగా పెట్టుకోవాలి. దుంపల బాల్స్‌ను ముందుగా గోధుమ పిండి, తరువాత గుడ్ల సొన, చివరిగా బ్రెడ్ క్రంబ్స్‌లో ముంచి డీప్ ఫ్రైచేసుకోవాలి ● బాల్స్ క్రిస్పీగా గోల్డెన్ కలర్‌లోకి మారాక తీసేసి నచ్చిన సాస్‌తో సర్వ్ చేసుకోవాలి.

క్రాబ్ కేక్ పాపర్స్



కావలసినవి: పీతల గుజ్జు – అరకేజీ; **బటర్** – రెండు టేబుల్ స్పూన్లు; **స్ప్రింగ్ ఆనియన్ తరుగు** – పావు కప్పు; ఎర్రక్యాప్సికం **తరుగు** – రెండు టేబుల్ స్పూన్లు; **సెలెరీ తరుగు** – రెండు టేబుల్ స్పూన్లు; **కోషర్ సాల్ట్** – రుచికి సరిపడా; **కొత్తిమీర తరుగు** – టేబుల్ స్పూను; **గుడ్డు** – ఒకటి; **సోయా సాస్** – పావు టీస్పూను; **మయనైజ్** – పావు కప్పు; **ఆవ పొడి** – పావు టీస్పూను; **మిరియాల పొడి** – పావు టీస్పూను; **బ్రెడ్ క్రంబ్స్** – ఒకటింబావు కప్పులు; **నూనె** – ఒకటిన్నర కప్పులు.
స్పైసీడిప్: మయనైజ్ – అరకప్పు; **నిమ్మరసం** – టేబుల్ స్పూను; **వెల్లుల్లి రెబ్బ** – పెద్దది ఒకటి (సన్నగా తరగాలి); **చిల్లీ సాస్** – టీస్పూను.

తయారీ: బాణలిలో బటర్ వేసి, కరిగిన తరువాత.. స్ప్రింగ్ ఆనియన్ , క్యాప్సికం, సెలెరీ తరుగు వేసి వేయించాలి ● ముక్కలన్నీ మెత్తబడిన తరువాత పీతల గుజ్జు, కొత్తిమీర తరుగు వేసి వేయించాలి ● ఇది వేగుతుండగానే.. ఒక గిన్నెలో గుడ్డు సొన, సోయా సాస్, మయనైజ్, ఆవపొడి, మిరియాల పొడి వేసి కలుపుకోవాలి ● కలిపిన వెంటనే వేగుతున్న పీతల గుజుజపైన ఈ మిశ్రమాన్ని వేసి ఐదు నిమిషాలు మగ్గనిచ్చి దించేయాలి ● చల్లారాక మీడియం సైజు బాల్స్‌లా చుట్టుకోవాలి. బాల్స్ అన్నీ తయారయ్యాక.. బ్రెడ్ క్రంబ్స్‌లో ముంచి కోటింగ్‌లా పట్టించి రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● అరగంట తరువాత నూనెలో గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు ఫ్రై చేస్తే క్రాబ్ కేక్ పాపర్స్ రెడీ ● స్పైసీడిప్ కోసం తీసుకున్న పదార్థాలను గిన్నెలో వేసి కలిపి.. వేడివేడి క్రాబ్ కేక్ పాపర్స్‌తో సర్వ్ చేసుకోవాలి.

పోమోగ్రానేట్ షాంపైన్ సార్బెట్



కావలసినవి: బ్రూట్ షాంపైన్ – ఒకటిన్నర కప్పులు; **పంచదార** – కప్పు; **లైట్ కార్న్ సిరప్** – టేబుల్ స్పూను; **దానిమ్మ రసం** – ఒకటీ ముప్పావు కప్పులు; **విప్డ్ క్రీమ్** – రెండు టేబుల్ స్పూన్లు; **దానిమ్మ గింజలు** – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: సాస్‌పాన్‌లో షాంపైన్, కార్న్ సిరప్, పంచదార వేసి మీడియం మంట మీద పంచదార కరిగేంత వరకు మరిగించి, దించిన తర్వాత దానిమ్మ రసం కలపాలి. ఈ మిశ్రమాన్ని రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండుగంటల తరువాత మిశ్రమాన్ని ఐస్‌క్రీమ్ మేకర్‌తో బీట్ చేయాలి ● క్రీమ్‌లా మారిన మిశ్రమాన్ని షాంపైన్ గ్లాస్‌లో వేయాలి. పైన విప్డ్ క్రీమ్, దానిమ్మ గింజలతో గార్నిష్ చేస్తే పోమోగ్రానేట్ షాంపైన్ సార్బెట్ రెడీ.

అప్‌డేట్ అవాల్సిందే!

ఫ్యాషన్





కొత్తగా మెరిసిపోవాలంటే కొత్త డ్రెస్సులు వేసుకోవాల్సిందేనా!
ట్రెండ్‌కు తగినట్టు ఉండాలంటే
మార్కెట్లో రెడీమేడ్‌గా ఉండే వాటిని కొనుగోలు చేయాల్సిందేనా!
ఈ మాటలకు కాలం చెల్లిపోయేలా
వినూత్నంగా ఆలోచన చేస్తున్నారు నేటి మహిళలు
పర్యావరణ అనుకూలంగా ఫ్యాషన్‌లోనూ మార్పులు చేసుకుంటున్నారు.
అప్‌సైక్లింగ్ పేరుతో పాత డ్రెస్సులను, చీరలను కొత్తగా అప్‌డేట్ చేస్తున్నారు.
ఈ యేడాది వచ్చిన ఈ మార్పు రాబోయే రోజులను మరింత
పర్యావరణ హితంగా మార్చేయనున్నారు అనేది ఫ్యాషన్ డిజైనర్ల మాట.



పాత వాటిని కొత్తగా మెరిపించడంలో ఖర్చు కూడా తగ్గుతుంది. పర్యావరణంపై కార్బన్ ఉద్గారాల ప్రభావమూ తగ్గుతుంది. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ మన దగ్గర ఉన్న డ్రెస్సులనే కొత్తగా మార్చేయవచ్చు. చిన్నపాటి సృజనతో డ్రెస్సింగ్‌లో మెరుగైన మార్పులు తీసుకురావచ్చు.



డెనిమ్.. ప్యాచ్

పాతవి అనే పేరే గానీ చాలామంది ఇళ్లలో పక్కన పెట్టేసిన డెనిమ్ జాకెట్స్, ప్యాంట్స్, కుర్తాలు.. ఉంటాయి. వాటిని తిరిగి ఉపయోగించుకోవాలంటే రకరకాల మోడల్స్‌ని తయారు చేసుకోవచ్చు. ప్యాచ్‌వర్క్‌తో రీ డిజైనింగ్ చేసి ఓవర్‌కోట్స్ లేదా హ్యాండ్ బ్యాగ్స్ డిజైన్ చేసుకోవచ్చు.

శారీ ఖఫ్తాన్

కుర్తాల మీదకు సిల్క్ ష్రగ్స్ లేదా లాంగ్ ఓవర్ కోట్స్ వాడటం ఇండోవెస్టర్న్ స్టైల్. పాత సిల్క్ లేదా కాటన్ చీరలను కూడా లాంగ్ కోట్స్‌కి ఉపయోగించ వచ్చు. అలాగే, ఖఫ్తాన్ డిజైన్స్‌కి కూడా శారీస్‌ను వాడచ్చు.

పర్యావరణ అనుకూలం

ఆర్గానిక్ కాటన్స్, వీగన్ క్లాత్స్.. స్లో ఫ్యాషన్ కిందకు వస్తాయి. వీటితో చేసే డిజైన్స్‌లో ప్రత్యేకంగా మెరిసిపోవడమే కాదు పర్యావరణ ప్రేమికులుగా అందరి దృష్టిని ఆకర్షిస్తారు.

• • •



మన దగ్గర ఉన్న పాత బట్టలను ఎలా తీసేయాలా అనుకునేవారు కొందరు, అవసరమైన వారికి తక్కువ ధరకు అమ్ముదాం అనుకునేవారు మరికొందరు ఉంటారు. అలాంటివాళ్లకోసం కొన్ని వెబ్‌స్టోర్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ స్టోర్స్ అమ్మకందారుల దగ్గర నుంచి దుస్తులు సేకరించి కావల్సిన వారికి అందజేసే మాధ్యమంగా పనిచేస్తున్నాయి.

● ముగ్గు-ముచ్చట



ఎన్. శాంతకుమారి
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్



17 చుక్కలు, 3 వరుసలు
అటు ఇటు వదిలి 3 వరకు

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

● మన కథలు 'అనగనగా...' లేదా 'ఒకానొక కాలంలో...' అంటూ మొదలవుతాయి. కొరియా జానపదకథలు మాత్రం 'పులులు పొగ తాగే కాలంలో' అంటూ మొదలవుతాయి ● డెన్మార్క్‌లోని కొన్ని ప్రాంతాలలో కొత్త సంవత్సరం రోజు ప్లేట్లు పగలగొడతారు. దీని వల్ల మంచి జరుగుతుందని నమ్మకం

● అవును... ఇది నిజమే!



● జర్మన్ జానపద కథల్లో నోకెన్ లేదా నిక్స్ అనే అంతుచిక్కని జీవి ఉంటుంది. నదులు, సరస్సులు, ప్రవాహాలలో కనిపించే ఈ జీవికి అందమైన గుర్రం, ఆకర్షణీయమైన మనిషి, రాక్షస నీటిపాము... ఇలా వివిధ రూపాల్లోకి రూపాంతరం చెందే సామర్థ్యం ఉంటుంది. వ్యక్తులను మోసం చేయడానికి ఈ సామర్థ్యాన్ని ఉపయోగించుకుంటుంది.

యువర్స్



న్యూ ఇయర్ గ్రీటింగ్స్

● మే ది న్యూ ఇయర్ బ్రింగ్ యూ మోర్ హ్యాపీనెస్, సక్సెస్, లవ్ అండ్ బ్లెస్సింగ్స్ ● 2024 ఈజ్ యువర్ ఇయర్, ఐ కెన్ ఫీల్ ఇట్. చీర్స్ టు ఏ న్యూ ఇయర్ అండ్ న్యూ ఆపర్చునిటీస్ ● న్యూ ఇయర్ బ్రింగ్స్ అజ్ లాట్స్ ఆఫ్ న్యూ అండ్ ఎగ్జయిటింగ్ ఆపర్చునిటీస్ ఇన్ అవర్ లివ్స్. దిస్ న్యూ ఇయర్ విల్ బీ అవర్ ఇయర్. హ్యాపీ న్యూ ఇయర్ ● ఏ న్యూ ఇయర్ ఈజ్ లైక్ ఏ బ్లాంక్ బుక్, అండ్ ది పెన్ ఈజ్ ఇన్ యువర్ హ్యాండ్స్. ఇట్ ఈజ్ యువర్ చాన్స్ టు రైట్ ఏ బ్యూటీఫుల్ స్టోరీ ఫర్ యువర్ సెల్ఫ్. హ్యాపీ న్యూ ఇయర్.

ఏ కిక్ ఇన్ ది టీత్

షాకింగ్ లేదా డిజపాయింటింగ్‌లాంటి పరిస్థితుల్లో వాడే మాట... ఏ కిక్ ఇన్ ది టీత్.



ఉదా: లాసింగ్ దట్ గేమ్ వాజ్ ఏ రియల్ కిక్ ఇన్ ది టీత్

గెట్ టు ది బాటమ్ ఆఫ్

ఒక సంఘటన, దుర్ఘటన, పరిస్థితి వెనుక అసలు కారణం కనుక్కునే సందర్భంలో వాడే మాట...గెట్ టు ది బాటమ్ ఆఫ్. ఉదా: ది పోలీస్ డోన్ట్ నో హూ డిడ్ ది రాబరీ యెట్, బట్ దె ప్రామిస్‌డ్ టు గెట్ టు ది బాటమ్ ఆఫ్ ఇట్



ఫుల్ జోష్‌తో ఫ్యూచర్ ప్లాన్

ఆరోజుల్లో రావుగోపాల్‌రావు ఏమన్నారండీ? 'మడిసన్నాక కాస్త కళాపోసన ఉండాలి' అని. 'కళా పోషణ' మాట ఎలా ఉన్నా కలర్‌ఫుల్ ఫ్యూచర్ ప్లాన్ కంపల్సరీగా ఉండాలి.

ప్రతి విజేత విజయం వెనుక బలమైన ఫ్యూచర్ ప్లాన్ ఉంటుంది. ఇంకో రెండు రోజుల్లో కొత్త సంవత్సరం మన జీవితాల్లోకి వస్తుంది. 365 పేజీల ఖాళీ పుస్తకం మన చేతికి అందుతుంది. మొదటి పేజీలో 'ఫ్యూచర్ ప్లాన్' రాసుకున్న వారికి చివరి పేజీ కల్లా విజయం చేతికి అందుతుంది. ఈసారి ప్రయత్నించి చూడండి....

మోస్ట్ చాలెంజింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌గా చెప్పుకునే 'నీట్'లో మెరిసిన విజేతలు చారుల్ హోనరియ, ఉమర్ అహ్మద్ గనై. పెద్ద విజయాలు సాధించడానికి పేదరికం ఎంతమాత్రం అడ్డుగోడ కాదు అని నిరూపించారు వీరు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కర్తార్‌పూర్ గ్రామానికి చెందిన చారుల్ 'నీట్' ప్రవేశ పరీక్షలో 720 మార్కులకు 680 మార్కులు తెచ్చుకుంది. ఆమె తండ్రి పేద రైతు. ఆర్థికంగా ఎన్ని కష్టాలు వచ్చినా సరే కుమార్తెను చదువుకు దూరం చేయలేదు.

జమ్మూకశ్మీర్‌కు చెందిన ఉమర్ అహ్మద్ గనై 'నీట్'లో 720 మార్కులకు 601 మార్కులు తెచ్చుకున్నాడు. పేద కుటుంబంలో పుట్టిన ఉమర్ అహ్మద్ కూలీ పనులు చేస్తూనే చదువుకున్నాడు. 'నీట్'లో ఆల్-ఇండియా ర్యాంక్(ఏఐఆర్) తెచ్చుకున్న ఈ ఇద్దరు విజేతలు అదృష్ట వశాత్తు అపూర్వ విజయం సాధించిన వారు కాదు. ఈ ఇద్దరి విజయం వెనుక బలమైన ఫ్యూచర్ ప్లాన్ ఉంది.

భవిష్యత్ ప్రణాళిక రూపొందించుకున్నప్పుడు మన బలాబలాల గురించి విశ్లేషించుకునే అవకాశం దొరుకుతుంది. డాక్టర్ కావాలనేది చారుల్ లక్ష్యం. ఇంగ్లీష్‌లో వీక్‌గా ఉన్న చారుల్ తన ఫ్యూచర్ ప్లాన్‌లో 'ఇంగ్లీష్‌లో నైపుణ్యం సాధించాలి' అని రాసుకుంది. అక్షరాలా సాధించింది.

'కొన్నిసార్లు చాలా కష్టపడినప్పటికీ ఫలితం చేతికి అందదు. దీనికి కారణం సరియైన ప్రణాళిక లేకపోవడమే' అంటున్న ఉమర్ అహ్మద్ ఒక ప్లానింగ్ ప్రకారం ముందుకు వెళ్లాడు. 'నీట్' గత విజేతలు చెప్పిన టిప్స్, సలహాలు నోటు చేసుకునేవాడు. పొద్దున కూలి పనులతో అలిసిపోయినా, ఆ అలసటను పక్కన పెట్టి 'నీట్' కోసం ప్రిపేరయ్యేవాడు.

ఈ ఇద్దరు మాత్రమే కాదు 'భవిష్యత్ ప్రణాళిక' ఆధారంగా వివిధ రంగాలలో విజయం సాధించిన యువతీ,యువకులు ఎంతోమంది కనిపిస్తారు.

'భవిష్యత్ దర్శనం అనూహ్యం, అసాధ్యమైనది కాదు. నేటి ప్రణాళికతో అద్భుత భవిష్యత్ సృష్టించుకోవచ్చు'

'నేటి ప్రణాళిక...రేపటి ఫలితం'

'నేటి కార్యాచరణపైనే మన భవిష్యత్ ఆధారపడి ఉంది'

'మనలో డ్రీమర్, ప్లానర్ అనే ఇద్దరు వ్యక్తులు ఉంటారు. వారు కలిసినప్పుడే విజయం సాధ్యం అవుతుంది'

'ప్లాన్ ఫర్ ది ఫ్యూచర్. లివ్ ఫర్ టుడే'....ఇలాంటి స్ఫూర్తిదాయక మాటలు ఎన్నో ఉన్నాయి.



'కొత్త సంవత్సరం అంటే పార్టీ చేసుకోవడం మాత్రమే కాదు. కొత్త జీవితాన్ని మొదలుపెట్టడం' అనే ఎరుకతో వ్యవహరించాలి. 'కొత్త సంవత్సరం తీసుకునే నిర్ణయాలు అట్టే కాలం ఉండవు' అనే మాట ఎలా ఉన్నా ఎంతోమంది తమను తాము మెరుగుపరుచుకోవడానికి, వ్యసనాలకు దూరం కావడానికి అవి ఉపయోగపడ్డాయి. చెన్నైకి చెందిన 22 సంవత్సరాల అరుణ్‌ను కొన్ని సంవత్సరాలుగా 'స్మోకింగ్' అనే వ్యసనం దెయ్యంలా పట్టి పీడించింది. గత సంవత్సరం తొలిరోజు 'ఈ రోజు నుంచి సిగరెట్ ముట్టను' అన్నప్పుడు ఫ్రెండ్స్ బిగ్గరగా నవ్వారు. అయితే అరుణ్ ఇప్పటి వరకు ఒక్క సిగరెట్ కూడా ముట్టలేదు.

'చాలా పెద్ద విజయం సాధించినట్లుగా ఉంది. సిగరెట్ తాగను అని ప్రతిజ్ఞ అయితే చేశానుగానీ నా మీద నాకే డౌట్ వచ్చేది. అయితే బయటికి మాత్రం గంభీరంగా ఉండేవాడిని. ఒక వ్యసనానికి వారం రోజులు దూరంగా జరిగితే చాలు మన మీద మనకు నమ్మకం వస్తుంది. ఒక నెల దూరంగా జరిగితే ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుంది. ఇక కొన్ని నెలలు దూరంగా ఉంటే ఎంత పెద్ద వ్యసనమైనా మన పరిసరాల్లో లేకుండా పారిపోతుంది' అంటున్నాడు అరుణ్.

గతంలో యువతరం కొత్త సంవత్సరం ఎజెండాలో వ్యసనానికి దూరంగా ఉండాలనేది ప్రధానంగా కనిపించేది. ఇప్పుడు మాత్రం అనేకానేక అంశాలు ఆ ఎజెండాలో వచ్చి చేరాయి. అందులో కెరీర్ ప్లానింగ్ ప్రధానమైనది. అదిగో కొత్త సంవత్సరం వచ్చేస్తుంది.... ఫ్యూచర్ ప్లాన్‌తో రెడీగా ఉన్నట్లే కదా!

● యంగ్ టాలెంట్

ఎకో వారియర్

పర్యావరణ ప్రేమికురాలైన ఈష్న అగర్వాల్ డాక్యుమెంటరీ 'శాలరీ' దుబాయ్‌లో జరిగిన కాన్ఫరెన్స్ ఆఫ్ ది పార్టీస్(కాప్ 28)లో ప్రదర్శించబడింది. పర్యావరణంపై ఉప్పు పరిశ్రమ చూపుతున్న ప్రభావం, ఉప్పును పండించే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రంగా తీసుకొని ఈష్న అగర్వాల్ రూపొందించిన ఈ డాక్యుమెంటరీకి ప్రపంచ ప్రతినిధుల నుంచి ప్రశంసలు లభించాయి.

'కాప్ 28లో నా డాక్యుమెంటరీని ప్రదర్శించడం నాకు మాత్రమే కాదు పర్యావరణ సంరక్షణకు సంబంధించిన అంశాలపై పనిచేస్తున్న ఎంతో మంది యువతీ,యువకులకు ఉత్సాహాన్ని ఇచ్చింది. చర్చను రేకెత్తించే, మార్పును ప్రేరేపించే, అసాధ్యాలను సుసాధ్యం చేసే శక్తి యువతకు ఉంది. వాతావరణ మార్పును కేవలం ఒక సమస్యగా కాకుండా అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణలకు అవకాశంగా భావిస్తాను. విభేదాలకు అతీతంగా అందరికీ ఒకే భూమి పేరిట ఐక్యత రాగం ఆలపించడానికి ఇది మంచి తరుణం' అంటుంది అగర్వాల్.

పర్యావరణ కార్యకర్తగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అగర్వాల్‌కు హిందుస్థానీ సంగీతం, వెస్ట్రన్ మ్యూజిక్‌లో ప్రవేశం ఉంది. మార్షల్ ఆర్ట్స్‌లో కూడా ప్రతిభ చూపుతుంది. తైక్వాండోలో రెడ్‌బెల్ట్ సాధించింది. మోటివేషనల్ స్పీకర్‌గా కూడా రాణిస్తోంది. వ్యక్తిత్వ వికాసం నుంచి పర్యావరణ సంక్షోభం వరకు ఎన్నో అంశాలపై ప్రసంగాలు చేసింది.



ఈష్న అగర్వాల్

గూగుల్ ఫొటోస్‌లో కొలాజ్ క్రియేట్ చేయడానికి...



1. గూగుల్ ఫొటోస్ యాప్‌ను ఓపెన్ చేయాలి
2. కొలాజ్ చేయాలనుకుంటున్న ఆరు ఫొటోలను సెలెక్ట్ చేసుకోవాలి
3. ఫొటోలను సెలెక్ట్ చేసిన తరువాత స్క్రీన్ బాటమ్‌లో కనిపించే 'యాడ్ టు' బటన్ నొక్కాలి
4. పాప్-అప్ మెనూ నుంచి 'కొలాజ్'ను సెలెక్ట్ చేసుకోవాలి
5. ప్రీ-డిజైన్‌డ్ లేఔట్స్‌తో ఆటోమేటిక్‌గా కొలాజ్ క్రియేట్ అవుతుంది.
6. లేఔట్ నచ్చకపోతే ఇతర ఆప్షన్‌ల కోసం 'లేఔట్స్' బటన్ నొక్కాలి.

గ్రోక్ ఏఐ వచ్చేసింది

Grok

ఎలాన్ మస్క్ నేతృత్వంలోని చాట్‌బాట్ గ్రోక్ ఏఐ ఇప్పుడు మన దేశంలో కూడా అందుబాటులోకి వచ్చింది. ఇతర దేశాల్లో లాగే మన దేశంలో కూడా 'ఎక్స్' ప్రీమియం ప్లస్ చందాదారులకు మాత్రమే గ్రోక్ యాక్సెస్ అవుతుంది. యూజర్‌లు వార్షిక సబ్‌స్క్రిప్షన్ కోసం ₹13,600 చెల్లించాల్సి ఉంటుంది. చాట్‌జీపీటీతో పోల్చితే గ్రోక్ ఏఐ చాట్‌బాట్ స్పోర్ట్స్, జియోపాలిటిక్స్...మొదలైన వాటికి సంబంధించి లేటెస్ట్ అప్‌డేట్స్‌తో ఉందంటున్నారు విశ్లేషకులు.

● టెక్.. టాక్



లావా స్టార్మ్ 5జీ

సైజ్: 6.78 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్ బ్యాటరీ: 5,000 ఎంఏహెచ్ ● 16 ఎంపీ ఫ్రంట్-ఫేసింగ్ కెమెరా ర్యామ్: 8జీబి స్టోరేజ్: 128జీబి కలర్స్: థండర్ బ్లాక్, గేల్ గ్రీన్

వుడెన్ ల్యాప్‌టాప్ స్టాండ్



బ్రాండ్: విర్త్ బరువు: 400 గ్రా.
సైజ్(ఓపెన్): 30×29×27 సీఎం
ఫామ్ ఫ్యాక్టర్: ట్రిపాడ్
● మల్టీ పర్పస్: రీడింగ్, రైటింగ్, డ్రాయింగ్ ప్లేయింగ్ బోర్డ్ గేమ్స్
కంపాటబుల్ డివైజెస్: ల్యాప్‌టాప్

సినిమా

● నివాళి



తమిళ ప్రేక్షకులకు విజయ్‌కాంత్ ఓ 'పురట్చి కలైజ్ఞర్' (విప్లవ కళాకారుడు)... నల్ల ఎంజీఆర్... అభిమానులకు మంచి మాస్ హీరో... కెప్టెన్.. ఇవే కాదు.. ధైర్యం, తెగువకు చిరునామా అనే పేరు కూడా ఉంది.. మంచి మానవతావాది కూడా. ఇలా ఎన్నో రకాల రూపాల్లో నటుడిగా, వ్యక్తిగా తమిళ ప్రజల మనసుల్లో 'మనసున్న మాస్ హీరో'గా చెరగని ముద్ర వేసుకున్న విజయ్‌కాంత్ ఇక లేరు.

మనసున్న మాస్ హీరో

విజయ్‌కాంత్ 1952– 2023

విజయ్‌కాంత్ అసలు పేరు నారాయణన్ విజయ్‌రాజ్ అళగర్‌సామి. కేఎన్ అళగర్‌సామి, ఆండాళ్ అళగర్‌సామి దంపతులకు 1952 ఆగస్టు 25న తమిళనాడులోని మధురైలో జన్మించారాయన. కాగా అళగర్‌సామి కుటుంబానికి తెలుగు మూలాలు ఉన్నాయి. పదో తరగతి వరకు చదివిన విజయ్‌రాజ్ తండ్రికి సహాయంగా రైస్ మిల్లు బాధ్యతలను చూసుకునేవాడు. అయితే చిన్నతనం నుంచి నటనపై ఆసక్తి ఉండటంతో 1979లో చెన్నై చేరుకున్నాడు విజయ్‌రాజ్. సినీ అవకాశాల కోసం ప్రయత్నించిన ఆయనకు ఎంఏ రాజా దర్శకత్వం వహించిన 'ఇనిక్కుమ్ ఇళమై' (1979) చిత్రంలో ప్రతినాయకుడిగా తొలి అవకాశం వచ్చింది. ఆ చిత్ర దర్శక-నిర్మాత ఎంఏ కాజానే విజయ్‌రాజ్ పేరుని విజయ్‌కాంత్‌గా మార్చారు. 'ఇనిక్కుమ్ ఇళమై' తర్వాత 'అగల్ విళక్కు, నీరోట్టం, చామంతి పూ' తదితర చిత్రాల్లో ఆయన నటించినా ఆశించిన విజయాలు అందుకోలేకపోయారు. ఆ తర్వాత ఎస్ఏ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన 'దూరత్తు ఇడి ముళక్కమ్' (1980) సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చారు విజయ్‌కాంత్. ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. ఎస్ఏ చంద్రశేఖర్ దర్శకత్వంలో నటించిన ద్వితీయ చిత్రం 'చట్టం ఒరు ఇరుట్టరై' (1981) సినిమా సంచలన విజయం సాధించడంతో పాటు విజయ్‌కాంత్‌కు మాస్ ఇమేజ్ తెచ్చిపెట్టింది. హీరోగా చాలా బిజీ అయిపోవడంతో రోజుకు మూడు షిఫ్టులుగా పని చేశారాయన. ఎంత బిజీ హీరో అంటే 1984లో ఆయన నటించిన 18 సినిమాలు విడుదలవడం విశేషం. విజయ్‌కాంత్ సినిమాల్లో ఎక్కువగా సామాజిక నేపథ్యం ఉంటుంది. వీరోచితం, విప్లవ భావాలు, ప్రజలను ఉత్తేజపరచే అంశాలు ఉంటాయి. అలాగే ఆయన యాక్షన్‌కు ప్రత్యేక అభిమానులున్నారు. 'అమ్మన్ కోయిల్ కిళక్కాలే, వైదేహి కాత్తిరిందాళ్, చిన్న గౌండర్, వానత్తై పోల' వంటి పలు కుటుంబ నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రాల్లోనూ తనదైన నటనతో అలరించారాయన. పోలీస్ పాత్రలకు వన్నె తెచ్చిన విజయ్‌కాంత్‌కు 'కెప్టెన్ ప్రభాకరన్' సంచలన హీరోగా పేరు తెచ్చిపెట్టింది. ఈ చిత్రం తర్వాత ఫ్యాన్స్ ఆయన్ను 'కెప్టెన్' అని ప్రేమగా పిలవడం మొదలు పెట్టారు. కొందరు ఫ్యాన్స్ విప్లవ కళాకారుడు అంటూ గౌరవంతో పిలుచుకుంటారు. అయితే విజయ్‌కాంత్ సినీ కెరీర్ అంత సాఫీగా సాగలేదు. ఆదిలో ఎన్నో కష్టాలు, అవమానాలను ఎదుర్కొన్నారు. విజయ్‌కాంత్ నలుపు రంగులో ఉండటంతో మొదట్లో పలువురు ప్రముఖ నటీమణులు ఆయన సరసన నటించడానికి నిరాకరించారట. అయినా తనను ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు విజయ్‌కాంత్. అటు సందేశాత్మక చిత్రాలు, ఇటు వాణిజ్య సినిమాలు ఏకకాలంలో చేశారాయన. సినిమా ప్రారంభంలో కాకుండా విడుదల ముందు పారితోషికాన్ని అందుకుని నిర్మాతల హీరోగా పేరు తెచ్చుకున్నారు. ఒకవేళ ఆ సినిమా నిర్మాత ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంటే ఒక్క రూపాయి కూడా పారితోషికం తీసుకునేవారు కాదట. ఎంజీఆర్ అభిమాని అయిన విజయ్‌కాంత్.. తన అభిమాన హీరోలాగా ప్రజల ఆకలి తీర్చేవారు. ఆయన కార్యాలయంలో నిత్యాన్న దానం చేస్తూ.. కరుప్పు (నలుపు) ఎంజీఆర్‌గా కొనియాడబడ్డారు విజయ్‌కాంత్. ఆర్‌కే సెల్వమణి దర్శకత్వం వహించిన 'కెప్టెన్ ప్రభాకరన్' విజయ్‌కాంత్‌కు నూరవ చిత్రం. ఆయన కెరీర్‌లో 150కిపైగా సినిమాల్లో నటిస్తే.. అందులో 20కిపైగా పోలీస్ ఆఫీసర్‌గా నటించిన సినిమాలే ఉండడం విశేషం. చివరగా తన కొడుకు షణ్ముగ పాండియన్‌ను హీరోగా పరిచయం చేసిన 'సహాబ్దం' (1993) చిత్రంలో ముఖ్య పాత్రను పోషించారాయన. 'విరుదగిరి' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు విజయ్‌కాంత్. బావ ఎల్.కె. సుధీశ్‌తో కలిసి మూడు సినిమాలు నిర్మించారు విజయ్‌కాంత్. దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం అధ్యక్షుడిగానూ విశేష సేవలందించారాయన. సినీ పరిశ్రమలో అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్న విజయ్‌కాంత్ మృతికి పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి కూడా ఆయనకు మృతి పట్ల విచారం వ్యక్తం చేశాయి. విజయ్‌కాంత్‌కుభార్య ప్రేమలత, కుమారులు విజయ ప్రభాకరన్, షణ్ముగ పాండియన్ ఉన్నారు.



● 'కెప్టెన్ ప్రభాకరన్'లో...

విజయ్‌కాంత్ తమిళంలో తప్ప ఇతర భాషల్లో సినిమాలు చేయలేదు. కానీ ఆయన తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితులే. 'ఛాలెంజ్ రౌడీ, రౌడీలకు రౌడీ, పోలీస్ అధికారం, కెప్టెన్, కెప్టెన్ ప్రభాకరన్, మా బావ బంగారం, నేటి రాక్షసులు, సింధూరపువ్వు, అమ్మను చూడాలి, బొబ్బిలి రాయుడు, మరణ మృదంగం'.. ఇలా ఆయన నటించిన పలు తమిళ చిత్రాలు తెలుగులో అనువాదమై, ఇక్కడి ప్రేక్షకులకు విజయ్‌కాంత్‌ని దగ్గర చేశాయి.

తెలుగు హీరోలు పలువురు విజయ్‌కాంత్ తమిళ సినిమాలను తెలుగులో రీమేక్ చేసి బ్లాక్‌బస్టర్స్ కొట్టారు. చిరంజీవి కెరీర్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఠాగూర్' (2003) విజయ్‌కాంత్ హీరోగా వచ్చిన తమిళ సినిమా 'రమణ' (2002)కు రీమేక్. అలాగే విజయ్‌కాంత్ హీరోగా నటించిన 'సట్టమ్ ఒరు ఇరుట్టరై' (1981), 'వెట్రి' (1984), 'అమ్మన్ కోయిల్ కిళక్కాలే' (1986) సినిమాలు తెలుగులో 'చట్టానికి కళ్ళు లేవు' (1981) 'దేవాంతకుడు' (1984), 'ఖైదీ నంబరు 786' (1988)గా రీమేక్ కాగా, ఈ చిత్రాల్లో చిరంజీవి హీరోగా నటించారు. విజయ్‌కాంత్ 'చిన్న గౌండర్' (1992) తెలుగు రీమేక్ 'చినరాయుడు' (1992)లో వెంకటేశ్, 'నానే రాజా నానే మంత్రి' (1985) రీమేక్ 'నేనే రాజు నేనే మంత్రి (1987)', 'ఎన్ పురుషన్‌దాన్ ఎనక్కు మట్టుమ్‌దాన్' (1989) రీమేక్ 'నా మొగుడు నాకే సొంతం' (1989) చిత్రాల్లో మోహన్‌బాబు హీరోగా నటించారు. విజయ్‌కాంత్ 'వానత్తై పోల' (2000) సినిమాను తెలుగులో 'మా అన్నయ్య'గా రీమేక్ చేసి హిట్ అందుకున్నారు రాజశేఖర్. కాగా కొందరు తెలుగు హీరోల సినిమాల తమిళ రీమేక్‌లో నటించి హిట్స్ అందుకున్నారు విజయ్‌కాంత్. బాలకృష్ణ హీరోగా నటించిన 'భానుమతిగారి మొగుడు' (1987) సినిమా తమిళ రీమేక్ 'తెర్కత్తి కళ్లన్' (1988)లో, ఎన్టీఆర్ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'సింహాద్రి' (2003) రీమేక్ 'గజేంద్ర' (2004)లో విజయ్‌కాంత్ హీరోగా నటించి, బ్లాక్‌బస్టర్స్ అందుకున్నారు. ఇలా ఆయన కెరీర్‌లో మరికొన్ని సినిమాలు ఉన్నాయి.

ఆఫీసర్ ఆన్ డ్యూటీ

ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ బచ్చన్‌గా బాధ్యతలు తీసుకున్నారు రవితేజ. 'మిరపకాయ్' వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ తర్వాత హీరో రవితేజ, దర్శకుడు హరీష్‌శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ఉపశీర్షిక. ఈ చిత్రంలో రవితేజ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. పనోరమా స్టూడియోస్, టీ సిరీస్‌ల సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ బచ్చన్ పాత్రలో రవితేజ నటిస్తున్నారని సమాచారం. కాగా ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్‌ను గురువారం ప్రారంభించినట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది.


● రవితేజ

సినిమా చూసి నాన్న ఎమోషన్ అయ్యారు - రోషన్ కనకాల



''నటన పరంగా అమ్మానాన్న (సుమ, రాజీవ్ కనకాల) సలహాలు తీసుకుంటాను. 'బబుల్‌గమ్' మూవీని వారు చూశారు.. బాగా నచ్చింది. ఆ టైమ్‌లో నేను అక్కడ లేను. కొన్ని సన్నివేశాలు చూస్తున్నప్పుడు నాన్న ఎమోషన్ అయి, ఏడ్చారని అమ్మ చెప్పింది. నాన్నని అడిగితే 'బాగా చేశావ్' అన్నారు. ఆయన్నుంచి ప్రశంస రావడం ఆనందంగా అనిపించింది'' అని రోషన్ కనకాల అన్నారు. రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రోషన్ కనకాల, మానసా చౌదరి జంటగా నటించిన చిత్రం 'బబుల్‌గమ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా రోషన్ కనకాల మాట్లాడుతూ– ''నా బాల్యం అంతా దాదాపుగా తాతగారి (దేవదాస్ కనకాల) నటనా శిక్షణ కేంద్రంలో గడిచింది. నాకు చిన్నప్పటి నుంచి నటనంటే ఇష్టం. అది తెలియని ఒక థ్రిల్ ఇస్తుంది. నటుడు కావాలనే నా కల 'బబుల్‌గమ్'తో నెరవేరడం ఆనందంగా ఉంది. న్యూ ఏజ్ కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా అలరిస్తుందనే నమ్మకం ఉంది. సినిమా షూటింగ్‌కి వెళ్లే నెల రోజుల ముందే వర్క్ షాప్ నిర్వహించడం మాకు ప్లస్ అయింది. ఈ మూవీలో ఓ సీన్ కోసం దాదాపు మూడు గంటలు పాటు షర్టు లేకుండా తిరిగాను. మొదట్లో సిగ్గుపడ్డా... ఆ తర్వాత పోయింది (నవ్వుతూ). మా అమ్మానాన్నలకు పరిశ్రమలో చాలా మంచి పేరుంది. నేను హీరోగా వస్తుండటం బాధ్యతగా అనిపిస్తోంది. ఫలానా జోనర్ మూవీ చేయాలనే ఆలోచన నాకు లేదు. ప్రేక్షకులను అలరించే మంచి సినిమాలు చేయడం ఇష్టం'' అన్నారు.

వినోదాల పొట్టేల్

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పొట్టేల్'. 'బందం రేగడ్', 'సవారీ' చిత్రాల ఫేమ్ సాహిత్ మోతుకూరి దర్శకత్వంలో నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ఫస్ట్ ఇంపాక్ట్ లాంచ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా మాట్లాడుతూ– ''పొట్టేల్' సినిమా ఫస్ట్ లుక్ వీడియో చాలా ఇంపాక్ట్‌ఫుల్‌గా అనిపించింది. ఈ సినిమా షూటింగ్‌ను చూసేందుకు సెట్స్‌కు వెళ్లాను. ప్రేక్షకులకు ఓ మంచి కథని చూపించడానికి టీమ్ చాలా కష్టపడి పని చేసింది. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చి, పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నా'' అన్నారు. ''వినోదంతో పాటు మంచి ప్రయోజనం కోసం చేసిన చిత్రమిది'' అన్నారు యువ చంద్రకృష్ణ. ''పొట్టేల్' కథ రాసినప్పుడు ఎంత హై ఫీలయ్యానో అదే హై ఈ రోజు వరకూ వుంది. నిశాంక్, సురేష్ చాలా ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. యువ చంద్ర, అనన్య బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ చిత్రంలో అజయ్‌గారు కీ రోల్ చేశారు'' అన్నారు సాహిత్ మోతుకూరి. ''సినిమా అద్భుతంగా వచ్చింది. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అన్నారు నిశాంక్, సురేష్. ''అందరూ గుర్తుంచుకునే చిత్రం అవుతుంది'' అన్నారు అనన్య.


● 'పొట్టేల్' పోస్టర్

కామెడీ కిస్మత్

నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, విశ్వదేవ్, రియా సుమన్ ప్రధాన పాత్రధారులుగా, 'అవసరాల' శ్రీనివాస్ ఓ కీలక పాత్రలో నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రం 'కిస్మత్'. శ్రీనాథ్ బాదినేని దర్శకత్వంలో కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అధీరా ప్రొడక్షన్స్ పతాకాలపై రాజు నిర్మించారు. కాగా ఈ సినిమాను ఫిబ్రవరి 2న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ గురువారం వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: మార్క్ కె. రాబిన్, సహ-నిర్మాత: సీహెచ్ భానుప్రసాద్ రెడ్డి.


● 'కిస్మత్' పోస్టర్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	372	72,410
నిఫ్టీ ▲	124	21,777

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,122	▲	23
డోజోన్స్	37,709	▲	53
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,722	▼	3
డాక్స్	16,692	▼	50
షాంఘై	3,286	▲	40
నికాయ్	33,540	▼	142

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో


ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	63,452 ▲	229
బంగారం (99.5 స్వచ్ఛత)	63,198 ▲	228
వెండి (కిలో)	74,633 ▲	569

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.88	83.90
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.57	108.46
€	యూరో	ఒకటి	91.53	93.91
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.84	59.17
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.22	58.17
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.75	63.25
SAR	సౌదీ రియాల్	ఖావుపదివి	21.22	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	ఖావుపదివి	21.75	23.54
¥	చైనా యువాన్	ఖావుపదివి	10.59	12.66

డిజిటల్ ఎకానమీపై అదానీ గ్రూప్ దృష్టి

- అబుధాబీకి చెందిన ఐహెచ్‌సీతో జట్టు
- సిరియస్ డిజిటెక్ ఏర్పాటు



న్యూఢిల్లీ: దాదాపు 175 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్న దేశీ డిజిటల్ ఎకానమీలో అవకాశాలను అందిపుచ్చుకోవడంపై అదానీ గ్రూప్ దృష్టి పెట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్‌చెయిన్ తదితర ఉత్పత్తులు, సేవలను మరింతగా వినియోగంలోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా అబుధాబీకి చెందిన ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ (ఐహెచ్‌సీ) అనుబంధ సంస్థ సిరియస్ ఇంటర్నేషనల్ హోల్డింగ్‌తో అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో (ఏఈఎల్) భాగమైన అదానీ గ్లోబల్ జట్టు కట్టింది. సిరియస్ డిజిటెక్ ఇంటర్నేషనల్ పేరుతో జాయింట్ వెంచర్ సంస్థను ఏర్పాటు చేసింది. ఇది అబుధాబీ కేంద్రంగా పని చేస్తుంది. సిరియస్ జేవీలో సిరియస్‌కు 51%, అదానీ గ్రూప్‌నకు 49% వాటాలు ఉంటాయి. అంతర్జాతీయంగా డిజిటల్ పరివర్తన విభాగంలో సిరియస్ అనుభవం, దేశీ మార్కెట్‌పై అదానీ గ్రూప్ పరిజ్ఞానంతో భారత డిజిటల్ ఎకానమీలో అవకాశాలను అందిపుచ్చుకోవడంపై సిరియస్ జేవీ దృష్టి పెట్టనుందని ఏఈఎల్ తెలిపింది. ప్రస్తుతం 175 బిలియన్ డాలర్లుగా ఉన్న డిజిటల్ ఎకానమీ 2030 నాటికి ట్రిలియన్ (లక్ష కోట్ల) డాలర్లుగా ఎదగనుందని అంచనాలు ఉన్నట్లు పేర్కొంది. ఇన్‌ఫ్రాతో పాటు ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, గ్రీన్‌టెక్ తదితర రంగాల్లోనూ అధునాతన కృత్రిమ మేథ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), బ్లాక్‌చెయిన్ మొదలైన వాటిని మరింతగా వినియోగంలోకి తెచ్చేందుకు సిరియస్ జేవీ కృషి చేస్తుందని తెలిపింది.

బ్యాంకింగ్‌లో ఎస్‌బీఐ కీలకం

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకులకూ ఇదే హోదా
- ఆర్‌బీఐ ప్రకటన




ముంబై: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు వ్యవస్థాగతంగా చాలా కీలకమైన బ్యాంకులని రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పేర్కొంది. ఈ బ్యాంకులు దేశీయంగా వ్యవస్థాగతంగా ముఖ్యమైన బ్యాంకులుగా (డీ–ఎస్‌ఐబీలు) లేదా సంస్థలుగా తమ గుర్తింపును కొనసాగిస్తున్నట్లు తెలిపింది. బ్యాంకింగ్ రంగంలో ఈ బ్యాంకులు వైఫల్యం చెందడానికి అవకాశాలు అతి స్వల్పమని ఈ గుర్తింపు ఉద్ఘాటిస్తోంది.

ఎన్‌పీఏలు 0.8 శాతానికి డౌన్: ఎఫ్‌ఎస్‌ఆర్

ఇదిలావుండగా, సెప్టెంబరు 2023 చివరి నాటికి బ్యాంకుల నికర నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి బహుళ సంవత్సరాల కనిష్ఠ స్థాయి 0.8%కి తగ్గిందని, దేశ దేశీయ ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉందని రిజర్వ్ బ్యాంక్ 28వ ఫైనాన్షియల్ స్థిరత్వ నివేదిక (ఎఫ్‌ఎస్‌ఆర్) పేర్కొంది. స్థూలంగా చూస్తే కూడా ఇది రికార్డు కనిష్ఠ స్థాయిలో 3.2 శాతంగా పేర్కొంది. అంతర్జాతీయంగా ఆర్థిక ప్రతికూలతలు ఉన్నప్పటికీ, భారత్ ఎకానమీ పటిష్ఠంగా కొనసాగుతున్నట్లు నివేదిక వివరించింది. భారత్ వేగవంతమైన వృద్ధి సామర్థ్యానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా నివారించడానికి ఆర్‌బీఐ తగిన చర్యలు తీసుకుంటోందని గవర్నర్ శక్తికాంత దాస్ నివేదిక ముందుమాటగా పేర్కొన్నారు.

ప్రపంచ టాప్ 10లో స్థానమే లక్ష్యం

- సాధించిన విజయాలతో సరిపెట్టుకోం
- రిలయన్స్ ఫ్యామిలీ డేలో చీఫ్ ముకేశ్ అంబానీ



న్యూఢిల్లీ: ఇప్పటివరకు సాధించిన విజయాలతో సంతృప్తి పడి, అలసత్వం వహించబోమని రిలయన్స్ చైర్మన్ ముకేశ్ అంబానీ చెప్పారు. డిజిటల్ డేటా ప్లాట్‌ఫాంలు, కృత్రిమ మేథ (ఏఐ) వినియోగంలో ప్రపంచ టాప్ 10 వ్యాపార దిగ్గజాల్లో ఒకటిగా ఎదగడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రూప్ వ్యవస్థాపకుడు ధీరుభాయ్ అంబానీ జయంతి సందర్భంగా నిర్వహించే రిలయన్స్ ఫ్యామిలీ డేలో పాల్గొన్న సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశిస్తూ ఆయన ప్రసంగించారు. 'నేడు దేశీయంగా, అంతర్జాతీయంగా వ్యాపార పరిస్థితులు అత్యంత వేగంగా మారిపోతున్నాయి. సాధించిన వాటితో సంతృప్తి చెంది ఆగిపోవడానికి తావు లేదు. రిలయన్స్ ఎప్పటికప్పుడు కొంగొత్త ఆవిష్కరణలతో ముందుకు సాగుతుంది' అని అంబానీ చెప్పారు. 'ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఎకానమీగా ఎదిగేందుకు భారత్ ముందుకు పరుగులు తీస్తున్న నేపథ్యంలో రిలయన్స్ ఎదుట అసాధారణ అవకాశాలు ఉన్నాయి. ప్రపంచంలోనే టాప్ 10 వ్యాపార దిగ్గజాల్లో రిలయన్స్ ఎదగగలదు. తప్పకుండా ఎదుగుతుంది' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం ఉద్యోగులంతా కస్టమర్లకు మరింత విలువ చేకూర్చేలా సేవలందించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. డిజిటల్ డేటా ప్లాట్‌ఫామ్‌లు.. ఏఐ వినియోగంలో గ్లోబల్ లీడర్లలో స్థానాన్ని పటిష్ఠం చేసుకోవడం, సంస్థాగత సంస్కృతి విషయంలో అంతర్జాతీయ దిగ్గజాల్లో ఒకటిగా ఎదగడం నూతన సంవత్సర తీర్మానాలుగా నిర్దేశించుకోవాలని ఆయన సందేశమిచ్చారు.

వృద్ధికి జనరిక్స్ దన్ను

డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సమీప భవిష్యత్తులో, మధ్యకాలికంగా తమ సంస్థ వృద్ధికి ప్రధాన జనరిక్స్ వ్యాపారం దన్నుగా నిలవనున్నట్లు ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రికార్డు విక్రయాలు, లాభదాయకతకు కూడా ఇదే కారణమని వివరించింది. దీర్ఘకాలిక దృష్టితో రూపొందిస్తున్న వినూత్న ఉత్పత్తులతో తమ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరిస్తున్నామని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు. పైరోటినిబ్, టొరిపాలిమాబ్, కోయా 302 వంటి మాలిక్యూల్స్ కోసం జియాంగ్సు హెన్‌గ్రుయి, జున్షి లైఫ్‌సైన్సెస్, కోయా థెరప్యూటిక్స్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వివరించారు. డిజిటల్ థెరప్యూటిక్స్ దిశగా మైగ్రెయిన్ నివారణలో ఉపయోగపడే వేరబుల్ డివైజ్‌ను ప్రవేశపెట్టామని, అలాగే సెలెవిడా వెల్‌నెస్ ప్లాట్‌ఫాం ద్వారా ఈ–కామర్స్ విభాగంలోకి కూడా ప్రవేశించామని పేర్కొన్నారు. కీలకమైన జనరిక్స్‌ను మరింత పటిష్ఠం చేసుకోవడంపై దృష్టి పెడుతున్నట్లు సంస్థ ప్రతినిధి వివరించారు. 2030 నాటికి దేశీ ఫార్మా పరిశ్రమ 120–130 బిలియన్ డాలర్ల స్థాయిని, 2047 నాటికి 350–400 బిలియన్ డాలర్ల స్థాయిని లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.

రెండో రోజూ రికార్డుల ర్యాలీ

- సెన్సెక్స్ 372 పాయింట్లు ప్లస్
- 21,750 స్థాయి పైకి నిఫ్టీ
- ఇంధన, మెటల్ షేర్లకు డిమాండ్
- పారిశ్రామిక, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ



ముంబై: వరుసగా అయిదో రోజూ కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీల రికార్డు ర్యాలీ రెండో రోజూ కొనసాగింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు, క్రూడాయిల్ ధరలు దిగిరావడం వంటి అంశాలు కలిసొచ్చాయి. ఫలితంగా స్టాక్ సూచీలు ఈ ఏడాది(2023) చివరి ఎఫ్అండ్ఓ గడువు ముగింపు రోజైన గురువారం మరోసారి ఇంట్రాడే, ముగింపుల్లో చరిత్రాత్మక గరిష్టాలను అందుకున్నాయి. సెన్సెక్స్ 372 పాయింట్లు పెరిగి 72,410వద్ద స్థిరపడింది. నిఫ్టీ 124 పాయింట్లు లాభపడి 21,777 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో కొంత అమ్మకాల ఒత్తిడికి లోనైనప్పటికీ.., తిరిగి పుంజుకోగలిగాయి. ఆయిల్అండ్‌గ్యాస్, ఇంధన, మెటల్, ఎఫ్ఎంసీజీ షేర్లు రాణించడంతో ఒక దశలో సెన్సెక్స్ 446 పాయింట్లు బలపడి 72,484 వద్ద, నిఫ్టీ 147 పాయింట్లు దూసుకెళ్లి 21,801 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. పారిశ్రామిక, ఐటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.66%, 0.23% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4359 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.137 కోట్ల విలువైన షేర్లు కొన్నారు. వచ్చే ఏడాది నుంచి ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- సెన్సెక్స్ 5 రోజుల్లో 1,904 పాయింట్ల లాభం తో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో లిస్టెడ్ సంస్థల మార్కెట్ విలువ రూ.12.80 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.363 లక్షల కోట్లకు చేరింది. గురువారం ఒక్కరోజే రూ.1.7 లక్షల కోట్లు పెరిగింది.
- కస్టమర్ల నుంచి వసూలు చేసిన డెవలరీ ఫీజుపై జీఎస్టీకి సంబంధించి రూ.402 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందంటూ డీజీజీఐ షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో జొమాటో షేరు 3% నష్టపోయి రూ.123 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 5% పతనమై రూ.121 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది.
- హౌసింగ్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల ఫైనాన్సింగ్‌కు సంబంధించి గుజరాత్ ప్రభుత్వంతో రూ. 14,500 కోట్ల ఎంఓయూ ఒప్పందం కుదుర్చుకోవడంతో ప్రభుత్వ రంగ హడ్కో షేరు 12% పెరిగి రూ.128 వద్ద ముగిసింది.
- దేశీయ మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడులు రావడం, క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో డాలర్ మారకంలో రూపాయి గురువారం 17 పైసలు పెరిగి 83.17 వద్ద స్థిరపడింది.

ఆజాద్ ఇంజినీరింగ్ భళా



వైమానిక, రక్షణ, ఇంధన, చమురు రంగాలకు ప్రొడక్టులను సరఫరా చేసే ఆజాద్ ఇంజినీరింగ్ లిమిటెడ్ లిస్టింగ్‌లో మెప్పించింది. ఇష్యూ ధర రూ. 524తో పోలిస్తే బీఎస్ఈలో తొలి రోజు రూ. 710 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఇది 35.5 శాతం ప్రీమియంకాగా.. తదుపరి 39 శాతం వరకూ ఎగసింది. రూ. 728కు చేరింది. చివరికి 29 శాతం జంప్‌చేసి రూ. 677 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ దాదాపు రూ. 4,003 కోట్లకు చేరింది.

ఇండియన్ ఇమ్యునలాజికల్స్ కొత్త ప్లాంట్

- నిర్మాణం ప్రారంభించిన కంపెనీ
- రూ.700 కోట్ల వ్యయంతో ఏర్పాటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యాక్సిన్ల తయారీ దిగ్గజం ఇండియన్ ఇమ్యునలాజికల్స్ (ఐఐఎల్) నూతన ప్లాంటు నిర్మాణం ప్రారంభించింది. హైదరాబాద్ సమీపంలోని జీనోమ్‌వ్యాలీలో 14 ఎకరాల విస్తీర్ణంలో రూ.700 కోట్ల వ్యయంతో ఇది ఏర్పాటవుతోంది. గురువారం ఈ మేరకు నూతన కేంద్రం కోసం భూమి పూజను కంపెనీ నిర్వహించింది. పశువులకు అవసరమయ్యే వ్యాక్సిన్లను ఇక్కడ తయారు చేస్తారు. ఏటా 30 కోట్ల యూనిట్ల వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యంతో ఇండియన్ ఇమ్యునాలాజికల్స్ ఈ ప్లాంటును స్థాపిస్తోంది. తయారీ కేంద్రం కార్యరూపంలోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా 750 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 'హైదరాబాద్‌లోని ఈ కొత్త ప్లాంటు దేశానికి అంకితం. భారత్‌లో ఫుట్ అండ్ మౌత్ డిసీస్ (గాలికుంటు వ్యాధి) నిర్మూలనలో ఈ కేంద్రం సహాయపడుతుంది. అందుబాటు ధరలో వ్యాక్సిన్ల అభివృద్ధి, తయారీలో ఐఐఎల్ సామర్థ్యం ఖజానాకు రూ. వేల కోట్లను ఆదా చేసింది' అని ఎన్‌డీడీబీ, ఐఐఎల్ చైర్మన్ మీనేశ్ షా ఈ సందర్భంగా తెలిపారు.



ప్రిక్వార్టర్స్‌లో సహజ ఓటమి

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీ సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి పోరాటం ముగిసింది. నవీ ముంబైలో జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సహజ 2–6, 4–6తో నహో సాటో (జపాన్) చేతిలో ఓడిపోయింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 2–6, 6–3, 5–10తో కామిలా (లాత్వియా)-మకరోవా (రష్యా) జోడీ చేతిలో ఓడింది.

భారత్ బోల్తా

తొలి టెస్టులో ఇన్నింగ్స్ 32 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఘనవిజయం

రెండో ఇన్నింగ్స్‌లో చేతులెత్తేసిన భారత బ్యాటర్లు

'బాక్సింగ్ డే' టెస్టులో మన జట్టు మూడే రోజుల్లో మునిగింది. రోజు రోజుకూ ప్రత్యర్థి జట్టే పట్టు బిగించడం... మూడో రోజైతే ఏకంగా అటు బ్యాటింగ్‌లో ప్రతాపం... ఇటు బౌలింగ్‌లో పట్టుదల చూపిన దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ విజయం సాధించింది. దీంతో పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న భారత్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సఫారీ బౌలింగ్ ముందు ఎదురు నిలువలేకపోయింది. ఈ ఓటమితో దక్షిణాఫ్రికా గడ్డపై టెస్టు సిరీస్ సొంతం చేసుకునేందుకు భారత్ మరోసారి పర్యటించాల్సి ఉంటుంది. ఈ గెలుపుతో రెండు టెస్టుల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది.



సెంచూరియన్: టీమిండియా ఈ పర్యటనలో టి20లను సమం చేసుకున్నా... వన్డే సిరీస్‌ను వశం చేసుకున్నా... అసలైన క్రికెట్ టెస్టు ఫార్మాట్‌కు వచ్చేసరికి సఫారీలో సవారీ అంత సులభం కానేకాదని తొలిటెస్టు మూడు రోజుల్లోనే తెలుసుకుంది. 'బాక్సింగ్ డే' పోరులో భారత్ ఇన్నింగ్స్ 32 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. మొదట ఓవర్‌నైట్ స్కోరు 256/5తో గురువారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 108.4 ఓవర్లలో 408 పరుగుల వద్ద ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డీన్ ఎల్గర్ (287 బంతుల్లో 185; 28 ఫోర్లు), మార్కో జాన్సెన్ (147 బంతుల్లో 84 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్స్) భారీస్కోరుకు బాటవేశారు. ఇద్దరు కలిసి ఆరో వికెట్‌కు 111 పరుగులు జోడించారు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 163 పరుగుల ఆధిక్యం సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 34.1 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. కోహ్లి (82 బంతుల్లో 76; 12 ఫోర్లు, 1 సిక్స్) మినహా ఇంకెవరూ చెప్పుకోదగ్గ పరుగులే చేయలేదు. రెండు జట్ల మధ్య చివరిదైన రెండో టెస్టు జనవరి 3 నుంచి కేప్‌టౌన్‌లో జరుగుతుంది.

అప్పుడు రాహుల్... ఇప్పుడు కోహ్లి

ఈ టెస్టులో సఫారీ పేసర్లు భారత బ్యాటర్ల పాలిట గన్ గురిపెట్టినట్లుగా... బంతుల స్థానంలో బుల్లెట్లు సంధించారేమో! ఎందుకంటే రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బ్యాటర్లు తేలిగ్గా వికెట్లను సమర్పించుకున్నారు. ముఖ్యంగా మూడో రోజైతే దక్షిణాఫ్రికా బ్యాటింగ్ బలాన్ని, బౌలింగ్ అస్త్రాల్ని ప్రయోగించిన తీరుకు భారత్ భీతిల్లిపోయింది. ప్రత్యర్థి తొలిసెషన్‌కు పైగా ఆడింది. 42.4 ఓవర్లలో మిగిలున్న 5 వికెట్లతోనే 152 పరుగులు చేసింది. కానీ 10 మంది భారత బ్యాటర్లు కనీసం 35 ఓవర్లయినా పూర్తిగా ఆడలేకపోయారు. రబడ (2/32), బర్గర్ (4/33), జాన్సెన్ (3/36) ముప్పేట దాడికి దిగడంతో అనుభవజ్ఞుడైన కెప్టెన్ రోహిత్ (0) ఖాతా తెరువలేకపోయాడు. యశస్వి (5), అయ్యర్ (6), కేఎల్ రాహుల్ (4), అశ్విన్ (0), శార్దుల్ (2) సింగిల్ డిజిట్లకే పరిమితమయ్యారు. కోహ్లి అర్ధసెంచరీతో పోరాడగా, శుబ్‌మన్ గిల్ (26) కాస్త మెరుగనిపించాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 245 ఆలౌట్; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 5; ఎల్గర్ (సి) రాహుల్ (బి) శార్దుల్ 185; టోని జార్జి (సి) జైస్వాల్ (బి) బుమ్రా 28; పీటర్సన్ (బి) బుమ్రా 2; బెడింగ్‌హమ్ (బి) సిరాజ్ 56; వెరిన్ (సి) రాహుల్ (బి) ప్రసిధ్‌కృష్ణ 4; జాన్సెన్ నాటౌట్ 84; కొయెట్జీ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 19; రబడ (బి) బుమ్రా 1; బర్గర్ (బి) బుమ్రా 0; బవుమా (ఆబ్సెంట్ హర్ట్); ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం** (108.4 ఓవర్లలో ఆలౌట్) 408. **వికెట్ల పతనం:** 1–11, 2–104, 3–113, 4–244, 5–249, 6–360, 7–391, 8–392, 9–408. **బౌలింగ్:** బుమ్రా 26.4–5–69–4, సిరాజ్ 24–1–91–2, శార్దుల్ 19–2–101–1, ప్రసిధ్ కృష్ణ 20–2–93–1, అశ్విన్ 19–6–41–1.


భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి (సి) వెరిన్ (బి)బర్గర్ 5; రోహిత్ (బి) రబడ 0; గిల్ (బి) జాన్సెన్ 26; కోహ్లి (సి) రబడ (బి) జాన్సెన్ 76; అయ్యర్ (బి) జాన్సెన్ 6; రాహుల్ (సి) మార్క్‌రమ్ (బి) బర్గర్ 4; అశ్విన్ (సి) బెడింగ్‌హమ్ (బి) బర్గర్ 0; శార్దుల్ (సి) బెడింగ్‌హమ్ (బి) రబడ 2; బుమ్రా రనౌట్ 0; సిరాజ్ (సి) వెరిన్ (బి) బర్గర్ 4; ప్రసిధ్‌కృష్ణ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం** (34.1 ఓవర్లలో ఆలౌట్) 131. **వికెట్ల పతనం:** 1–5, 2–13, 3–52, 4–72, 5–96, 6–96, 7–105, 8–113, 9–121, 10–131. **బౌలింగ్:** రబడ 12–3–32–2, బర్గర్ 10–3–33–4, జాన్సెన్ 7.1–1–36–3, కొయెట్జీ 5–0–28–0.

ఆదుకున్న మార్ష్, స్మిత్



మెల్‌బోర్న్: పాకిస్తాన్‌తో జరుగుతున్న 'బాక్సింగ్ డే' టెస్టులో ఆస్ట్రేలియా జట్టును మిచెల్ మార్ష్ (96; 13 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (50; 3 ఫోర్లు) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. 54 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 16 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. అయితే మార్ష్, స్మిత్ ఐదో వికెట్‌కు 153 పరుగులు జోడించి ఆసీస్‌ను ఆదుకున్నారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 62.3 ఓవర్లలో 6 వికెట్లకు 187 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా ఓవరాల్ ఆధిక్యం 241 పరుగులకు చేరింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 194/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 264 పరుగుల వద్ద ఆలౌటైంది.

హైదరాబాద్‌లో 'ఫార్ములా-ఇ' రేసుపై సందిగ్ధత



న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో ఘనంగా ఈ ఏడాది మొదలైన 'ఫార్ములా–ఇ' తదుపరి సీజన్ల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ ఫిబ్రవరిలో భాగ్యనగర వాసుల్ని ఈ రేసు అలరించింది. సెలబ్రిటీలు, ప్రముఖులు, రాజకీయ నేతలు సైతం రేసుపై ఆసక్తికనబరిచారు. నగరంలో విజయవంతమైన ఈ రేసు రెండో సీజన్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 10న జరగాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'అభయ హస్తం' గ్యారంటీలపై తలమునకలై ఉండటంతో ఫార్ములా 'ఇ' నిర్వాహకులతో జరిగిన సంప్రదింపులు కొలిక్కి రాలేదు. అయితే ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన కరువవడంతో నిర్వాహకులు ఈసారి హైదరాబాద్‌లో నిర్వహించాల్సిన రౌండ్‌ను రాష్ట్రం నుంచి తరలించే అవకాశాలున్నాయని తెలిసింది. హైదరాబాద్ వెలుపల నిర్వహణపై ఇటు ప్రభుత్వం నుంచి గానీ, అటు నిర్వాహకుల నుంచి గానీ స్పష్టత రాలేదు.

రన్నరప్ హంపి

ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం నెగ్గిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్



సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): అద్భుతమైన ఎత్తులతో ప్రత్యర్థుల ఆట కట్టిస్తూ... భారత చెస్ స్టార్ ప్లేయర్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచింది. గురువారం ముగిసిన మహిళల ర్యాపిడ్ ఈవెంట్‌లో కోనేరు హంపి విజేతను నిర్ణయించిన 'ప్లే ఆఫ్' టైబ్రేక్స్‌లో 1.5–2.5 పాయింట్ల తేడాతో అనస్తాసియా బొద్నారుక్ (రష్యా) చేతిలో ఓడిపోయి రజత పతకం సొంతం చేసుకుంది. ఒత్తిడిలో సంయమనంతో ఆడిన అనస్తాసియా తొలిసారి ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా అవతరించింది. ప్రపంచ ర్యాపిడ్ చెస్ టోర్నీ చరిత్రలో హంపికిది మూడో పతకం కావడం విశేషం. 2019లో విశ్వవిజేతగా నిలిచిన హంపి 2012లో కాంస్య పతకం సాధించింది. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత బొద్నారుక్, హంపి, టింగ్‌జె లె (చైనా) 8.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా బొద్నారుక్, హంపి తొలి రెండు స్థానాల్లో నిలవడంతో వీరిద్దరి మధ్య విజేతను నిర్ణయించేందుకు టైబ్రేక్ నిర్వహించారు. బ్లిట్జ్ పద్ధతిలో జరిగిన తొలి గేమ్‌లో నల్లపావులతో ఆడిన హంపి 56 ఎత్తుల్లో నెగ్గగా... రెండో గేమ్‌లో హంపి 38 ఎత్తుల్లో ఓడిపోయింది. దాంతో స్కోరు 1–1తో సమమైంది. దాంతో తదుపరి గేమ్‌లో గెలిచిన ప్లేయర్‌కు టైటిల్ ఖరారు చేసే 'సడన్‌డెత్' గేమ్‌ను నిర్వహించారు. అయితే ఈ గేమ్ 52 ఎత్తుల్లో 'డ్రా' అయింది. అయితే నాలుగో గేమ్‌లో బొద్నారుక్ 39 ఎత్తుల్లో హంపిపై గెలిచి టైటిల్‌ను ఖరారు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయిలు నూతక్కి ప్రియాంక, సాహితి వర్షిణి 7 పాయింట్లతో వరుసగా 22వ, 23వ స్థానాల్లో నిలిచారు.

13 రౌండ్లపాటు జరిగిన ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ 9 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద 9 పాయింట్లతో 8వ స్థానంలో, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 8.5 పాయింట్లతో 15వ స్థానంలో నిలిచారు. నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ 10 పాయింట్లతో మరోసారి ప్రపంచ చాంపియన్ అయ్యాడు.

పరాజయంతో ప్రారంభం





- తొలి వన్డేలో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన భారత మహిళల జట్టు
- జెమీమా, పూజ అర్ధ సెంచరీలు వృథా

ముంబై: ఈసారైనా ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్ నెగ్గాలనే పట్టుదలతో ఉన్న భారత మహిళల జట్టుకు శుభారంభం లభించలేదు. వరల్డ్ చాంపియన్ ఆస్ట్రేలియా జట్టుతో గురువారం వాంఖెడె స్టేడియంలో జరిగిన తొలి వన్డేలో హర్మన్‌ప్రీత్ నాయకత్వంలోని భారత జట్టు ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 282 పరుగులు సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ (77 బంతుల్లో 82; 7 ఫోర్లు), పూజ వస్త్రకర్ (46 బంతుల్లో 62 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా... ఓపెనర్ యస్తిక భాటియా (64 బంతుల్లో 49; 7 ఫోర్లు) రాణించింది. అస్వస్థత కారణంగా భారత వైస్ కెప్టెన్, ఓపెనర్ స్మృతి మంధాన ఈ మ్యాచ్‌లో ఆడలేదు. అనంతరం ఆస్ట్రేలియా జట్టు 46.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 285 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ అలీసా హీలీ (0) ఖాతా తెరవకుండానే అవుటైనా... ఫోబి లిచ్‌ఫీల్డ్ (89 బంతుల్లో 78; 8 ఫోర్లు, 1 సిక్స్), ఎలీసా పెరీ (72 బంతుల్లో 75; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 148 పరుగులు జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక తాలియా మెక్‌గ్రాత్ (55 బంతుల్లో 68 నాటౌట్; 11 ఫోర్లు), బెత్ మూనీ (47 బంతుల్లో 42; 4 ఫోర్లు) దూకుడుగా ఆడి ఆసీస్ విజయాన్ని ఖరారు చేశారు. భారత బౌలర్లలో రేణుక, పూజ, స్నేహ్ రాణా, దీప్తి శర్మ ఒక్కో వికెట్ తీశారు. రెండో వన్డే శనివారం ఇదే వేదికపై జరుగుతుంది.

ఆర్థిక మాంద్యంతో ఇబ్బందులు తప్పేలా లేవంటూ ఆందోళన.. ఉద్యోగాలు తొలగించేందుకు సిద్ధమవుతున్న కంపెనీలు

మరోవైపు వ్యయాన్ని తగ్గించుకునేందుకు ఏఐ వైపు మొగ్గు.. 2023లో ప్రపంచ వ్యాప్తంగా 2.40 లక్షల మంది తొలగింపు



కోతలేనా?

కలిసొచ్చేలా కన్పించని ఐటీ రంగం..

ఉద్యోగావకాశాలు ఆశించిన మేరకు ఉండకపోవచ్చంటున్న నిపుణులు..

(సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

కొత్త సంవత్సరంలోనూ ఐటీ రంగానికి గడ్డు పరిస్థితేనా? ఆశించిన మేరకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం లేదా? అంటే అవుననే అంటున్నారు నిపుణులు. పలు అంతర్జాతీయ సంస్థలు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. 2023లో దాదాపు 2.40 లక్షల మంది లే ఆఫ్‌ల పేరుతో, తొలగింపు పేరుతో ఉద్యోగాలు కోల్పోయారు. ఇక వచ్చే సంవత్సరంలోనూ పరిస్థితి ఆశాజనకంగా ఉండే అవకాశం కనిపించడం లేదని, ఆర్థిక మాంద్యం ప్రభావం ఈ రంగంపై ఎక్కువగా కనిపిస్తుందని, కోతలు తప్పవని అంటున్నారు. మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగం ఎక్కువ ఉద్యోగాలను కల్పిస్తుందా? లేక ఉన్న ఉద్యోగాల తొలగింపునకు కారణం అవుతుందా అన్నది కూడా కొత్త సంవత్సరంలో తేలనుంది. తాజాగా మ్యూజిక్ స్పాటిఫై ఏకంగా 1,500 మందిని ఉద్యోగాల నుంచి తొలగించింది. ఆ స్థానంలో ఏఐని ఉపయోగించనుంది. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో వ్యయాలను సాధ్యమైనంతగా తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా ఉన్న ఉద్యోగాల తొలగింపు, కొత్త ఉద్యోగాల కల్పనకు మొగ్గు చూపకపోవడం లాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలు రాని పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో మాదిరిగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లు కన్పించడం లేదు. గతంలో ప్రతి యేటా 40 నుంచి 80 శాతం వరకు కొత్త ఉద్యోగులను చేర్చుకోవడానికి సంస్థలు ముందుకు వచ్చేవని, కానీ ఇప్పుడు ఇది బాగా తగ్గిపోయినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఏఐ నైపుణ్యాన్ని పెంచుకోవాలి..

వివిధ కంపెనీల పరిస్థితిని పరిశీలిస్తే.. ప్రముఖ స్టార్టప్ కంపెనీ, 4.1 బిలియన్ డాలర్ల విలువగల డేటామిర్ సంస్థ మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో తన సంస్థలోని 20 శాతం ఉద్యోగులను తొలగించడానికి సిద్ధమైంది. సంఖ్యాపరంగా పెద్దగా కనిపించకపోయినా పలు స్టార్టప్ కంపెనీలు క్యాష్‌ఫ్లో ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. మానవ వనరుల తగ్గింపునకే మొగ్గు చూపుతున్నట్లు చెబుతున్నారు. క్లార్నా సీఈవో సెబాస్టియన్ సిమియాకోవిస్కీ.. 'డజన్ల కొద్దీ ఉద్యోగులను నియమించుకునే కంటే ఒక ఏఐతో పని కానియ్యొచ్చు' అన్నారంటే దాని ప్రభావం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. క్లార్నా సంస్థ 'పర్సనల్ ఫైనాన్స్ అసిస్టెంటెన్స్' కార్యకలాపాలను అందిస్తోంది. తాజాగా వచ్చిన 'రాన్‌స్టడ్ రైజ్‌స్మార్ట్ గ్లోబల్ సెవరెన్స్' నివేదిక ప్రకారం.. ఈ ఏడాదిలో 96 శాతం సాఫ్ట్‌వేర్ సంస్థలు ఉద్యోగులను తగ్గించే కార్యక్రమాలు చేట్టాయి. ఏఐతో నిర్వహణప్రమాణాలు పెరిగాయని, కొత్త ఆవిష్కరణలకు అవకాశం ఏర్పడుతున్నదని నివేదిక వెల్లడించింది. అయితే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఏఐ నైపుణ్యాన్ని పెంచుకుంటే వారి ఉద్యోగాలకు ఢోకా ఉండదని తేల్చి చెప్పింది. 2023లో ఉద్యోగాలకు కోత పడగా, అదే సమయంలో ఏఐపై పెట్టుబడులు పెరిగాయని తెలిపింది. 'ఐటీ కంపెనీలు ప్రధానంగా స్టాక్ మార్కెట్‌లపై, రుణాలపై ఆధారపడి ఉంటాయి. తెచ్చుకున్న రుణాలపై వడ్డీరేట్లు పెరిగితే భారం పెరుగుతుంది. అలాగే స్టాక్ మార్కెట్‌లో ఆ సంస్థ స్టాక్ పడిపోయినా ఆర్థిక ఇబ్బందులు వచ్చి పడతాయి. తద్వారా లే ఆఫ్‌లు అనివార్యం అవుతున్నాయి..' అని రోమి గ్రూప్ ఎల్‌ఎల్‌సీ మేనేజింగ్ డైరెక్టర్ నిక్ గాస్లింగ్ చెబుతున్నారు.

భారతీయ కంపెనీలకు పురోగమనావకాశాలు



ప్రస్తుతం ఐటీ రంగంలో ఇన్వెస్టర్లు ముందుకు రావడం లేదు. వారు పెట్టుబడులు పెట్టే ముందు ప్రధానంగా టెక్నాలజీ కొనడమో, అప్‌గ్రేడ్ చేయడమో చేస్తుంటారు. యూఎస్, ఐరోపాతో పాటు ఇతర దేశాల్లో మార్కెట్‌ను పరిశీలిస్తే సిలికాన్ వ్యాలీ బ్యాంక్, క్రెడిట్ సుయిజ్ బ్యాంక్ వంటివి క్షీణతకు గురయ్యాయి. ముఖ్యంగా సిలికాన్ వ్యాలీ బ్యాంక్ విషయానికొస్తే ప్రపంచవ్యాప్తంగా అనేక స్టార్టప్ కంపెనీలపై ఇన్వెస్ట్ చేసింది. ఐతే పెట్టుబడులకు తగ్గట్టుగా ఈ కంపెనీల నుంచి రిటర్న్‌లు రాకపోవడంతో సంస్థ పడిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో సెకండ్, థర్డ్ స్టేజ్ పెట్టుబడులు ఆగిపోయి స్టార్టప్‌లపై తీవ్ర ప్రభావం పడింది. తదుపరి కార్యాచరణలు, ముందుకెళ్లడాలు నిలిచిపోయాయి. ఫండింగ్ నెమ్మదించి ఆయా స్టార్టప్‌లలో పనిచేసే ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి తలెత్తింది. ఔట్‌సోర్సింగ్‌లో సపోర్టింగ్ ఉన్న యూఎస్‌లోని గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, యాపిల్ వంటి సంస్థలపై కూడా ప్రభావం పడింది. ఇక ఏఐ, చాట్ జీపీటీ వల్ల కూడా ఖర్చు తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అంచనా వేస్తున్నారు. అయితే భారతీయ కంపెనీలు రాబోయే మూడు, నాలుగు నెలల్లో పరిస్థితులు మారి పురోగమనం వైపు అడుగులు వేసే అవకాశాలున్నాయి. ఇక గ్లోబల్ కేపబులిటీ సెంటర్స్ (జీసీసీ) ద్వారా టార్గెటెడ్ టెక్నాలజీ వైపు మొగ్గు పెరుగుతోంది. వీటి విషయానికొస్తే మన దేశంలోని నగరాలు మరీ ముఖ్యంగా హైదరాబాద్ ఈ సెంటర్లకు హబ్‌గా మారనుంది.

– వెంకారెడ్డి, వైస్ ప్రెసిడెంట్, సీనియర్ హెచ్ఆర్ లీడర్, కోఫోర్జ్

ఏడాది చివర్లో స్లో డౌన్ సహజం



ఏడాది చివర్లో ఐటీ రంగం కొంత స్లోడౌన్ కావడం సహజమే. వచ్చే ఏడాది కూడా ఐటీ పరిశ్రమ ఔట్ సోర్సింగ్‌పైనే అధికంగా ఆధారపడాల్సి ఉంటుంది. ఐటీ రంగంలో ఉద్యోగాలు లేకపోవడం అనే కంటే.. మారుతున్న అత్యాధునిక సాంకేతికతలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకుని సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేకపోవడమనేదే సమస్య. జనరేటివ్ ఏఐ, ఆటోమేషన్, క్లౌడ్‌ల ద్వారా వర్క్‌ఫోర్స్ తమ నైపుణ్యాలను మార్చుకునేలా చేయగలగడం ఐటీ సంస్థలకు పెద్దసవాల్. వీటి ద్వారా సంస్థలకు ప్రాజెక్టులు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. రాబోయే రోజుల్లో డేటా సెంటర్స్‌పై, ఏఐ వంటి సాఫ్ట్‌వేర్ ప్రాడక్ట్స్‌పై, ఐటీ సర్వీసెస్‌పై పెట్టుబడులు పెరుగుతాయి. 2024లో ఐటీ మార్కెట్ వృద్ధి ప్రపంచ వ్యాప్తంగా 8 శాతం, భారత్‌లో 10 శాతం ఉంటుందని ప్రతిష్టాత్మక గార్ట్‌నర్ సంస్థ తన నివేదికలో అంచనా వేసింది.

– రమణ భూపతి, క్వాలిటీ థాట్‌గ్రూప్ చైర్మన్, ఎడ్‌టెక్ కంపెనీ

3 రోజుల్లో చలాన్లకు రూ. 8.44 కోట్ల చెల్లింపు

సాక్షి, హైదరాబాద్: పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల రాయితీకి రాష్ట్ర వ్యాప్తంగా వాహనదారుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. పెద్దఎత్తున జరిమానాలు పడిన వాహనదారులు ప్రభుత్వం ప్రకటించిన రాయితీని వినియోగించుకుంటున్నారు. 3 రోజుల్లోనే 9.61 లక్షల చలాన్లకు సంబంధించి రూ.8.44 కోట్ల మేర జరిమానాలను చెల్లించారు. ఈ మేరకు రవాణా శాఖ వర్గాలు వివరాలు వెల్లడించాయి. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 3.54 లక్షల చలాన్లతో రూ. 2.62 కోట్లు, సైబరాబాద్ కమిషనరేట్ పరి ధిలో 1.82 లక్షల చలాన్ల చెల్లింపుతో రూ.1.80 కోట్లు, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 93 వేల చలాన్ల నుంచి రూ.76.79 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. కాగా, చెల్లింపులు అధికంగా ఉంటున్న నేపథ్యంలో సర్వర్ తరచూ మొరాయిస్తున్నట్లు వాహనదారులు తెలిపారు.



జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలిగా విజయభారతి

ఢిల్లీలో బాధ్యతల స్వీకరణ..

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలిగా విజయభారతి సాయని బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలో ఎన్‌హెచ్ఆర్‌సీ చైర్మన్ అరుణ్‌కుమార్ మిశ్రా సమక్షంలో గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు. న్యాయవాది, సామాజికవేత్త అయిన విజయభారతిని ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యురాలిగా నియమిస్తూ ఈ నెల 27న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్రపతి ముర్ముకు ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని విజయభారతి పేర్కొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.